

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

రాజమహేంద్రవరం : fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

6-7-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 156 పేజీలు: 8+4 వెల: 6.50



116 యేళ్ల నవనీతమ్మకు వెంకన్న విఐపి దర్శన భాగ్యం 3లో

11న ఇస్లామాబాద్‌లో అమెరికా-ఇరాన్ చర్చలు 5లో


# కుప్పం తరహాలో రాష్ట్రమంతా అభివృద్ధి

## అభివృద్ధి వికేంద్రీకరణతో ప్రణాళికలు

## డిసెంబర్ కల్లా క్వాంటం కంప్యూటర్ రెడీ

## ఏజెన్సీని గంజాయి కేంద్రంగా మార్చిన గత పాలకులు

## కుప్పంలో మీడియాతో సిఎం చంద్రబాబు



ఆదివారం కుప్పం నియోజకవర్గంలో స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న సిఎం చంద్రబాబు

**కుప్పం, జూలై 5 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గాన్ని కుప్పం తరహాలో అభివృద్ధి చేస్తామని సిఎం చంద్రబాబునాయుడు పేర్కొ న్నారు. ఆదివారం శివపురం వద్ద గల సిఎం సొంత నివాసగృహంలో మీడియాతో సిఎం చంద్ర బాబు చిట్‌చాట్ నిర్వహించారు. కుప్పానికి గతంలో ఎన్నడూరానన్ని పరిశ్రమలు వస్తున్నాయన్నారు. ఇక్కడ ఎంఎస్ఎంఇ పార్కులు, రెడ్ కనెక్టివిటీ, కమ్యూనికేషన్ రంగాలు పెంచుతున్నట్లు చెప్పారు. ఇదే తరహాలో అన్ని నియోజకవర్గాలను తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. అభివృద్ధి వికేంద్రీకరణ విధానంతో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. గొడ్డలి పార్టీ హింస, బూతులను నమ్ముకుందన్నారు. తనపై, డిసిఎం పవన్ కల్యాణ్‌పై విమర్శలు చేసేందుకు కొన్ని సామాజిక మాధ్య మాలకు ఫండింగ్ ఇస్తున్నారన్నారు. అలాగే ఫ్యాక్షన్, రౌడీ యిజాన్ని ప్రోత్స హిస్తున్నారన్నారు.
ఫండింగ్‌ద్వారా తమ ప్రభుత్వంపై దుష్ప్ర చారాలు చేయిస్తున్నారని పేర్కొన్నారు. >>2

## మత్స్యకారుల కోసం గాలింపు ముమ్మరం - సిఎం చంద్రబాబు

**కుప్పం, జులై 5 ప్రభాతవార్త :** విశాఖ పట్నం నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారులను రక్షించేందుకు గాలింపు చర్యలు ముమ్మరంగా చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ఆదేశించారు. సము ద్రంలో మత్స్యకారులు గల్లంతయ్యారన్న విషయం తెలిసిన వెంటనే సిఎం చంద్రబాబునాయుడు కుప్పం నుంచి ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. బంగాళాఖాతంలో గల్లంతైన మత్స్యకారుల బోట్‌ను గాలించేందుకు కోస్ట్‌గార్డ్ నౌక ప్రయత్నిస్తోందని అధికారులు సిఎంకు వివరించారు. వైజాగ్ ఫిషింగ్ హార్బర్ నుంచి ఇండ్‌ఎపి-విఎస్-ఎంఎం-83 అనే బోటు ఏడు మంది మత్స్యకారులతో జూన్ 1న సాయంత్రం 4గంటలకు సముద్రంలోకి చేపల వేటకు బయల్దేరి వెళ్లిందన్నారు. 4వతేది మధ్యాహ్నంకు ఆ బోటు ఫిషింగ్ హార్బర్‌కు తిరిగి రావాల్సి ఉందని అయితే సాంకేతిక >>2



## ముగింపు దిశగా రష్యా, ఉక్రెయిన్ పోరు!

### ఫోన్‌లో సుదీర్ఘంగా ట్రంప్, పుతిన్ చర్చలు

**వాషింగ్టన్/మాస్కో, జులై 5:** ప్రపంచదేశాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతున్న రష్యా - ఉక్రెయిన్ యుద్ధం ముగింపు దిశగా అడుగులు పడుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్య క్షుడు వ్లాదిమిర్ పుతిన్‌లు అర్ధరాత్రి దాదాపు 90 నిమిషాల పాటు సుదీర్ఘ ఫోన్ సంభాషణ జరిపారు అమెరికా 250వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ట్రంప్‌కు పుతిన్ శుభాకాంక్షలు తెలపడంతో ప్రారంభమైన ఈ సంభాషణ చివరకు ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించే వ్యూహాల వైపు మళ్లిందని చెబుతున్నారు. రష్యా అధ్యక్షుడి అత్యంత నమ్మకస్తుడు, విదేశాంగ వ్యవహారాల సహాయకుడు యూరి ఉషాకోవ్ ఈచర్చల వివరాలను అధికారికంగా వెల్లడించారు. కేవలం ఫార్మాలిటీ కాదు ఈ ఏడాది పుతిన్, ట్రంప్ మధ్య జరిగిన నాలుగో అధికారిక సంభాషణ ఇది. ఇది కేవలం ఒక సాధారణ ఫార్మాలిటీ కాదు. అత్యంత నిర్మాణాత్మకంగా, పనిపై స్పష్టమైన ఫోకస్‌తో ఈ చర్చలు జరిగాయి. అంతర్జాతీయంగా ప్రాధాన్యత ఉన్న అన్ని అంశాలపై ఇరు దేశాల నేతలు బహిరం గంగా మాట్లాడుకున్నారని ఉషాకోవ్ వెల్లడించారు. ఈ చర్చల సందర్భంగా ఉక్రెయిన్ యుద్ధభూమిలో ఉన్న వాస్తవ పరిస్థితిని పుతిన్ ట్రంప్‌కు వివరించారు. ప్రస్తుతం రష్యా సైన్యం లైన్ ఆఫ్ కాంటాక్ట్ వెంబడి అన్ని వైపులా వేగంగా దూసుకుపోతోందని పుతిన్ స్పష్టం చేశారు. ఉక్రెయిన్ సంక్షోభంపై యూరప్ దేశాల అవగాహన పూర్తిగా తప్పని ఈ సందర్భంగా రష్యా >>2

## ఢిల్లీలో రూ. 105 కోట్లతో 'ఆంధ్రా భవన్'

### దాదాపు 2.49 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణం

**విజయవాడ,జులై5,ప్రభాతవార్తప్రతినిధి:** భారత రాజధాని ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యాధునిక సౌకర్యాలతో కొత్త ఎపి భవన్‌ను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. సుమారు రూ.105.5 కోట్ల వ్యయంతో ఈ భవన నిర్మాణాన్ని చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థైన నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌బిసిసి)తో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఒప్పందం కుదుర్చుకుంది. ఇటీవల ఈ నిర్మాణ ఒప్పంద పత్రాలపై ఆంధ్రప్రదేశ్ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్, ఎన్‌బిసిసి చీఫ్ జనరల్ మేనేజర్ అనిల్‌కుమార్ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఇరు సంస్థల అధికారులు భవన నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేయడానికి పరస్పర సహకారంతో పనిచేయనున్నట్లు తెలిపారు. నూతన ఎపి భవన్‌ను ఆధునిక వాస్తుశిల్పం, సమకాలీన నిర్మాణ శైలికి ప్రతీకగా తీర్చిదిద్దనున్నట్లు ఎన్‌బిసిసి తన అధికారిక ఎక్స్ వేదిక ద్వారా వెల్లడించింది. పర్యావరణహిత నిర్మాణ విధానాలు, శక్తి పొదుపు సాంకేతికత, అత్యాధునిక భద్రతా ప్రమాణాలు, స్మార్ట్ మౌలిక వసతులతో ఈ భవనం రూపు దిద్దుకోనుంది. జాతీయ రాజధానిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిపాలనా కార్యకలాపాలకు మరింత సమర్థవంతమైన వేదికగా నిలవడంతో పాటు, రాష్ట్ర ప్రతిష్ఠను చాటిచెప్పే గుర్తింపుగా ఈ >>2

## రాష్ట్రంలో 5 వేల భజన మందిరాలు

### -మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి



**చేజర్ల (నెల్లూరు), జులై 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అయిదు వేల భజన మందిరాలను నిర్మించనున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి పేర్కొన్నారు. చేజర్ల మండలంలో ఆదివారం ఆయన పర్యటించి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిపారు. ఈ సందర్భంగా చిత్తలూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందుకోసం 1500 కోట్ల రూపాయలను వ్యయం చేయనున్నట్లు చెప్పారు. ఇప్పటికే 1269 భజన మందిరాలకు 216.45 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు.
రాష్ట్రంలోని ప్రాచీన దేవాలయాలను పునరు ద్ధరించి, ఆధ్యాత్మిక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 684 పురాతన ఆలయాల అభివృద్ధి పనులు రూ.808 కోట్ల వ్యయంతో కొనసాగుతున్నాయని వెల్ల డించారు. సుమారు 200-300 సంవత్సరాల చరిత్ర కలిగిన పెరుమాళ్లపాడులోని శైవ క్షేత్రానికి పూర్వ వైభవం తీసుకురావాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఆలయాన్ని గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్ద నున్నట్లు చెప్పారు. ఆలయాలు కేవలం పూజా స్థలాలు మాత్రమే కాకుండా భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం, వైదిక సంప్రదా యాలకు ప్రతీకలనిపేర్కొన్నారు.

# గల్లంతైన మత్స్యకారుల్లో ఒకరు సురక్షితం

## తీవ్ర ప్రతికూల పరిస్థితుల్లో సాగిన గాలింపు చర్యలు

## మిగిలిన ఆరుగురి కోసం సాగుతున్న అన్వేషణ

### బోటు యజమానితో పాటు మరికొందరిని కూడా రక్షించాం: మంత్రి అచ్చెన్నాయుడు

**విశాఖపట్నం, జులై 5 ప్రభాతవార్త:** విశాఖపట్నం నుంచి వేటకు వెళ్లి గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల కోసం ప్రభుత్వం యుద్ధప్రాతి పదికన చేపట్టిన సహాయక చర్యల్లో భాగంగా ఒక మత్స్యకారుడిని సురక్షితంగా రక్షించినట్లు రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. జూలై 5వ తేదీ ఉదయం సుమారు 7:30 గంటల సమయంలో సముద్రంలో ప్రయాణిస్తున్న ఎంవీ యూనివర్స్ వెల్తీ మర్చంట్ నౌక సిబ్బంది సముద్రంలో కొట్టుకుపోతున్న మత్స్యకారులను గుర్తించారు. వెంటనే నౌక కెప్టెన్ అత్యవసర సహాయక చర్యలు ప్రారంభించి, లైఫ్ రింగులు, తాళ్ల సహాయంతో ఒక మత్స్యకారుడిని ఉదయం 7:50 గంటల ప్రాంతంలో సురక్షితంగా రక్షించారు. అయితే ఆ సమయంలో గంటకు బలమైన గాలులు, సుమారు మూడు మీటర్లఎత్తులో అలలు ఉండటంతో పాటు సముద్రం అత్యంత అల్లకల్లోలంగా ఉండడం వల్ల మిగిలిన మత్స్యకారులు కనిపించకుండా పోయారని నౌక కెప్టెన్ సమాచారం అందించినట్లు మంత్రి తెలిపారు. తీవ్ర ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా రెస్క్యూ బోటును సముద్రంలోకి దించడం కూడా సాధ్యపడలేదని వివరించారు. కాకినాడ నుంచి ప్రత్యేక నౌక తెప్పించి హెలి కాప్టర్లతో కూడా గాలింపు చేసామని వెల్లడించారు.



ప్రస్తుతం మిగిలిన ఆరుగురు మత్స్యకారుల కోసం భారత కోస్ట్ గార్డ్, నేవీ, మెరైన్ పోలీస్, మత్స్యశాఖ అధికా రులు సమన్వయంతో విస్తృ తంగా గాలింపు చర్యలు కొన సాగిస్తున్నారని మంత్రి తెలిపారు. గల్లంతైన ప్రతి మత్స్యకారుడిని సురక్షితంగా రక్షించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నిస్తోందని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు. గల్లంతైన వారిలో కారి గంగయ్య, అమర అప్పలరాజు, కారి సితోడు, మేడ చిన అమ్మోరు, కారి చిన్నయ్య, రాగుతూ బండియ్య ఉన్నారని,ప్రాణాలకు తెగించి కారి చిన్న మత్స్య >>2



# వాయు 'గండం'

## 3 రోజులు భారీ వర్ష సూచన

**విజయవాడ,జూలై5,ప్రభాతవార్తప్రతినిధి:** వాయవ్య బంగాళాఖాతం, ఉత్తర ఒడిశా బెంగాల్ తీర ప్రాంతాల్లో అల్పపీడనం వాయుగుండంగా బల పడిందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ప్రస్తుతం బాలాసోర్‌కు 50 కి.మీ., చాంద్‌బలికి 60 కి.మీ., దిఘాకు 60 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉందని వాతావరణ శాఖ తెలిపింది. రాబోయే 24 గంటల్లో బాలాసోర్ సమీపంలో తీరం దాటే అవకాశముంది. వాయు గుండం ప్రభావంతో ఆదివారం ఉత్తరాంధ్రలో పలుచోట్ల భారీ వర్షాలు కురిసాయని తెలిపారు. ఉత్తరాంధ్రలో పలు జిల్లాల్లో నేడు ఈదురు గాలులతో కూడిన వానలు పడినట్లు సమాచారమని తెలిపారు. మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు పడవచ్చని అంచనా. ఆంధ్రప్రదేశ్ వాసులకు ఎపి విపత్తు నిర్వహణ సంస్థ వర్ష సూచనలు జారీచేసింది. వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మరో మూడురోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఈ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు. వాయువ్య బంగాళాఖాతం, ఉత్తర ఒడిశా పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాల్లో వాయుగుండంగా కేంద్రీకృతమై ఉందని ప్రఖర్ జైన్ వెల్లడించారు. ఇది ప్రస్తుతానికి బాలాసోర్ (ఒడిశా)కు 40 కి.మీ., చాంద్‌బలి (ఒడిశా)కు 50 కి.మీ., దిఘా (పశ్చిమ బెంగాల్)కు 70 కి.మీ దూరంలో ఉందని తెలిపారు. పశ్చిమవాయువ్య దిశగా కదులుతూ రాబోయే 12 గంటల్లో చాంద్‌బలి - దిఘా మధ్య బాలాసోర్ సమీపంలో ఉత్తర ఒడిశా తీరాన్ని దాటే అవకాశం ఉందన్నారు. ఆ తదుపరి 24 గంటల్లో ఇది ఉత్తర ఒడిశా, ఛత్తీస్‌గఢ్ మీదుగా కదిలే అవకాశం ఉందన్నారు. దీని ప్రభా >>2



హాంగ్‌కాంగ్ ఎయిర్‌పోర్టులో చిక్కుకున్న తెలుగు కుటుంబం

## హాంగ్‌కాంగ్ ఎయిర్‌పోర్టులో చిక్కుకున్న తెలుగు ఫ్యామిలీ


- వెంటనే బాధితులకు సాయం అందించిన మంత్రులు లోకేష్, కొండపల్లి
- డూప్లికేట్ పాస్‌పోర్టుకు అనుమతించేలా ఏర్పాట్లు

**విజయనగరం, జులై 5, ప్రభాతవార్త :** హాంకాంగ్ ఎయిర్‌పోర్టులో చిక్కుకున్న తెలుగు కుటుంబానికి రాష్ట్ర ఐటీ, విద్యా, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బాసటగా నిలిచారు. హైదరాబాద్ నుంచి చికాగో వెళ్తుండగా, ప్రయాణంలో పాస్‌పోర్ట్‌లు పోగొట్టుకోవడంతో హాంకాంగ్ విమానాశ్రయంలో తెలుగు కుటుంబం చిక్కుకు పోయింది. హాంకాంగ్ ఎయిర్‌పోర్టు నుంచి చిన్నపిల్లలతో తాము పడుతున్న ఇబ్బంది >>2

# ప్రవాసాంధ్రులంతా ఎపి బ్రాండ్ అంబాసిడర్లే

## ప్రపంచంలో ఎక్కడకు వెళ్లినా తెలుగువారే..


### దక్షిణ కొరియా విజయగాథ మనకు ప్రేరణ: సియోల్‌లో మంత్రి లోకేష్



ఆదివారం సియోల్‌లో తెలుగు డయాస్పోరా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి లోకేష్

**విజయవాడ.జులై5,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రవాసాంధ్రులంతా ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ అంబాసిడర్లే అని ఎపి విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఇక్కడ మీలో ఉన్న ప్రతిఒక్కరూ రాష్ట్రానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకుని వచ్చేవారేనన్నారు. మీరు విజయాన్ని సాధించినప్పుడు, వ్యాపారం ప్రారంభించినప్పుడు, మంచి పేరును సంపాదించినప్పుడల్లా ఆంధ్రప్రదేశ్ గర్వపడుతుంది. మీరు వెళ్లే ప్రతీచోట ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి గాథను చెప్పాలన్నది నా ఆకాంక్ష అని అన్నారు. సియోల్‌లో తెలుగు డయాస్పోరా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. ప్రపంచంలో తెలుగు ప్రజలు లేని దేశం లేదు. ఏ దేశంలో, ఏ ప్రాంతానికి వెళ్లినా అక్కడ తెలుగు ప్రజల ఉనికి ఉంటుంది. నేను ఎక్కడికెళ్లినా నా పరిచయాలు తెలుగు సమాజంతోనే మొదలవుతాయి. విదేశాల్లో ఉంటున్న తెలుగువారికి తమ దేశం, సంస్కృతిపై అపారమైన ప్రేమ. వారు ఎంత దూరంలో ఉన్నా భారతీయ >>2

# కెల్విన్ వేవ్




## సముద్రం అడుగున 14,500 కి.మీ. భారీ ఉష్ణ ప్రవాహం

### గుర్తించిన 'నాసా'... పర్యవేక్షిస్తున్న 'సెంటినెల్6'

### శీతాకాలం నాటికి బలంగా మారే అవకాశం

### ప్రపంచ దేశాలకు సూపర్ ఎల్ నినో ముప్పు

### వాతావరణ శాస్త్రవేత్తల ఆందోళన

**న్యూఢిల్లీ, జులై 5:** పసిఫిక్ మహాసముద్రం అడుగున ఎక్కడో, ఒక భారీ వెచ్చని నీటి ప్రవాహం కదులుతోంది. ఇది ఇండోనేషియా సమీపంలో ప్రారంభమై, నెలల తరబడి భూమధ్యరేఖ వెంబడి తూర్పు వైపు కదులుతోంది. ఈ నెమ్మదైన, కంటికి కనిపించని వేడి ప్రవాహం ఉష్ణమండల పసిఫిక్‌లో దాదాపు 14,500 కిలోమీటర్ల మేర విస్తరించిందని వాతావరణ శాస్త్రవేత్తలు వర్ణించారు. ఏ ఓడ, ఏ నావికుడు కూడా దానిని చూడలేకపోయాడు. అయినప్పటికీ, 1,300 కిలోమీటర్ల ఎత్తులో కక్ష్యలో తిరుగుతున్న నాసా ఉపగ్రహం దీనిని గుర్తించింది. ఎందుకంటే ఆ వెచ్చని నీరు వెళుతున్నప్పుడు, దానిపై ఉన్న సముద్ర ఉపరితలం నిశ్శబ్దంగా సుమారు 15 సెంటీమీటర్లు పెరిగింది. 2026 వసంతకాలం వరకు గమనించిన ఆ స్వల్ప ఉబ్బరం, సముద్రం నెలల ముందుగానే పంపిన ఒక హెచ్చరిక. జూన్ 11న, >>2



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

# ప్రైవేటు బస్సు ఢీకొని నలుగురు మృతి

## కాకినాడకు చెందిన తల్లి, ఇద్దరు పిల్లలు, సన్నిహితుడు చిట్యాలలో దుర్మరణం

**చిట్యాల రూరల్, జులై 5, ప్రభాతవార్త:** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులోని పెద్దచెరువు సమీపంలో జాతీయ రహదారి (ఎన్‌హెచ్‌65)పై ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం పాలవగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఒకే కుటుంబానికి చెందిన తల్లి, కుమార్తె, కుమారుడు అక్కడికక్కడే మృతి చెందగా, వారితో ప్రయాణిస్తున్న కుటుంబ సన్నిహితుడు, సినీ పరిశ్రమలో ఫిల్మ్ ఎడిటర్‌గా పనిచేస్తున్న కట్ల శ్రీధర్ ప్రసాద్ కూడా ప్రాణాలు కోల్పోయారు. కారు నడుపుతున్న వీర వెంకట నాగవర ప్రసాద్ బాబు తీవ్ర గాయాలయ్యాయి. నార్కట్‌పల్లి సిఐ సిరికొండ సురేష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడకు చెందిన మలిరెడ్డి వీర వెంకట నాగవర ప్రసాద్ బాబు, ఆయన భార్య విజయలక్ష్మి (40), కుమార్తె శ్రేయ (17), కుమారుడు ప్రభవ్ (12), కుటుంబ సన్నిహితుడు, హైదరాబాద్ గుండ్లపోచంపల్లికి చెందిన సినీ పరిశ్రమ ఫిల్మ్ ఎడిటర్ కట్ల శ్రీధర్ ప్రసాద్ (62) వ్యక్తిగత పనుల నిమిత్తం చెన్నై వెళ్లి ఎపి09 సిఆర్0010 నంబర్ గల వెర్నా కారులో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. ఆదివారం తెల్లవారుజామున సుమారు 4.40 గంటల సమయంలో పెద్దకాపర్తి గ్రామ శివారులోని పెద్దచెరువు సమీపానికి చేరుకోగానే, వైజాగ్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఒడి18ఏక్యూ6786 నంబర్ గల ఆర్యన్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి అతివేగంగా వచ్చి కారును బలంగా ఢీకొట్టింది. ప్రమాదం తీవ్రతకు కారు చుట్టూ తిరుగుతూ డివైడర్‌ను ఢీకొని పూర్తిగా నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో విజయలక్ష్మి, ఆమె కుమార్తె శ్రేయ, కుమారుడు ప్రభవ్, కుటుంబ సన్నిహితుడు కట్ల శ్రీధర్ ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందారు. కారు నడుపుతున్న వీర వెంకట నాగవర ప్రసాద్ బాబుకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన వాహనదారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి చిట్యాల పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ మామిడి రవికుమార్, ఏఎస్‌ఐ జానిరెడ్డి, పోలీసు సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కారు పూర్తిగా ధ్వంసం కావడంతో మృతదేహాలు, గాయపడిన వ్యక్తి లోపలే ఇరుక్కుపోయారు. దీంతో జెసిబి, క్రేన్ సహాయంతో కారు పైభాగాన్ని, డోర్లను తొలగించి తీవ్రంగా శ్రమించి వారిని బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన వీర వెంకట నాగవర ప్రసాద్ బాబును అంబులెన్స్‌లో నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు సమాచారం. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నల్గొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన మలిరెడ్డి వీర వెంకట నాగవర ప్రసాద్ బాబు, మృతులు విజయలక్ష్మి, శ్రేయ, ప్రభవ్ స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలోని శ్రీరాంనగర్ కాగా, ప్రస్తుతం హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ మధురానగర్‌లో నివాసముంటుండగా, శ్రీధర్ ప్రసాద్ హైదరాబాద్‌లోని గుండ్లపోచంపల్లిలో నివాసముంటున్నారు. గాయపడిన వీర వెంకట నాగవర ప్రసాద్ బాబు గతంలో ఎన్‌టిపిలో మేనేజర్‌గా పనిచేసి, ఇటీవల పదవీవిరమణ పొందినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ప్రమాదం కారణంగా హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు, ఎన్‌హెచ్‌ఎఐ సిబ్బంది క్రేన్ సహాయంతో ప్రమాదానికి గురైన కారును రహదారి పక్కకు తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

# ఎపి బ్రాండ్ అంబాసిడర్లే

>> సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబిస్తారు. దక్షిణ కొరియాలోని భారతీయ సమాజానికి నా హృదయపూర్వక అభినందనలు. ఎంబసీ అధికారులు, నిర్వాహకులు, ఈ వేదిక ఏర్పాటుచేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. దేశం నుంచి దూరంగా ఉన్న ప్రతి భారతీయుడినీ కలిసిన ప్రతిసారి నాకు ఒకింత గర్వంగా ఉంటుంది. మీ కష్టపడేతత్వం, నైపుణ్యం, సంకల్పం ద్వారా మీరు భారతకు గౌరవాన్ని సమకూరుస్తున్నారు. మీ ప్రతి విజయం భారతదేశ ప్రతిష్ఠను పెంచుతుంది అన్నారు.

**దక్షిణకొరియా విజయగాథ మనకు ప్రేరణ..**

దక్షిణ కొరియా అభివృద్ధి ప్రయాణం ఆదర్శనీయం. దక్షిణ కొరియా ఇప్పుడు సాంసంగ్, హుండాయి.ఎల్‌జీ వంటి ప్రఖ్యాత కంపెనీలను ప్రపంచవ్యాప్తంగా తన సత్తా చాటుతున్నాయి. సంపద కేవలం ప్రకృతి వనరుల ఆధారంగా రాదని.. శ్రమ, ఆవిష్కరణ, శాస్త్రీయ దృక్పథం, తపన ద్వారానే దేశాలు అభివృద్ధిపథంలో ముందుకెళతాయని దక్షిణ కొరియా నిరూపించింది. దక్షిణ కొరియా విజయగాథ మనకు, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కి పెద్ద ప్రేరణ. భారత్ దక్షిణ కొరియా మధ్య సంబంధం కేవలం వాణిజ్యం మాత్రమే కాదు. మన భాగస్వామ్యం ప్రజాస్వామ్య విలువలు, పరస్పర విశ్వాసం, ఆవిష్కరణ, యువతపై పెట్టుబడి అనే పటిష్ట మూలాలపై ఆధారపడి ఉంది. గత కొన్ని సంవత్సరాల్లో ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, సెమీ కండక్టర్లు, షిప్ బిల్డింగ్, గ్రీన్ ఎనర్జీ, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఉన్నత విద్య వంటి రంగాల్లో రెండు దేశాలు కలిసి మంచి ఫలితాలను సాధించాయన్నారు.

**కియాతో ఆటో మొబైల్ ఎకోసిస్టమ్ అభివృద్ధి..**

కియా తమ మొదటి ఇన్‌ఇండియా ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడానికి స్థలాలు అన్వేషిస్తున్నపుడు ఆంధ్రప్రదేశ్ తక్షణ నిర్ణయం తీసుకొని, పారదర్శకత, వేగవంతమైన అనుమతులు, భూమి, మౌలిక సదుపాయాలను సమకూర్చి నిజమైన భాగస్వామిగా నిలిచింది. ఫలితంగా ఆవిష్కృతమైందే కియా ప్లాంట్. కేవలం కార్ల తయారీ కేంద్రంగానే కాకుండా, ఒక పూర్తిస్థాయి ఆటోమొబైల్ ఎకోసిస్టమ్‌గా మారి, వేలాదిమందికి ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు కల్పించింది. మన ఈ ప్రయాణాన్ని మరిన్ని సక్సెస్ స్టోరీలుగా మార్చాలి. ఐటీ, సెమికండక్టర్లు, మొబిలిటీ, బ్యాటరీ టెక్నాలజీలు, గ్రీన్ హైడ్రోజన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్ ఏ రంగంలోనైనా ఆంధ్రప్రదేశ్ దక్షిణ కొరియాకు భారతదేశంలో అత్యంత నమ్మకమైన భాగస్వామి కావడానికి సిద్ధంగా ఉంది. వచ్చే దశాబ్దం ఎపి కేంద్రంగా భారత్-దక్షి ణ కొరియా సంబంధాలు మరింత బలపడతాయని నేను విశ్వసిస్తున్నాను. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌తో కొత్త భాగస్వామ్యాలు వికసిస్తాయని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

# రాష్ట్రమంతా అభివృద్ధి

>> **మేం తెచ్చిన ప్రాజెక్టులు వారే తెచ్చామంటారు**

తమ కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రతి ప్రాజెక్టును తామే తెచ్చామని చెప్పుకుంటున్నారని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమాలకు అడ్డుపడుతున్నారన్నారు. వాస్తవం లేకపోయినా అదేపనిగా అసత్యాలు చెబితే ఎవరూ నమ్మరని, దాన్ని ప్రజలు గుర్తించాలని పేర్కొన్నారు. ఆర్సెలార్ మిట్టల్ ప్రపంచంలో దిగ్గజ స్టీల్ కంపెనీ అని దీన్ని తాము తీసుకువచ్చామన్నారు.అలాగే జెఎస్‌డబ్ల్యు కంపెనీ సైతం వచ్చిందన్నారు. గత పాలకుల కంపెనీలకు తరిమేయడం, పరిశ్రమల్ని పారిపోయేలా చేశారన్నారు. గత ఏడాది కంపెనీలకు భూములు ఇచ్చి వివాదాల్లో నెట్టారని పేర్కొన్నారు. ఓ వ్యక్తి లబ్ధి కోసం విలువైన భూములు, ఖనిజ సంపద బ్లాక్ అయిందన్నారు. ఓబుళాపురం గనులతో సహా అనేక కూడా ఇలానే ఇబ్బందుల్లో పడిందన్నారు. తిరుమల ప్రసాదం కల్తీ చేసి భక్తుల మనోభావాలు దెబ్బతీసిన వ్యక్తులు ఇప్పుడు నీతులు చెబుతున్నారని పేర్కొన్నారు. గత పాలకులు ఏజెన్సీ ప్రాంతాన్ని గంజాయి సాగు కేంద్రంగా మార్చారన్నారు. డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు తమ ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టిందన్నారు. కేంద్రం కూడా డ్రగ్ ఫ్రీ ఇండియా క్యాంపెయిన్ చేపట్టిందన్నారు.

**డిసెంబర్‌లో క్వాంటం కంప్యూటర్ రెడీ**

డిసెంబర్ కల్లా అమరావతిలో క్వాంటం కంప్యూటర్ సెంటర్ కార్యకలాపాలు ప్రారంభం అవుతాయని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు.సెమీ కండక్టర్ల విభాగంలో పెట్టుబడులు తెచ్చే దిశగా ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో పరిశ్రమలతో పాటు వచ్చేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు.ఇంధన రంగంలో సౌర, పవన విద్యుత్ ఉత్పత్తితో పాటు ఇతర అత్యుత్తమ విద్యుత్ సరఫరా విధానాలు అందుబాటులో తెస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు పరిష్కారం చూపుతున్నామని సిఎం చెప్పారు. రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం పెంపుకు చర్యలు చేపట్టామన్నారు. రాయలసీమ అభివృద్ధికి నీటి ప్రాజెక్టులు తెచ్చామన్నారు. కుప్పానికి హంద్రీ-నీవా తెచ్చామని త్వరలోనే తిరుమల కళ్యాణిడ్యామ్‌కు సైతం నీరు చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.కార్యక్రమంలో చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

# మత్స్యకారుల కోసం గాలింపు ముమ్మరం

>> కారణాలతో ఇంతవరకు తిరిగి రాలేదని వివరించారు. గంగవరం సముద్ర తీరంలో బోటుకు సా ంకేతిక సమస్య ఉత్పన్నమైనట్లు గుర్తించామని అధికారులు సిఎంకు తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి నౌకా దళంకు చెందిన హెలికాప్టర్ల ద్వారా గాలింపు చర్యలు ప్రారంభించామన్నారు. ప్రస్తుతం కోస్ట్‌గార్డ్, నేవీ, మెరైన్ పోలీసు విభాగాలు గాలింపుచర్యలు చేపట్టినట్లు సిఎంకు తెలిపారు. దీనిపై స్పందించిన సిఎం చంద్ర బాబు సముద్రంలో చేపడుతున్న గాలింపు చర్యలను సమన్వయం చేసుకోవాలని మెరైన్ ఐజి, వైజాగ్‌సిపిలను ఆదేశించారు. గాలింపుచర్యలఅంశాలు తనకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. మత్స్య కారులకుటుం బాలకు ధైర్య ం చెప్పాలని మంత్రి అచ్చెన్నాయుడు, వైజాగ్ ప్రజాప్రతినిధులకు సిఎం ఆదేశించారు.

# జీరామ్‌జీ అమలు కోసం 25,863 కోట్లు విడుదల

## పారదర్శకత, గ్రామీణ ఉపాధి విస్తరణ చేయాలి

## రాష్ట్రాలకు కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ సూచన

**న్యూఢిల్లీ, జులై 5:** 'వికసిత్ భారత్-గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) (విబి జి రామ్‌జి) పథకం అమలు కోసం కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆదివారం రూ.25,863 కోట్ల మొదటి విడత నిధులను విడుదల చేశారు. విబి జి రామ్‌జి పథకం అమలులో భాగంగా ఉన్న ఈ నిధులను, అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల గ్రామీణాభివృద్ధి మంత్రులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా విడుదల చేశారు. వర్చువల్‌గా నిర్వహించిన సమావేశంలో శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ, 15 రోజుల్లోపు వేతనాలు చెల్లించేలా రాష్ట్రాల వద్ద తగిన నిధులు ఉం డేలా చూడటమే ఈ మొదటివిడత విడుదల ఉద్దేశమని పేర్కొన్నారు. వేతనాల చెల్లింపులో ఎటువంటి జాప్యం జరగకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వాలన్నీ తమ వాటా నిధులను సకాలంలో విడుదల చేయాలని ఆయ న కోరారు. జులై 1 నుండి దేశవ్యాప్తంగా ఎటువంటి అంతరాయం లేకుండా విబి జి రామ్‌జిని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన చెప్పారు. దేశవ్యాప్తంగా ఈ పథకం విజయవంతంగా ప్రారంభమైందని, ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ నుండి విబి జి రామ్‌జికి మారే ప్రక్రియ సజావుగా, ఎటువంటి సమస్యలు లేకుండా జరిగిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ఎటువంటి సాంకేతిక లేదా నిర్వహణ పరమైన సమస్యలు నమోదు కాలేదని తెలిపారు. మొదటి వారంలోనే పెద్ద సంఖ్యలో గ్రామ పంచాయతీలలో పనులు ప్రారంభమయ్యాయని, లక్షలాది మంది గ్రామీణ కార్మికులకు ఉపాధి కల్పించబడిందని మంత్రి చెప్పారు. మొదటి రోజే భారీగా ఉపాధి అవకాశాలను కల్పించినందుకు ఆంధ్రప్రదేశ్, కేరళ, రాజస్థాన్ రాష్ట్రాలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మిగిలిన గ్రామ పంచాయతీలలో కూడా వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లను కోరారు. అలాగే జార్ఖండ్ ఈ పథకాన్ని అధికారికంగా ప్రకటించి, అవసరమైన బడ్జెట్ కేటాయింపులు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆర్‌బిఐ ఖాతాలులేదా ఇతరలాంఛనాలు ఇంకా పెండింగ్‌లో ఉన్న రాష్ట్రాలు వాటిని నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయాలని కూడా సూచించారు. గ్రామీణ కార్మికులకు గౌరవప్రదమైన ఉపాధి, సకాలంలో వేతనాల చెల్లింపు, దీర్ఘకాలిక గ్రామీణ ఆస్తుల కల్పనను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ పథకం అమలులోకి రావడానికి దాదాపు మూడేళ్లు పట్టినప్పటికీ, విబి జి రామ్‌జి పథకం మాత్రం ఒక్క రోజులోనే దేశవ్యాప్తంగా ప్రారంభించబడిందని చౌహాన్ పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వం, రాష్ట్రాల సహకారం, దేశ పరిపాలనా సామర్థ్యం కారణంగానే ఈ గొప్ప విజయం సాధ్యమైందని ఆయన అభివర్ణించారు. విబి జి రామ్‌జి కింద వేతన రేట్లు సగటున దాదాపు 10 శాతం పెంచబడ్డాయని, ఇకపై దేశంలోని ఏ రాష్ట్రంలోనూ రోజువారీ వేతనం రూ.300 కంటే తక్కువగా ఉండదని ఆయన తెలిపారు. గ్రామీణ కార్మికుల ఆదాయం, సామాజిక భద్రతను బలోపేతం చేయడంలో ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు ఇది నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. విబి జి రామ్‌జి పథకం సమర్థవంతమైన అమలుకు నిధుల కొరత ఉండదని మంత్రి స్పష్టం చేశారు.

### వారం - వర్జ్యం

06-07-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, పునర్వసు కార్తె
షష్ఠి మ.1.43, పూర్వాభాద్ర సా4.03
వర్జ్యం : రా.1.45-రా.3.22
దు.మ.12.38-మ.1.30,
2)మ.3.15-సా.4.07
రాహుకాలం - ఉ.7.30-9.00

### వార్తాఫలం

**మేషం:** నిర్మాణ సంబంధమైన లోన్లు మంజూరవుతాయి. ఆర్థికపరమైన సర్దుబాటులను అద్భుతముగా చేయగలుగుతారు.

**వృషభం:** విదేశములకు సంబంధించిన యత్నములకు ఇతరులకు పరపతిని నమ్ముకోవడం కన్నా స్వయంకృషి చేయడం మంచిది.

**మిథునం:** మానసిక శారీరక శ్రమ అధికమవుతుంది. ఫలితాలు కూడా లాభసాటిగానే ఉంటాయి. బంధువుల కలయిక.

**కర్కాటకం:** మీలోని వ్యక్తిగత ప్రతిభ, మంచితనము, కష్టపడి పనిచేసే తత్త్వము కార్యాలయములో గుర్తింపునకు నోచుకుంటాయి.

**సింహం:** దీర్ఘాలోచనల కన్నా సమయస్ఫూర్తితో వెనువెంటనే తీసుకునే నిర్ణయాల వల్ల లాభపడతారు.

**కన్య :** సంతానం వలన మానసిక శాంతి గోచరిస్తోంది. ఉన్నతావకాశములు లభిస్తాయి. వాహనసౌఖ్యం ఏర్పడుతుంది.

**తుల :** పరిస్థితులకు అనుగుణంగా మీ అభిరుచులను మార్చుకోగలుగుతారు. పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

**వృశ్చికం:** మాటల వరకే కోపమును పరిమితము చేయటం వలన లాభపడతారు. ఎగుమతి ఆర్డర్లు అనుకూలిస్తాయి.

**ధనుస్సు:** పోటీ పరీక్షలలో మీరు ఊహించిన ఫలితాలు పొందలేరు. ఉద్యోగులకు స్థానమార్పులు కలుగుతాయి.

**మకరం:** ముఖ్యమైన శుభకార్యమును వ్యవహారమును చక్కబెట్టి బరువు బాధ్యతలను దించుకుంటారు.

**కుంభం:** రావలసిన మొండిబాకీలు వసూలవుతాయి. సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

**మీనం:** నిర్మోహమాటంగా వ్యవహరించి కొన్ని కార్యక్రమాలలో విజయం సాధిస్తారు. కీర్తిప్రతిష్ఠల కోసం తాపత్రయపడతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కెల్విన్ వేవ్

>> అమెరికా వాతావరణ సంస్థ నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ (నోవా) ఎల్ నినో ఏర్పడిందని ప్రకటించింది, ఇది ఒక అరుదైన, శక్తివంతమైన సంఘటనగా మారగలదని వాతావరణ నిపుణులు భావిస్తున్నారు.

**కెల్విన్ వేవ్ అంటే ఏమిటి? అది ఎల్ నినోను ఎలా ప్రేరేపిస్తుంది?**

సాధారణంగా, వాణిజ్య పవనాలు పసిఫిక్ మీదుగా తూర్పు నుండి పడమరకు వీస్తాయి. ఇవి ఇండోనేషియా సమీపంలో వెచ్చని నీటిని పోగుచేస్తుండగా, పెరూ తీరంలో చల్లని, పోషకాలు అధికంగా ఉన్న నీరు ఉపరితలంపైకి వస్తుంది. ఈ విధంగా లోతైన చల్లని నీరు పైకి రావడాన్ని అప్‌వెల్లింగ్ అంటారు. అప్పుడప్పుడు, ఈ పవనాలు బలహీనపడి, కొద్దికాలం పాటు వ్యతిరేక దిశలో వీస్తాయి. పశ్చిమాన ఉన్న వెచ్చని నీటి పర్వతం అప్పుడు తూర్పు వైపుకు జారుతూ తిరిగి వస్తుంది. వందల కిలోమీటర్ల వెడల్పుతో, పసిఫిక్‌లో చాలా వరకు విస్తరించి ఉన్న ఈ నెమ్మదైన నీటి అడుగున ఉప్పెననే కెల్విన్ తరంగం అంటారు. వెచ్చని నీరు వ్యాకోచించి ఎక్కువ స్థలాన్ని ఆక్రమించడం వల్ల, దానిపై ఉన్న సముద్ర ఉపరితలం పైకి లేస్తుంది. ఈ తరంగం, వెచ్చని ఉపరితల నీటికి, చల్లని లోతులకు మధ్య ఉన్న సరిహద్దు అయిన థర్మోక్లైన్‌ను కూడా కిందికి నెడుతుంది. దీనివల్ల దక్షిణ అమెరికా సమీపంలో చల్లబరుస్తున్న అప్‌వెల్లింగ్ ఆగిపోతుంది. తూర్పు పసిఫిక్ వేడెక్కుతుంది, ఎల్ నినో పుడుతుంది.

**నాసా 'సెంటినెల్6' ఉపగ్రహం దీనిని ఎలా గుర్తించింది?**

నాసా, దాని యూరోపియన్‌భాగస్వాములు 2020లో ప్రయోగించిన 'సెంటినెల్ 6 మైఖేల్ ఫ్రీలిచ్ ఉపగ్రహం, ప్రతి 10 రోజులకు ఒకసారి మొత్తం సముద్రపు ఎత్తును అంగుళంలో కొంత భాగం వరకు కచ్చితత్వంతో మ్యాప్ చేస్తుంది. ఇది జనవరి చివరిలో మైక్రోనేషియా సమీపంలో ఒక చిన్న కెల్విన్ తరంగాన్ని గుర్తించింది, అది ఫిబ్రవరి మధ్యనాటికి క్షీణించింది. మార్చి ప్రారంభంలో అంతకంటే చాలా పెద్ద తరంగం ఉద్భవించి తూర్పువైపుకు కదిలింది. మే మధ్య నాటికి, పెరూ చుట్టూ ఉన్న సముద్రాలు దీర్ఘకాల సగటుల కంటే 15 సెంటీమీటర్లకు పైగా ఎత్తులో ఉన్నాయి.

**2026లో సూపర్ ఎల్ నినో వస్తుందా?**

రావచ్చు. 1997, 2015 సంవత్సరాలనాటి ఎల్ నినోల వంటి అత్యంత బలమైన ఎల్ నినోకు సూచిక అయిన పసిఫిక్ సముద్రపు ఉష్ణోగ్రతలు, సగటు కంటే 2డిగ్రీల సెల్సియస్ మేర పెరిగేందుకు 63 శాతం అవకాశంఉందని నోవా వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. భారతదేశానికి ఇది ఒక అవాంఛనీయ పరిణామం. చారిత్రాత్మకంగా, బలమైన ఎల్ నినో సంఘటనలు నైరుతి రుతుపవనాలను బలహీనపరుస్తాయి, అయితే హిందూ మహాసముద్ర ద్విధ్రువం వంటి అంశాలు ఈ ప్రభావాన్ని కొంతవరకు తగ్గించగలవు. ఈ సంఘటన ఈ శీతాకాలంలో గరిష్ట స్థాయికి చేరుకుంటుంది. ప్రపంచ దేశాలకు ఈ సూపర్ ఎల్ నినో పెనుముప్పు అని వాతావరణ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇలాంటి భారీ వెచ్చటి నీటి ప్రవాహం పసిఫిక్ మహాసముద్రం దాటిన ప్రతిసారి ప్రపంచ వాతావరణంలో పెద్ద మార్పులు జరిగాయి. కొన్ని దేశాలు తీవ్ర కరువును ఎదుర్కొన్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదలు నమోదయ్యాయి. ఇప్పుడు మరోసారి అలాంటి సంకేతాలే కనిపిస్తున్నాయి.



ఆదివారం సియోల్‌లో భారత రాయబారి గౌరంగలాల్ దాస్‌తో మంత్రి లోకేష్ భేటీ అయిన దృశ్యం

# కొరియన్ ఎలక్ట్రానిక్స్, చిప్ కంపెనీలు ఎపికి వచ్చేలా సహకరించండి

## సియోల్‌లో భారత రాయబారి గౌరంగలాల్ దాస్ తో మంత్రి లోకేష్ భేటీ

**విజయవాడ,జులై 5, ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్‌తో సియోల్‌లో దక్షిణ కొరియా భారత రాయబారి గౌరంగలాల్ దాస్ మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... శాంసంగ్, ఎల్‌జీ, ఎస్‌కె, ఎఎస్‌ఐపి- ఎపిఎసిటఓశాట్‌ల ఆధారంగా, ఇండియా సెమీకండక్టర్ మిషన్, ఎపి ఎలక్ట్రానిక్స్ పాలసీ 4.0కు అనుగుణంగా కొరియన్ ఎలక్ట్రానిక్స్ కంపెనీలు, చిప్ దిగ్గజాలను ఎపికి రప్పించేందుకు సహకారం అందించాలని కోరారు. ఎపిలో శ్రీసిటీ, నాయుడుపేట, కొప్పర్తి, విశాఖపట్నంలలో రెడీ టు యూజ్ క్లస్టర్లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఐఐటి తిరుపతి, ఐఐఐటి శ్రీసిటీ, ఆంధ్ర విశ్వవిద్యాలయాలతో కలిసి కొరియా అనుసంధాన నైపుణ్య కార్యక్రమాలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కొరియా అధ్యక్షుడు లీ జేమ్యుంగ్ ఏప్రిల్ 2026లో భారత్ పర్యటన సందర్భంగా "కొరియా ఎన్‌క్లేవ్" ఏర్పాటు కోసం చేసిన ప్రతిపాదనకు కార్యరూపం ఇచ్చేందుకు.. కొరియన్ చిన్న, మధ్య తరహా పరిశ్రమల కోసం ఉద్దేశించిన ఒక ప్లగ్‌అండ్‌ప్లే టౌన్‌షిప్‌కు శ్రీసిటీలో ఆతిథ్యం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని లోకేష్‌తెలిపారు. కొరియా ప్రాధాన్యతారంగ పరిశ్రమలను ఎపికి తీసుకొచ్చేందుకు చొరవచూపాలని కోరారు. అనంతపురంలో కియా/హ్యుందాయ్ మొబిస్ ఆటోఈవీ క్లస్టర్‌ను విస్తరించడంపై చర్చించారు. ఆంధ్రప్రదేశ్ తీరంలో హెచ్‌డి హ్యుందాయ్ తరహా గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్‌ను ఏర్పాటు, బ్యాటరీ/గ్రీన్‌హైడ్రోజన్ ప్రాజెక్టుల ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించాల్సిందిగా సూచించారు.

# ఎయిర్‌పోర్టులో చిక్కుకున్న తెలుగు ఫ్యామిలీ

>> లను మంత్రి నారా లోకేష్‌కు ఎక్స్ (ట్విట్టర్) ద్వారా బాధితురాలు బొల్లా రాజేశ్వరి వివరించారు. రాజేశ్వరి ట్వీట్‌కు స్పందించిన మంత్రి నారా లోకేష్ వెంటనే కేంద్రమంత్రి జైశంకర్‌తో మాట్లాడారు. బొండపల్లి పర్యటనలో ఉన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు విషయం తెలిసిన వెంటనే బాధితులకు తక్షణమే తాత్కాలిక పాస్‌పోర్టులు ఏర్పాటు చేసి, సురక్షితంగా ఇండియా తీసుకురావాలని ఎపి ఎన్నార్టీ అధికారులను ఆదేశించారు. రాజేశ్వరి కుటుంబానికి హాంకాంగ్‌లో ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం చేస్తుందని కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు.అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన మంత్రి నారా లోకేష్ పాస్‌పోర్ట్ నిబంధనల ప్రకారం పాస్‌పోర్ట్ కలిగిన వ్యక్తులు పాస్‌పోర్ట్ పోయిన యెడల స్వదేశానికి తిరిగి వచ్చి పాస్‌పోర్ట్ కోసం ధరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. దాంతో పాస్‌పోర్ట్ కేంద్రం వారు పరిశీలన చేసి డూప్లికేట్ పాస్‌పోర్ట్ మంజూరు చేయటం జరుగుతుంది. కానీ దీనికి భిన్నంగా ఎయిర్‌పోర్ట్‌లో చిక్కుకున్న బాధిత కుటుంబాల కోరిక మేరకు లోకేష్ హాంకాంగ్ నుంచి పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేయించి ఢిల్లీ నుండి హాంకాంగ్‌కు కొరియర్ పంపించే ఏర్పాట్లు చేసేలా ఎంబసీ వారితో చర్చలు జరిపారు. తద్వారా డూప్లికేట్ పాస్‌పోర్ట్ మంజూరు చేయించి వారి ప్రయాణాన్ని హాంకాంగ్‌కు కొనసాగించాలా ఏర్పాటు చేసినట్లు ఎన్నార్టీ విభాగం వారు మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు తెలిపింది. ఒక మంచి నిర్ణయాన్ని తీసుకుని చాకచక్యంగా వ్యవహరించి అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన మంత్రి నారా లోకేష్ నిర్ణయం పట్ల మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు.

# గల్లంతైన మత్స్యకారుల్లో ఒకరు సురక్షితం

>> కారుడిని రక్షించిన మర్చంట్ నౌక కెప్టెన్, సిబ్బందికి మంత్రి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఒడిశా ప్రభుత్వం, మెరైన్ పోలీస్, మత్స్యశాఖ అధికారుల సమన్వయంతో 10 మంది మత్స్యకారులు క్షేమంగా బయటపడ్డారుఒడిశా తీరంలో సాంకేతిక లోపం కారణంగా చిక్కుకున్న విశాఖపట్నానికి చెందిన మెకనైజ్డ్ ఫిషింగ్ బోటులో ఉన్న బోటు యజమాని దానయ్యతో పాటు మొత్తం 10 మంది మత్స్యకారులను సురక్షితంగా రక్షించినట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. బోటు ఇంజిన్ పనిచేయకపోవడం, యాంకర్ కోల్పోవడంతో మత్స్యకారులు సముద్రంలో చిక్కుకున్నట్లు సమాచారం అందిన వెంటనే ఒడిశా మెరైన్ పోలీస్, మత్స్యశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు ఒడిశా మెరైన్ పోలీస్, మత్స్యశాఖ అధికారులు వేగంగా స్పందించి రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి బోటు యజమాని దానయ్యతో పాటు మొత్తం 10 మంది మత్స్యకారులను సురక్షితంగా రక్షించారు. ప్రస్తుతం వారందరూ క్షేమంగా ఉన్నారని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా సకాలంలో స్పందించి మత్స్యకారుల ప్రాణాలను కాపాడిన ఒడిశా ప్రభుత్వం, ఒడిశా మెరైన్ పోలీస్, మత్స్యశాఖ అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

# రూ. 105 కోట్లతో 'ఆంధ్రా భవన్'

>> భవనం నిలుస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నూతన ఆంధ్రప్రదేశ్ భవన్‌ను సుమారు 2.49 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. రాష్ట్ర ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులతో పాటు ఢిల్లీకి వచ్చే రాష్ట్ర ప్రజలకు అవసరమైన అన్ని ఆధునిక సౌకర్యాలు ఒకే చోట అందుబాటులో ఉండేలా ప్రణాళిక రూపొందించారు. సమావేశ మందిరాలు, అతిథి గదులు, కార్యాలయ విభాగాలు, పార్కింగ్, భద్రతా వ్యవస్థలు, డిజిటల్ సదుపాయాలు వంటి అన్ని అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు సమాచారం. భవన నిర్మాణం పూర్తైన అనంతరం కనీసం ఐదు సంవత్సరాల పాటు వార్షిక నిర్వహణ బాధ్యతలను కూడా ఎన్‌బిసిసి లేదా దాని అనుబంధ సంస్థకు అప్పగించనున్నారు. ఇందుకోసం త్వరలో మరో ప్రత్యేక ఒప్పందం చేసుకునేందుకు ఇరుపక్షాలు సిద్ధమవుతున్నాయి.

# వాయు 'గండం'

>> వంతో సోమవారం విజయనగరం, మన్యం, అల్లూరి, పల్నాడు జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. తీరం వెంబడి గంటకు 40-50 కిమీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని హెచ్చరించారు.ఈదురుగాలులు, ఉరుములతో వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల క్రింద, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడొద్దని సూచించారు. అవసరం అయితే తప్ప ఎవరూ బయటకు వెళ్లవద్దని తెలిపారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో చెట్లు, విద్యుత్ స్థంభాలు విరిగి పడే అవకాశం ఉందని.. పొలాలకు వెళ్లే సమయంలో రైతులు జాగ్రత్తగా ముందు చూస్తూ వెళ్లాలని సూచించారు. ఎక్కడైనా విద్యుత్ స్థంభాలు విరిగి పడితే వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఇక విశాఖపట్నంలో తుపాను ప్రభావంతో సముద్రంలో ఏడుగురు మత్స్యకారులు గల్లంతయ్యారు. ఈనెల 1న ఏడుగురు జాలర్లు సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ఇంటికి చేరుకుంటామని మత్స్యకారులు ఫోన్ చేశారు. మత్స్యకారులు తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఫోన్ చేశారు. అయితే ఫోన్‌లు స్విచ్‌ఆఫ్ అవ్వడంతో గల్లంతయ్యారని కోస్ట్, మెరైన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. గల్లంతైన మత్స్యకారుల కోసం కోస్ట్‌గార్డ్, నేవీ, మెరైన్ పోలీసులు గాలింపు చేపట్టారు.

# ముగింపు దిశగా రష్యా, ఉక్రెయిన్ పోరు!

>> పేర్కొంది. వచ్చే వారం టర్కీలో జరగబోయే నాటో సదస్సులో ఈ యుద్ధానికి ముగింపు పలికేలా మధ్యవర్తిత్వం వహించడానికి తాను సిద్ధంగా ఉన్నట్లు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించారు. అమెరికా ప్రత్యేక దౌత్యవేత్తలు స్టీవ్ విట్కాఫ్, జెరెడ్ కుష్నర్ ఈ శాంతి ఒప్పందం కోసం తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తారని, అవసరమైతే మరోసారి మాస్కో పర్యటనకు వచ్చేందుకు రెడీగా ఉన్నారని ట్రంప్ తెలిపినట్లు సమాచారం. రష్యా, అమెరికాల మధ్య సైనిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో పరస్పర సహకారానికి బోలెడు అవకాశాలు ఉన్నాయని, ఈ సహకారం పునరుద్ధరించాలంటే ఉక్రెయిన్ సంక్షోభానికి త్వరితగతిన పరిష్కారం లభించడమే మొదటి షరతుఅని ట్రంప్ నొక్కి చెప్పారని తెలుస్తోంది. మరోవైపు, ఉక్రెయిన్, దాని యూరోపియన్ మిత్రదేశాలు యుద్ధాన్ని మరింత తీవ్రం చేస్తున్నాయని, సాధారణ పౌరులపై ఉగ్రవాద దాడులకు పాల్పడుతున్నాయని ఉషాకోవ్ ఆరోపించారు. రష్యా అధ్యక్షుడి ప్రెస్ సెక్రటరీ డిమిత్రి పెస్కోవ్ తాజాగా ఒక సంచలన ప్రకటన చేశారు. క్రెమ్లిన్ నిర్దేశించిన అత్యంత కీలకమైన, బాధ్యతాయుతమైన నిర్ణయాలను ఆమోదించడానికి సిద్ధంగా ఉంటే ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ స్వయంగా అధ్యక్షుడు పుతిన్‌ను కలవడానికి మాస్కో రావచ్చని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా శాంతిని ఆశించే శక్తులన్నీ ఇప్పుడు పుతిన్ ట్రంప్ డీల్ వైపు ఆసక్తిగా చూస్తున్నాయి.

## తిరుమల సమాచారం



### ఏడుకొండలవాడా... ఏదీ నీ దర్శనం

• 25గంటలపైగానే సర్వదర్శనం

**తిరుమల, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యాసంస్థలు పునఃప్రారంభమైనా.. వారాంతం సెలవులతో తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. అలిపిరి టోల్ గేట్ నుండే రద్దీ కనిపిస్తోంది. ఆదివారం సాయంత్రానికి సర్వదర్శనానికి 25 గంటల పైగానే సమయం పడుతోంది. భక్తులు పూర్తిగా సిబ్బందికి సహకరించాలని, సంయమనంతో దర్శనం చేసుకోవాలని టిటిడి ప్రకటించింది. క్యూ లైన్‌లో ఉన్న వారికి శ్రీవారి సేవకులు అన్న ప్రసాదం, మజ్జిగ, మంచినీరు, పాలు అందిస్తున్నారు. తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని అన్ని కంపార్ట్‌మెంట్లు భక్తులతో నిండిపోయాయి. భక్తుల క్యూ లైన్ శిలాతోరణం వరకూ విస్తరించింది. శనివారం రాత్రి వరకు 90,546 మంది భక్తులు దర్శించుకున్నారు. కానుకల రూపంలో శ్రీవారి హుండీకి 3.93 కోట్లు రూపాయలు ఆదాయం వచ్చింది. ఆదివారం సాయంత్రానికి 43వేల మంది భక్తులకు మహాలఘులో స్వామివారి దర్శనం చేయించారు. రద్దీ ఎక్కువగా ఉండటంతో వెలుపల క్యూ లైన్లలో భక్తుల నిరీక్షణ తప్పడంలేదు.

### 13న, 16న విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు

**తిరుమల, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆణివారం సందర్భంగా కలియుగ వాసుడు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామికి ఎంతో విశిష్టత ఉన్న ఆణివార ఆస్థానం నిర్వహించడం ఆనవాయితీ. ఈ పర్వదినం ముందు మంగళవారం ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపడతారు. ఈనెల 14వ తేదీ మంగళవారం తిరుమల ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 17వ తేదీ శుక్రవారం ఆణివార ఆస్థానం జరగనుంది. ఈ రెండు ప్రత్యేక రోజుల్లో ఆలయంలో విఐపి బ్రేక్ దర్శనాలు రద్దుచేశారు. దీనికి ముందు సోమవారం 13వ తేదీ విఐపి బ్రేక్ దర్శనాల సిఫార్సు లేఖలు తీసుకోరాదన్ని టిటిడి విజ్ఞప్తి చేసింది. అలాగే 16వ తేదీ గురువారం కూడా 17వ తేదీ విఐపి బ్రేక్ దర్శనాలకు సంబంధించిన సిఫార్సులేఖలు స్వీకరించబోమని టిటిడి వెల్లడించింది. భక్తులు ఈ విషయాలను గమనించి టిటిడికి సహకరించాలని విజ్ఞప్తి చేసింది. జులై 17న కళ్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ రద్దు చేసినట్లు పేర్కొంది.

### 17న శ్రీవారి ఆలయంలో ఆణివార ఆస్థానం




**తిరుమల, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో 17వ తేదీ శుక్రవారం సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినం జరుగనుంది. ఆణివార ఆస్థానం ఉత్సవం రోజున ఉదయం 7 గంటలకు బంగారువాకిలి ముందు గల ఘంటా మండపంలో సర్వభూపాల వాహనంలో ఉభయదేవేరులతో మలయప్పస్వామి గరుడ్మంతునికి అభిముఖంగా కొలువు చేయిస్తారు. మరో పీఠంపై స్వామివారి సర్వసైన్యాధ్యక్షుడైన విష్వక్సేనులవారు దక్షిణాభిముఖంగా వేంచేపు చేస్తారు. ఈ ఉత్సవమూర్తులతో పాటు ఆనంద నిలయంలోని మూలవిరాట్టుకు ప్రత్యేకపూజలు, ప్రసాదాలు నివేదిస్తారు. తిరుమల పెద్ద జీయర్ స్వామి పెద్ద వెండితట్టలో ఆరు పెద్ద పట్టువస్త్రాలను తలపై పెట్టుకుని మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా విచ్చేస్తారు. వీటిలో నాలుగు పట్టువస్త్రాలను మూలమూర్తికి అలంకరిస్తారు. మిగిలిన రెండు వస్త్రాలలో ఒకటి మలయప్పస్వామికి, మరొకటి విష్వక్సేనులకి అలంకరిస్తారు. శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు తలకు శ్రీవారిపాదపద్మంతో వరిపట్టం కట్టుకుని స్వామివారి ద్వారా బియ్యపు దక్షిణ స్వీకరించి నిత్యైశ్వర్యోభవ అని స్వామిని ఆశీర్వదిస్తారు. ఆ తరువాత అర్చకులు పెద్దజీయర్, చిన్నజీయర్ స్వామికి, టిటిడి ఇఒ, పేతలకు లచ్చన తాళపు చెవిగుత్తిని వరుసక్రమంలో కుడిచేతికి తగిలిస్తారు. హారతి,చందనం, తాంబూలం, తీర్థం, శఠారి మర్యాదలు చేసి తాళపు గుత్తిని స్వామివారి పాదాలచెంత ఉంచుతారు.

**పుష్ప పల్లకీపై ఊరేగింపు:** ఆణివార ఆస్థానం సందర్భంగా 17వ తేదీ శుక్రవారం సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి అత్యంత శోభాయమానంగా అలంకరించిన పుష్పపల్లకీపై ఆలయ మాఢవీధుల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేస్తారు.

**ఆర్జితసేవలు రద్దు:** ఆణివార ఆస్థానం కారణంగా 17న కళ్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను రద్దు చేసింది.

### రౌడీ షీటర్‌పై పిడి యాక్ట్

• భక్తుల భద్రతకు విఘాతం కలిగిస్తూ నేరాలు



**తిరుమల, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమలలో భక్తుల భద్రత, ప్రజా శాంతిభద్రతలకు భంగం కలిగిస్తూ వరుసగా నేరాలకు పాల్పడు తున్న రౌడీ షీటర్ జి. శ్రీనివాసులు అనే శ్రీను(20)పై ఆంధ్రప్రదేశ్ ప్రివెన్షన్ ఆఫ్ డేంజరస్ యాక్టివిటీస్ (పిడియాక్ట్) పోలీసులు నమోదు చేశారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ప్రతిపాదన మేరకు తిరుపతి జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పిడి యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిందితుడు తిరుమల ప్రాంతంలో దొంగతనాలు, దాడులు, ప్రభుత్వ విధుల నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందిపై దౌర్జన్యాలు, మహిళలపై వేధింపులు, ఆయుధాలతో బెదిరింపులు, ప్రజల్లో భయాందోళ నలు సృష్టించే చర్యలకు పాల్పడుతూ గత ఏడాది కాలంలో మొత్తం ఐదు క్రిమినల్ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని పోలీసులు తెలిపారు. పలుమార్లు అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నప్పటికీ, అతని నేరప్రవృత్తిలో ఎలాంటి మార్పు రాకపోవడంతో, ప్రజా శాంతిభద్రతలకు ముప్పుగా మారినట్టు జిల్లా పోలీసు శాఖ నిర్ధారించింది. దీంతో జిల్లా కలెక్టర్ జారీ చేసిన నిర్బంధ ఉత్తర్వు మేరకు నిందితుడిని కడప సెంట్రల్ జైలుకు తరలించారు.

## వేడుకుందామా.. వేంకటపతి వేంకటనాధుని!

• 116ఏళ్ళ నవనీతమ్మకు ఏడుకొండలస్వామి విఐపి దర్శనభాగ్యం • సిఎం చంద్రబాబు కూడా ముగ్ధులు

**తిరుమల, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడు ఏడుకొండల వేంకటేశ్వర స్వామి తన దర్శనానికి 116ఏళ్ళ అవ్వను పిలుచుకుంటున్నాడనే భక్తిభావంతో భక్తులు పరవశులవుతున్నారు. అవ్వ కాలినడకన ఏ మాత్రం అలుపుసోలుపు లేకుండా కుటుంబ సభ్యుల సహకారంతో ఏకంగా అలిపిరి మెట్ల మార్గంలో తిరుమలకు చేరుకోవడం తెలిసిందే. భక్తి పారవశ్యంతో, మనసు నిండా గోవింద నామస్మరణతో తమిళనాడుకు చెందిన నవనీతమ్మ 116 ఏళ్ల వృద్ధురాలు కాలినడకన తిరుమల కొండెక్కి వచ్చిన అద్భుత ఘట్టం ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో సంచలనంగా మారింది. భగవంతునిపై ఆమెకున్న అచంచలమైన భక్తి, పట్టుదల దేశవ్యాప్తంగా లక్షలాది మంది నెటిజన్లను, భక్తులను ముగ్ధులను చేయడమేగాక స్వయంగా చిత్తూరుజిల్లా కుప్పం పర్యటనలో ఉన్న సిఎం చంద్రబాబునాయుడు కూడా శభాష్ అవ్వా అంటూ వీడియో పోస్ట్ చేశారు. వయసు కేవలం అంకె మాత్రమేనని కర్ణాటకకు చెందిన అవ్వ నిరూపించారు. 116 ఏళ్ల వయస్సులో తిరుమలకు మెట్లు ఎక్కి రావడం ఆశ్చర్యపరిచింది. అవ్వకు అండగా నిలిచిన కుటుంబసభ్యుల మద్దతు అభినందనీయం. స్వామివారిపై ఆమెకు ఉన్న అచంచల భక్తికి ఈ ప్రయాణమే ఒక నిదర్శనమంటూ సిఎం పేర్కొన్నారు.



అవ్వకు దేవదేవుని దర్శనం:

ఆ ఏడుకొండలస్వామే తన దర్శనాన్ని ఇవ్వడమంటే మాటల్లో చెప్పడంకాదు. అంతటి అనుభూతిని పొందిన భక్తులకే అది సాధ్యం. ఆ స్వామి పిలుపు రావాలంటే అదృష్టం ఉండాలని, ఏడు కొండలు ఎక్కాలంటే ఎంతో పుణ్యం చేసుకోవాల్సి ఉంటుంది. యువకులు, భక్తులు కూడా అలిపిరి మెట్లు ఎక్కి తిరుమలకు రావాలంటే ఆయాసపడుతుంటారు.

అలాంటిది వయసు మళ్ళిన వృద్దులు కూడా ఆ స్వామి దర్శన భాగ్యం కోసం పరితపిస్తుంటారు. ఇదీ తిరుమల వేంకటేశ్వరస్వామి మహత్యం. కాలినడకన రావడం మాటల్లో చెప్పనలవికాదని, ఆమెను ఆమె కుటంబసభ్యు లను ఆ దేవుడే చల్లంగా చూడాలని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు తన సామాజిక మాధ్యమం వేదికగా పోస్టు చేశారు.

వృద్ధురాలి గురించి వారి కుటుంబం గురించి వివరాలు తెలుసుకోవాలని టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆదేశించారు. ఆ వెంటనే టిటిడి విజిలెన్స్ అధికారులు అవ్వగురించి ఆరా తీశారు. 116ఏళ్ల అవ్వ తమిళనాడుకు చెందిన నవనీతమ్మగా గుర్తించారు. ప్రస్తుతం ఆమె తిరుపతి జీవకోనలోని బంధువుల ఇంట్లో ఉన్నట్లు తెలుసుకు న్నారు. శేషాచలం కొండల్లో 3,550 నిటారైన రాతి మెట్లను ఎలాంటి అలసట లేకుండా, కేవలం స్వామిపై ఉన్న నమ్మకంతోనే ఆమె ఎక్కి తిరుమలకు చేరుకోవడంపై బిఆర్‌నాయుడు స్పందించారు. ఆమెకు,ఆమె కుటుంబసభ్యులకు నేడు (సోమవారం) ఉదయం విఐపి బ్రేక్ దర్శనం కల్పించే భాగ్యం కలిగిందని ఆయన పేర్కొన్నారు. అవ్వకుటుంబసభ్యులకు ఈ సమాచారం అందించారు. ఇంకేముంది ఆ దేవుడే దిగివచ్చినంత ఆనందాన్ని వ్యక్తం చేశారు. మరీ అవ్వ నేటి ఏడుకొండల స్వామిని దర్శించుకుని దివ్యానుభూతి పొందనుండటం మాత్రం ఆ దేవుని ఆశీస్సులేనని భావిస్తున్నారు.

## 8 నుంచి సదరం స్లాట్ బుకింగ్

• వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్



**విజయవాడ, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** దివ్యాంగుల కోసం పింఛన్‌కు సంబంధించిన వైకల్య ధ్రువపత్రాల (సదరం) జారీ సేవల్లో కీలక సంస్కరణలు తీసుకొచ్చినట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ వెల్లడించారు. ఆదివారం రాజధాని అమరావతిలో ఆయన మాట్లాడుతూ జులై 8 నుంచి సదరం స్లాట్ బుకింగ్ పునః ప్రారంభం అవుతుందని ప్రకటించారు. జులై 13 నుంచి వైకల్య నిర్ధారణ పరీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇకపై జోనల్ విధానంలోనే సదరం స్లాట్ బుకింగ్ ఉంటుందని వివరించారు. రాష్ట్రాన్ని 6 జోన్లుగా ప్రభుత్వం విభజించిందని చెప్పారు. సొంత జోన్‌లోని జిల్లాల్లోనే స్లాట్ బుక్ చేసుకునే అవకాశాన్ని దివ్యాంగులకు కల్పించామని మంత్రి సత్యకుమార్ వివరించారు. తద్వారా సుదూర జిల్లాలకు వెళ్లాల్సిన ఇబ్బందులకు చెక్ పెట్టినట్లు అయిందన్నారు. స్లాట్ బుకింగ్‌కు స్వీయ ధ్రువీకరణ పత్రం తప్పనిసరి అని మంత్రి సత్యకుమార్ చెప్పారు. వైకల్య కేటగిరీపై స్పష్టత లేకపోతే డాక్టర్ సర్టిఫికేట్ తప్పనిసరిగా ఉండాలని అన్నారు. తప్పుడు స్లాట్ బుకింగ్‌లకు ప్రభుత్వం అడ్డుకట్ట వేయనుందని తెలిపారు. హాజరు నమోదు అనంతరమే వైకల్య పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సదరం పోర్టల్‌లో ఆన్‌లైన్ హాజరు నమోదు తప్పనిసరి అని వివరించారు. హాజరు నమోదుతోనే సదరం ఐడీ యాక్టివేషన్ అవుతుందని పేర్కొన్నారు. సదరం సేవల్లో పారదర్శకత పెంచే దిశగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎపి సేవా పోర్టల్ ద్వారా నేరుగా స్లాట్ బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించామని తెలిపారు. సిటిజన్ లాగిన్‌తో ఉచితంగా అపాయింట్‌మెంట్ బుకింగ్ చేసుకోవచ్చునని చెప్పారు. సదరం ధ్రువీకరణ పత్రాన్ని ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యం కల్పించామని అన్నారు.

సచివాలయాల ద్వారా కూడా సదరం సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఖిమన మిత్రఖి వాట్సాప్ సేవలో స్లాట్ లభ్యత వివరాలు పొందుపరిచామని చెప్పారు. సదరం సేవలన్నీ పూర్తిగా ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. దళారులకు ఎలాంటి నగదు చెల్లించవద్దని దివ్యాంగులకు అధికారులు స్పష్టం చేశారు. దివ్యాంగులకు ప్రయాణ భారం తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. వైద్యులపై పనిభారం తగ్గించేలా ఈ కొత్త విధానం ఉంటుందని తెలిపారు. ఈ సదరంపై అవగాహన కల్పించాలని అధికారులను మంత్రి సత్యకుమార్ ఆదేశించారు.

## రుషికొండ సౌధాలు పర్యాటక ప్రయోజనాలకే!

• ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్వహణకు ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ నిర్ణయం

• లీజు కోసం జులై 10లోగా తమ దరఖాస్తులను దాఖలు చేయాలి

**విజయవాడ, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** విశాఖ రుషికొండపై నిర్మించిన అత్యాధునిక సౌధాల వినియోగంపై ఎపి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రైవటు సంస్థల భాగస్వామ్యంతో పర్యాటక ప్రయోజనాలకు వినియోగించాలనే దిశలో కార్యచరణ చేపట్టింది. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విధానంలో నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రక్రియను ప్రారంభిస్తూ ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఎపిటిడిసి) ఆసక్తి వ్యక్తీకరణ కోసం అధికారిక ప్రకటన విడుదల చేసింది. పర్యాటక, ఆతిథ్య రంగంలో అనుభవం ఉన్న సంస్థలు జులై 10లోగా తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించింది. వైఎస్సార్సీపీ ప్రభుత్వ హాయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగనమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు రూ.452 కోట్ల ప్రజాధనంతో ఈ భవనాల నిర్మాణం చేపట్టారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపు రెండేళ్ల గడిచినా ఈ భవనాల వినియోగంపై స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదు. ఇటీవల మంత్రుల కమిటీ రుషికొండ భవనాలను పరిశీలించి, వాటిని ప్రైవేటు సంస్థల ద్వారా నిర్వహించడం ఉత్తమమనే అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో లీజు ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రుషికొండపై సుమారు 9.8 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఐదు బ్లాకుల భవనాలను లీజుకు ఇవ్వనున్నారు. భవనాలతో పాటు సుందరమైన ఉద్యానవనాలు, అంతర్గత రహదారులు, నడక మార్గాలు, విశాలమైన పార్కింగ్ స్థలాలు వంటి అన్ని మౌలిక వసతులు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయని ఎపిటిడిసి వెల్లడించింది. అంతర్జాతీయ స్థాయి అతిథ్య సేవలకు అనుగుణంగా ఈ సముదాయం సిద్ధంగా ఉందని పేర్కొంది. ప్రస్తుతం ఉన్న భవనాలతో పాటు సుమారు 1,200 చదరపు ఖాళీ స్థలం కూడా లీజుదారులకు అందుబాటులో ఉంటుందని ఎపిటిడిసి తెలిపింది. అలాగే మొత్తం 4,800 చదరపు మీటర్ల విస్తీర్ణంలో గ్రౌండ్ ప్లస్ వన్ (జీ+1) భవనాలను నిర్మించుకునే అవకాశాన్ని కూడా కల్పించింది. దీనివల్ల భవిష్యత్తులో గదుల సంఖ్యను పెంచుకొని పర్యాటకులకు మరింత మెరుగైన సేవలు అందించే వీలుంటుందని అధికారులు భావిస్తున్నారు. రుషికొండ ప్రాంతంలో పర్యాటకశాఖకు మొత్తం 70.63 ఎకరాల భూమి ఉంది. ఇందులో 18.65 ఎకరాలు ప్రస్తుతం వినియోగంలో ఉండగా, సుమారు 47.4 ఎకరాలు ఖాళీగా ఉన్నాయి. మరికొంత భూమి ఆక్రమణలకు గురైనట్లు ప్రభుత్వం అధికారికంగా గుర్తించింది. ఇప్పటి కట్టడాలను వినియోగంలోకి తీసుకుని వస్తూ భవిష్యత్తులో ఈ ప్రాంతాన్ని సమగ్ర పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. రుషికొండ ప్యాలెస్‌ల నిర్వహణపై ఇప్పటికే పలు ప్రముఖ అంతర్జాతీయ హోటల్ గ్రూపులు ఆసక్తి వ్యక్తం చేశాయి. తాజ్, అట్మాస్ఫియర్ కోర్, లీలా, ఫెమా వంటి ప్రముఖ ఆతిథ్య సంస్థల ప్రతినిధులు గతంలోనే భవనాలను పరిశీలించినట్లు సమాచారం.



అయితే ప్రస్తుతం ఉన్న గదుల సంఖ్య భారీ స్థాయి హోటల్ నిర్వహణకు అనుకూలంగా లేకపోవడంతో అదనపు గదుల నిర్మాణానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో అంతర్జాతీయ ప్రమాణాల రిసార్ట్ లేదా లగ్జరీ హోటల్‌గా అభివృద్ధి చేసే అవకాశాలు పెరిగాయి. రుషికొండ సముద్ర తీరానికి సమీపంలో ఉండటంతో కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సిఆర్‌జడ్) నిబంధనలు అమల్లో ఉన్నాయి. ఈ కారణంగా విస్తృత స్థాయిలో కొత్త నిర్మాణాలు చేపట్టేందుకు పరిమితులు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఖాళీ స్థలం అందుబాటులో ఉన్నప్పటికీ సిఆర్‌జడ్ నిబంధనలకు అనుగుణంగానే అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంటుంది.

### యూట్యూబర్ రావణ్‌పై రాజద్రోహం కేసు

**విజయవాడ, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశ సార్వభౌమాధికారానికి, సమాజ శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించారనే ఆరోపణలపై యూట్యూబర్ రావణ్‌పై పోలీసులు రాజద్రోహం కేసు నమోదు చేసినట్లు పోలీసు వర్గాల సమాచారం. జనసేన పార్టీ ముఖ్య నాయకుడు గరికపాటి శివశంకర్ ఇచ్చిన అధికారిక ఫిర్యాదు ఆధారంగా గన్నవరం పోలీసులు ఈ మేరకు ఎఫ్‌ఐఆర్ దాఖలు చేశారు. సమాజంలో ద్వేషాన్ని పెంచి పోషించడం, దేశ సమగ్రతను దెబ్బతీసేలా వ్యూహాత్మకంగా వ్యవహరించడం వంటి తీవ్రమైన అంశాలను ఈ ఫిర్యాదులో ప్రస్తావించారు. రావణ్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు, అతని చట్టవిరుద్ధ కార్యకలాపాలు.. దేశ రక్షణకు, అంతర్గత భద్రతకు ముప్పుగా పరిణమించాయని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. తీవ్రమైన విద్వేషాలను రెచ్చగొట్టడానికి అతను ప్రయత్నించినట్లు ఆరోపణలు వచ్చాయి. దేశద్రోహ పూరిత చర్యలను ప్రోత్సహించడం, చట్ట వ్యతిరేక శక్తులకు మద్దతుగా నిలవడం వంటి అంశాలపై ప్రాథమిక ఆధారాలను పరిశీలించిన తర్వాతే పోలీసులు కేసు నమోదు ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ వ్యవహారంలో రావణ్‌పై చట్టపరంగా కఠినమైన సెక్షన్లను ప్రయోగించారు. రావణ్‌పై భారతీయ శిక్షాస్మృతి మేరకు 147, 148, 152, 192, 197(1)డి, 353(1బి సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. వీటితో పాటు అత్యంత కీలకమైన, దేశ రక్షణకు సంబంధించిన చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం లోని సెక్షన్ 13, సెక్షన్ 39లను కూడా ఇందులో చేర్చి, దర్యాప్తు ప్రారంభించారు.

### ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్లకు పోస్టింగ్‌లు

**విజయవాడ, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్లుగా పదోన్నతి పొందిన వారికి ప్రభుత్వం పోస్టింగ్‌లు ఇచ్చింది,. వీరిలో రాజమండ్రి జిల్లా ఎక్సైజ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్‌గా జి.శ్రీనివాస్, ఎపిఎస్‌బిసిఎల్ డిపో మేనేజర్‌గా ఆర్వీ ప్రసాద్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సూపరింటెండెంట్‌గా డి.రఘురామరెడ్డి, హెడ్ క్వార్టర్స్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ఆర్.జగదీశ్వరరెడ్డి ఉన్నారు. వీరంతా తక్షణం విధుల్లో చేరాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

## పుర మిత్ర యాప్‌లో నాలుగు కొత్త ఫీచర్లు




• అందుబాటులోకి తెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం • పట్టణ, నగర ప్రజలకు

మరింత వేగవంతంగా, పారదర్శకంగా పౌర సేవలు అందించడమే లక్ష్యం

**విజయవాడ, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పురమిత్ర యాప్‌లో కొత్త ఫీచర్లను అందుబాటులోకి తీసుకుని వచ్చింది. పట్టణ ప్రాంత ప్రజలకు మరింత వేగవంతంగా, పారదర్శకంగా పౌర సేవలు అందించేందుకు ప్రభుత్వం పురమిత్ర యాప్‌లో నాలుగు కీలకమైన కొత్త ఫీచర్లను అందుబాటు లోకి తీసుకువస్తోంది. కొత్త ఫీచర్లతో పురమిత్ర యాప్ ప్రజలకు మరింత సౌకర్యవంతమైన డిజిటల్ సేవల వేదికగా మారనుంది. ఫిర్యాదుల నమోదు నుంచి సమస్యల పరిష్కారం వరకు ప్రక్రియను సులభతరం చేయడంతో పాటు, ప్రజల అభిప్రాయాలను సేకరించ డం, ప్రభుత్వ సమాచారాన్ని ఒకే వేదికపై అందించడం వంటి చర్యలతో పట్టణ పాలనలో పారదర్శకత, వేగం, ప్రజల భాగస్వామ్యం మరింత పెరుగుతాయని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ప్రజల్లో మంచి ఆదరణ పొందిన ఈ యాప్‌ను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో 'సేవ్ మై ప్రాపర్టీ', రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ల (ఆర్‌డబ్ల్యూఏ) ఇంటిగ్రేషన్, సిటిజన్ ఫీడ్‌బ్యాక్ మాడ్యూల్, సోషల్ మీడియా ఇంటిగ్రేషన్ వంటి సదుపాయాలను ప్రవేశపె డుతున్నారు. ఈ మార్పులతో పురమిత్ర యాప్‌ను కేవలం ఫిర్యాదుల నమోదు వేదికగా కాకుండా సమగ్ర పౌరసేవల డిజిటల్ ప్లాట్‌ఫారంగా అభివృద్ధి చేస్తున్నారు.



ప్రడివిజన్లు, వార్డుల్లో పారిశుద్ధ్యం, వీధి దీపాలు, రోడ్లు, డ్రైనేజీ వంటి పౌర సమస్యలను ప్రజలు నేరుగా మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువచ్చే ఉద్దేశంతో ప్రభుత్వం గత ఏడాది మార్చి 16న పురమిత్ర యాప్‌ను ప్రారంభించింది. ప్రస్తుతం రాష్ట్రంలోని 123 పురపాలక సంస్థలు, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల పరిధిలో 18.44 లక్షల మంది ఈ యాప్‌ను తమ మొబైల్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకున్నారు. యాప్ ద్వారా ఇప్పటివరకు నమోదైన 1.45 లక్షల ఫిర్యాదుల్లో 98 శాతం సమస్యలను పరిష్కరించినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. యాప్ పనితీరును సమీక్షించిన ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువ చేసేలా సాంకేతికంగా మరిన్ని సౌకర్యాలను జోడిస్తోంది.

కొత్తగా ప్రవేశపెడుతున్న 'సేవ్ మై ప్రాపర్టీ' ఫీచర్ ద్వారా ఇళ్ల యజమానులు లేదా అద్దెకు నివసించే వారు తమ ఇంటి వివరాలను ఒకసారి మాత్రమే యాప్‌లో నమోదు చేస్తే సరిపోతుంది. అనంతరం ఎలాంటి ఫిర్యాదు చేసినా ప్రతిసారి ఇంటి చిరునామా నమోదు చేయాల్సిన అవసరం ఉండదు. దీంతో ఫిర్యాదుల నమోదు ప్రక్రియ మరింత వేగవంతం అవుతుంది. అలాగే మున్సిపల్ సిబ్బంది సంబంధిత ప్రదేశాన్ని సులభంగా గుర్తించి సమస్యను త్వరితగతిన పరిష్కరించే అవకాశం ఉంటుంది. పురమిత్ర యాప్‌లో మరో కీలకమైన సదుపాయంగా 'హాట్ స్పాట్స్' గుర్తింపు వ్యవస్థను అమలు చేస్తున్నారు. 100 మీటర్ల పరిధిలో ఒకే సమస్యపై అయిదు కంటే ఎక్కువ ఫిర్యాదులు నమోదైతే ఆ ప్రాంతాన్ని హాట్ స్పాట్‌గా గుర్తిస్తారు. అలాంటి ప్రాంతాలకు మున్సిపల్ కమిషనర్లు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి స్వయంగా పరిశీలించి సమస్యలను తక్షణమే పరిష్కరించాల్సి ఉంటుంది. దీని ద్వారా తరచుగా సమస్యలు ఎదురయ్యే ప్రాంతాల్లో వేగంగా చర్యలు తీసుకునే అవకాశం ఏర్పడుతుంది. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ అందిస్తున్న సేవల నాణ్యతపై ప్రజల అభిప్రాయాన్ని నేరుగా తెలుసుకునేందుకు సిటిజన్ ఫీడ్‌బ్యాక్ మాడ్యూల్ అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఈ ఫీచర్ ద్వారా సేవలపై ప్రజలు తమ సూచనలు, అభిప్రాయాలు, అసంతృప్తిని నమోదు చేయవచ్చు. ఈ సమాచారం ఆధారంగా సేవల నాణ్యతను మెరుగుపరిచేందుకు అధికారులు చర్యలు తీసుకోనున్నారు. సోషల్ మీడియా ఇంటిగ్రేషన్ ద్వారా పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ అధికారిక ప్రకటనలు, ప్రభుత్వ కార్యక్రమాలు, తాజా సమాచారం, ప్రజలకు అవసరమైన అవగాహన సందేశాలు అన్నీ పురమిత్ర యాప్‌లోనే అందుబాటులో ఉంటాయి. దీంతో ప్రజలు వివిధ ప్రభుత్వ సమాచారాన్ని ఒకే వేదికపై సులభంగా తెలుసుకునే అవకాశం కలుగుతుంది.

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో సుప్రీంకోర్టు జడ్జి

**శ్రీకాళహస్తి, జులై 5 ప్రభాతవార్త:** దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ విపుల్ యం.పంచోలి కుటుంబసభ్యులతో కలసి రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్నారు. సుప్రీం కోర్టు జడ్జికి దక్షిణ గోపురం వద్ద ఆలయ కార్యనిర్వహణాధికారి బికె వెంకటేశు, ప్రోటోకాల్ ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గురప్పశెట్టి ఆలయ మర్యాదలతో వేదపండితులతో స్వాగతం పలికారు. అలాగే న్యాయశాఖకు చెందిన తిరుపతి ఎడిజె శ్రీకాళహస్తి ఫుల్ అడిషనర్‌చార్జి జడ్జి ఏ.నరసింహామూర్తి స్వాగతం పలికారు. న్యాయమూర్తి ఆలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోవాలని కోరగా వారికి సహస్రలింగేశ్వరాలయం వద్ద ఏర్పాటు చేసారు. వేదపండితులు శాస్త్రోక్తంగా రాహుకేతుదోష నివారణ పూజలు జరిపారు. వారికి స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వారికి వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి, ఎపిఆర్ఓ రవి, పర్యవేక్షకులు నాగభూషణం కోర్టు ప్రోటోకాల్ పర్యవేక్షకులు రవిలు పర్యవేక్షించారు.





## జ్ఞానమ్మకు బంగారు ఆభరణాలు వితరణ

**శ్రీకాళహస్తి, జులై 5 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారికి విజయవాడకు చెందిన భక్తులు అమరేశ్వరరావు బంగారు ఆభరణాలను వితరణగా అందించారు. ఆదివారం అమరేశ్వరరావు కుటుంబసభ్యులతో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ నేపథ్యంలో రూ.6.05లక్షల విలువ గల బంగారు హారాన్ని ఆలయ ఇఓ బికె వెంకటేశు ద్వారా ఆలయానికి సమర్పించారు. దాతలకు గుర్తింపుగా వారికి స్వామి అమ్మవార్ల అంతరాలయంతో పాటు వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు. ఏర్పాట్లును ఆలయ ప్రోటోకాల్ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి ఎపిఆర్ఓ కె.శ్రీనివాసులు అకౌంటెంట్ యుగంధర్, అప్రైజర్ బాలాజిలు పాల్గొన్నారు.

వార్త


సంస్కారం, సభ్యత అనేవి ఎక్కడికి వెళ్లినా గౌరవం లభింపచేసే పాస్‌పోర్టులు.

- జాన్సన్

# హే రామ్! హే భగవాన్!!

ఇందుగలడందులేడని సందేహాము వలదు చక్రి సర్వోపగతుండు' ఎందెందు వెదకిచూచిన అందందే...! అనే పోతన భాగవతంలోని పద్యతాత్పర్యం ఆలకిస్తే విష్ణువు అలవైకుంఠపురంలోనే కాదు ఎక్కడ చూసినా అన్ని చోట్లా ఉంటాడని అర్థం. దేవుడున్నచోట మకిల ఉండదని చెప్పుకునేవారిని ఆశ్చర్యానికి గురిచేస్తూ దైవ క్షేత్రాల్లోనూ అవినీతి మూడుపువ్వులు ఆరుకాయలుగా విలసిల్లుతూ ఉంటుందనే విషయం 'అయోధ్య, బద్రీనాథ్ వంటి దైవక్షేత్రాల్లో సైతం బయటపడుతోంది. అయోధ్య అదొక దివ్యధామం. బాబ్రీ మసీదు, రామజన్మభూమి అంశంపై హిందూ ముస్లింల మధ్య పొరపొచ్చాలను ఈ దేశ అత్యున్నత న్యాయస్థానం 'క్షీర నీర' న్యాయం అన్న చందాన తేల్చేశాక అయోధ్య రామ మందిర నిర్మాణానికి ఎంతో శ్రద్ధాసక్తులతో రామభక్తులు పూనుకున్నారు. ఆ వెంటనే గత కాలంలో వారణాసి, మధిర, వంటి ఎన్నో దివ్య క్షేత్రాల్లో భారతీయ భక్తితత్వంపై, దివ్యక్షేత్రాలపై ముస్లింలు దాడి చేసి ఆక్రమించుకోవడాన్ని నిరసిస్తూ కోర్టులకెక్కారు. జరిగింది ఎప్పుడైనా న్యాయం ఇప్పటికైనా లభిస్తోంది. కొన్నిటిపై హిందూ ధర్మ పరిరక్షణ పేరిట తీర్పులు సానుకూలంగా పొందారు కూడా. ఆ మేరకు ఆయా ఆధ్యాత్మిక క్షేత్రాల్లో దైవక్షేత్ర పునర్నిర్మాణ కార్యక్రమాలు చేపట్టారు. భరతుడు రామపాదుకలు పట్టినట్లుగా దేశంలోని మారుమూల ప్రాంతాలు సైతం రామ మందిర నిర్మాణానికి పేర్చనున్న ఇటుకలను పరమభక్తి భావంతో పూజలు చేసి మరీ ఫైజాబాద్‌కు తీసుకెళ్లారు రామభక్తులు. భక్తిపారవశ్యంలో అయోధ్య రామమందిర నిర్మాణం జరగడం, బాలరాముడి విగ్రహ ప్రతిష్టాపన చరిత్రలో అతి ప్రాధాన్యమైన విషయంగా నిలిచిపోయింది. 'రామో విగ్రహవాన్ ధర్మః' అనేమాట భక్తుల నోట ఎప్పుడూ నానేమాట. రాముడంటేనే ధర్మం మూర్తీభవించిన వ్యక్తి అతని రాజ్యంలో ధర్మం నాలుగు పాదాలతో నడుస్తుందని ప్రతీతి. కాగా ప్రస్తుత కలియుగధర్మం కుంటినడక నడుస్తోందని చెప్పక తప్పదు. దైవధామాల్లో అవినీతి రాజ్యమేలుతోందన్న విషయం ఒక్కటొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. సాధారణ హిందూ దేవాలయాల్లో భక్తుల దోపిడీ జరుగుతుందన్నది జనశ్రుతిగా సాగుతోంది. రాముడి పేరిట, దేముడి దోసిట ప్రసాదాలు, ధానధర్మాలుగా వచ్చినవి ఎటువంటివైనా కైంకర్యమే. వాటిని అడ్డుకునేందుకు ఎలాంటి భక్తిభావం కానీ, ధర్మాచరణ కానీ అందుబాటులో లేవు. హుండీల్లో నగలు, నగదు కూడా మాయమే. తన కళ్లెదుట అపవిత్ర కార్యాలు, అసంగతులు జరుగుతున్నా ఎవరూ ఏమీ చేయలేకపోతున్నారు. అయోధ్య విరాళాల కుంభకోణంలో ఎన్నో అవినీతి కార్యక్రమాలు బయటపడ్డాయి. ఈ రామమందిర నిర్మాణ చరిత్రను తవ్విచూస్తే బాబ్రీ మసీద్ అయోధ్య రామమందిరం కథల కన్నా ఎన్నో విషయాలు బయటి కొస్తున్నాయి. దొంగలు దొంగలు ఊళ్లు పంచుకుంటున్నారన్న రీతిలో కలియుగ ప్రస్థానంలో ఎవరితోనూ మాట్లాడని రాముడి సేవా కైంకర్యాలు, వైభవ సంకేతాలను సైతం సొంతం చేసుకునే చంపత్ రాయ్‌లు, పూజారిలు, కొంత మంది ఆధ్యాత్మికవేత్తలు, ఆస్తిక నేతలు సైతం 'తిలాపాపం తలా పిడికెడు' అన్న చందాన చేతులేశారు. రాముడు ఎంతో పతితపావనుడు, రామజన్మ భూమి ఎంతో పవిత్రమైనది' అని పదేపదే మనం గొంతు చించుకోవడం తప్పితే ఆయా దేవుళ్లకు, ఆయా ప్రాంతాలకు పవిత్రతను సమకూర్చే ఎలాంటి కార్యాచరణ అక్కడ కనపడదు. కుంభకోణాలు, కైంకర్యాలు, అవినీతి కార్యకలాపాలు, ఇవన్నీ దైవలీలలా అంటే కాదనే చెప్పాలి. 'తీగ లాగితే డొంకంతా కదిలినట్లు' ప్రతీ అంశంలోనూ ఎన్నో చిత్రవిచిత్రాలు తారసపడుతున్నాయి. అయోధ్య రామమందిరం విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తాజాగా స్పందించింది. ఆరెస్సెస్ తొలిసారి ఈ అంశంపై దురదృష్టకరమని వ్యాఖ్యానించింది. అసాధారణ అవినీతిని నొచ్చుకుంది కూడా. ఈ ఉదంతం యావత్తూ రామ భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీసిందని ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే ఆందోళన చెందారు. హిందూ ధర్మాన్ని సమాజాన్ని అప్రతిష్టపాలు చేసే శక్తుల్ని వారి కుట్రల్ని తిప్పికొట్టాలని పిలుపు నివ్వడంలో ఎలాంటి ప్రత్యేకత కనిపించలేదు. ఇలాంటి కుంభకోణాల వ్యవహారాల్లో ఏలినవారు కానీ గట్టు మీదనున్నవారు కానీ స్పందించే తీరు సహజంగా ఇలాగే ఉంటుంది. అంతాజరిగాక ఆలయ నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని బలోపేతం చేయాలని శ్రీ రామజన్మ భూమి తీర్థక్షేత్ర ట్రస్టుకు సూచించడమంటే ఎంతో పరిహాసాస్పదంగానే గోచరిస్తోంది. ఎక్కడైతే నిజాయితీ పాదముద్రలు స్పష్టంగా కనపడతాయని భావి స్తామో అక్కడవి మచ్చుకైనా కానరాకపోతే కలిగే ఫీలింగ్ మాత్రమే జనిస్తోంది. ప్రజాబాహుళ్యంలో బిజెపి పాలిత ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్ ధామ్‌లో కానుకలు, విరాళాల దుర్వినియోగం జరిగినట్లుసోషల్ మీడియాలో వెల్లువెత్తుతున్న విమర్శలు ఈ దేశ దైవధామాల అవినీతి కథలను మరింత గందరగోళపరుస్తున్నాయి. విరాళాల నోట్ల లెక్కింపు కోసం నియమించుకున్న వారి నేపథ్యం సరిగా పరిశీలించుకోనందు వల్లనే ఈ పొరపాట్లు జరిగాయని సరిపెట్టుకున్నా, జరిగిన 'తమాషా'ను ఏ విధంగానూ సమర్థించుకోలేని పరిస్థితి రామభక్తుల్లో నెలకొని ఉంది. అయోధ్య భారతీయుల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీక. కోట్లాది మంది భక్తులు భావోద్వేగాలతో ముడిపడి ఉన్న అంశం కావడంతో పూర్తిస్థాయి చట్టబద్ధ దర్యాప్తు అవసరం ఉంది. విశ్వాసం ఉన్నచోట పారదర్శకతకూ ఎక్కువ విలువ ఇవ్వాల్సి ఉంటుంది.

మనిషి విజయం ఆర్జించిన డబ్బును బట్టి కాక సాధించిన మనశ్శాంతిని బట్టి ఉంటుంది.



అరిస్టాటిల్

జీవితంలో కొన్నిసార్లు విఫలమైనా సఫలం కావడానికి మరొక అవకాశం కలుగుతుంది.



దావిన్సి

## ప్రజావాక్కు



### నేల మాళిగను హేతువాద సంఘం తెరుస్తుంది

కేరళలోని తిరువనంతపురం అనంతపద్మనాభుని దేవాలయంలోని ఆరవ నేలమాళిగలో ఏదో ఉన్నదని, కొంత మంది ఈమధ్య సైన్స్‌కు కూడా అంతుపట్టని దేవుడు, దెయ్యాలు, అద్భుత శక్తులున్నాయని, తెరిస్తే ప్రళయం వస్తుందని, నాగబంధం తెరిస్తే లోకం అల్లకల్లోలం అవుతుందని, నాగుపాములు బుసకొడుతుంటాయని, సముద్రం ఉప్పొంగుతుంది అని 'యుట్యూబుల్లో' రకరకాలుగా ప్రజలను భయపెడుతున్నారు. ఇలాంటి ప్రకటనల ద్వారా ప్రజలను భయపెట్టేవారిని అరెస్ట్ చెయ్యాలి. ఐదవ నేల మాళిగలో లభించిన ఆభరణాలు కోట్లవిలువ చేస్తాయని, అరవ నేలమాళిగ కూడా తెరవాలని ఆమధ్య హైకోర్టు ప్రయత్నించి, తెరచిన వాళ్ళు చనిపోతున్నారని భక్తులు భయపెట్టగా కోర్టు తెరవటాన్ని వాయిదవేసింది. వాటి గుట్టు రట్టుచేసి ప్రపంచంలో అద్భుతశక్తులు ఏమీ లేవని నిరూపించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నది. నాగ బంధం తెరిస్తే వాళ్ళు చనిపోతారని, గతంలో ఇలాంటివి జరిగాయని భయపెడుతున్నారు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### మెసేజ్ చార్జీల మోత!

ఈ మధ్యకాలంలో బ్యాంకులవారు ఎస్.ఎం.ఎస్. ఛార్జీల మోత మోగించడం మరీ ఎక్కువైంది. దీంతో ఎందుకు తమ బ్యాంకు ఖాతాలోని డబ్బు మాటిమాటికీ కోత పడుతున్నదో తెలియని ఆగమ్యగోచర పరిస్థితుల్లో ఖాతాదారులు కొట్టుమిట్టాడుతున్నారు. ఒకవిధంగా చెప్పాలంటే పరిస్థితి అనేది ఎలా తయారుఅయ్యింది అంటే ఇంట్లో డబ్బు పెట్టుకుంటే రక్షణ సమస్య, అదే బ్యాంకులో వేసుకుంటే ఇలా తమ బ్యాంకు ఖాతాలోని డబ్బు కేంద్రప్రభుత్వం వారుఅనుసరిస్తున్న కొన్ని అర్థం, పర్థం లేని అస్థవ్యస్థమైన విధానాలు ఖాతాదారుల పాలిట పెనుశాపంగా పరిణమిస్తున్నది. దీంతో ప్రజల పరిస్థితిముందు నొయ్యి వెనుక గొయ్యిలా తయారు అయ్యింది.

- బి. మధుపాళి, నంద్యాల జిల్లా

### మొబైల్ వాడకాన్ని తగ్గించాలి

ఇప్పటి కాలంలో చిన్న పిల్లల చేతుల్లో కూడా మొబైల్ ఫోన్లు కనిపిస్తున్నాయి. ఆటల కోసం అని మొదలైన ఈ అలవాటు క్రమంగా హానికరంగా మారుతోంది. ఎక్కువ సేపు మొబైల్ వాడడం వల్ల కంటి చూపు తగ్గిపోవడం, శారీరక చలనం తగ్గడం, చదువుపై దృష్టి తగ్గిపోతోంది. తల్లిదండ్రులు మొబైల్ వాడకాన్ని తగ్గించాలి.

- ఎన్. కృష్ణ, హైదరాబాద్

### విరాళాల నిర్వహణలో నైతికత అవసరం

దేవాలయాలు భక్తులవిశ్వాసానికి ప్రతీకలు. భక్తులు సమర్పించే విరాళాలు దైవభక్తికి, ధార్మిక సేవకు చిహ్నం. అలాంటి పవిత్ర నిధులదుర్వినియోగం లేదా అపహరణకు సంబంధించిన ఆరోపణలు వెలుగులోకి రావడం బాధాకరం. ఇటీవల శ్రీరామాలయ విరాళాల అక్రమ వినియోగానికి సంబంధించిన వార్తలు కూడా ఈఅంశంపై మరోసారి దృష్టి సారింపజేశాయి. ఈ సమస్యను భావోద్వేగంతో కాకుండా వివేకంతో పరిశీలించాలి. నేరం ఎక్కడ జరిగినా నేరమే. దేవాలయం కావచ్చు, ఇతర ప్రార్థనా మందిరం కావచ్చు లేదా ఏ సంస్థ అయినా కావచ్చు ప్రజల విశ్వాసానికి భంగం కలిగించే చర్యలను చట్టం కఠినంగా ఎదుర్కోవాలి. ఆధునిక డిజిటల్ లెక్కల విధానం, స్వతంత్ర ఆడిట్లు, సీసీటీవీ పర్య వేక్షణ, విరాళాల వినియోగంపై క్రమం తప్పకుండా ప్రజలకు సమాచారం అందించడం వంటి చర్యలు విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తాయి. విరాళాల నిర్వహణలో నైతిక విలువలు, పారదర్శకత, చట్టబద్ధత పాటించాలి.

- సి.హెచ్. ప్రతాప్ , శ్రీకాకుళం

### నైపుణ్యం పెంచుకోవాలి

నిరుద్యోగం రోజురోజుకీ పెరిగిపోతుంది దీనికి కారణం ఇటు విద్యార్థులు అటు గవర్నమెంట్. గవర్నమెంట్ ఏమో పాత సిలబస్ అలాగే ఉంచడం, కేవలం సిలబస్ మాత్రమే పూర్తి చేసి చేతులు దులుపుకుంటున్నారు. కానీ నేటి ప్రపంచానికి ఉపయోగపడే నైపుణ్యాలు ఏమి విద్యార్థులకు నేర్పించడం లేదు. నేటి సాంకేతిక రంగానికి తగ్గట్టుగా సిలబస్ పూర్తి చేసి విద్యార్థుల నైపుణ్యాన్ని పెంచాలి. విద్యార్థులు కూడా ఏదో డిగ్రీ చదివామా అని కాకుండా నైపుణ్యం పెంచుకుని భవిష్యత్తులో ఉద్యోగం తెచ్చుకోవాలి. నైపుణ్యం ఉంటేనే ఏదైనా సాధించగలుగుతారు. నైపుణ్యం ఉంటేనే కొత్త ఉద్యోగాల్లో స్థిరపడతారు. లేకుంటే ఆరునెలలకు ఒకసారి ఉద్యోగం వెతుక్కునే పరిస్థితులు ఏర్పడతాయి.

- రాఘవేంద్ర బాబు, ఈస్ట్ గోదావరి జిల్లా

### నీటిని పొదుపుగా వాడుకుందాం

వర్షాకాల పరిస్థితుల దృష్ట్యా, ఎల్‌నినో ప్రభావం, దృష్ట్యా భవిష్యత్‌లో నీరు లభ్యత ఉండడం చాలా కష్టం. కావున అవసరమైన వరకు మాత్రమే నీటిని వాడుకుందాం. మనం ఏ పని చేయాలన్న నీరు లేనిది పని పూర్తి కావడం అసంభవం. కావున మనం నీటిని పొదుపుగా వాడుకుంటూ భవిష్యత్ తరాలకు నీటిని వనరులను అందించాలి.

-ఎం. శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# అప్రమత్తం కాకపోతే ఆహార సంక్షోభమే!

**వాతావరణ మార్పులు ఇక తాత్కాలిక సమస్య కాదు. రాబోయే దశాబ్దాల్లో ఇవే వ్యవసాయ విధానాలను నిర్ణయించే ప్రధాన అంశంగా మారనున్నాయి. అందువల్ల ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు, రైతులు, సమాజం కలిసి ముందస్తు ప్రణాళికతో పనిచేయాలి. వాతావరణ సమాచారాన్ని గ్రామ స్థాయికి తీసుకెళ్లాలి. నీటి సంరక్షణ, మట్టి ఆరోగ్యం, వాతావరణానికి అనుగుణమైన వ్యవసాయ విధానాలు, బలమైన నిల్వవ్యవస్థ, సమర్థవంతమైన పంటల బీమా, రైతులకు ఆర్థిక భరోసా వంటి అంశాలను సమగ్రంగా అమలు చేస్తేనే ఈ సవాలును ఎదుర్కోగలం. ఎల్‌నినో ప్రభావాన్ని మనం ఆపలేము. కానీ దాని వల్ల కలిగే నష్టాన్ని మాత్రం తగ్గించవచ్చు. వాతావరణ సంక్షోభం కేవలం వ్యవసాయాన్నే కాదు.. దేశ ఆహార భద్రతను, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, కోట్లాది ప్రజల జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదం ఉంది.**

వనకల్ల వీరప్ప

వాతావరణ మార్పులు ఇప్పుడు భవిష్యత్ ప్రమాదం కాదు.. వర్తమాన వాస్తవం. ఒకప్పుడు రుతువులు సమయానికి వచ్చేవి. వర్షాలు ఒక క్రమంలో కురిసేవి. రైతులు వాటిని ఆధారంగా చేసుకుని సాగు ప్రణాళికలు రూపొందించేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఎండలు రికార్డు స్థాయికి చేరుతున్నాయి. వర్షాలు ఆలస్యంగా వస్తున్నాయి. వచ్చినా ఒకేసారి కుండపోతగా కురిసి వరదలు సృష్టిస్తున్నాయి. తర్వాత మళ్లీ దీర్ఘకాలం పొడి వాతావరణం నెలకొంటోంది. ఈ అసాధారణ పరిస్థితులకు ప్రధాన కారణాల్లో ఒకటి ఎల్‌నినో ప్రభావం. భారత వాతావరణ శాఖ, భారత ఉష్ణమండల వాతావరణ అధ్యయన సంస్థతో పాటు అంతర్జాతీయ వాతావరణ సంస్థలు కూడా ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశాన్ని హెచ్చరిస్తున్నాయి. ఈ ప్రభావం సెప్టెంబరు వరకు కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీనివల్ల రుతుపవనాల బలం తగ్గి, దేశవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉంది. భారత వాతావరణ శాఖ కూడా ఈ ఏడాది రుతుపవన వర్షపాతం దీర్ఘకాలిక సగటులో సుమారు 90శాతమే ఉండవచ్చని పేర్కొంది. అంటే వ్యవసాయం, తాగునీరు, విద్యుత్, ఆహార ఉత్పత్తి వంటి రంగాలపై ప్రత్యక్ష ప్రభావం పడే అవకాశం ఉంది. ఎల్‌నినో అంటే పసిఫిక్ మహాసముద్రంలోని సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం. ఈమార్పు ప్రపంచవ్యాప్తంగా గాలుల దిశ, వర్షపాత విధానాలను ప్రభావితం చేస్తుంది. భారతదేశంలో సాధారణంగా ఇది నైరుతి రుతుపవనాలను బలహీనపరుస్తుంది. ఫలితంగా వర్షాలు ఆలస్యంగా రావడం, తక్కువగా కురవడం లేదా అసమానంగా కురవడం జరుగుతుంది. ఈ పరిస్థితులు ముఖ్యంగా వర్షాధార వ్యవసాయంపై ఆధారపడే రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయి. భారతదేశంలో దాదాపు 60 శాతం వ్యవసాయం ఇప్పటికీ వర్షాలపైనే ఆధారపడి ఉంది. ముఖ్యంగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు, పత్తి వంటి పంటలు ఎక్కువగా వర్షాధార ప్రాంతాల్లోనే సాగవుతాయి. వర్షాలు తగ్గితే దిగుబడులు పడిపోతాయి. రైతుల ఆదాయం తగ్గుతుంది. అప్పులు పెరుగుతాయి. చివరకు దేశ ఆహార భద్రత కూడా ప్రమాదంలో పడుతుంది. అందుకే వాతావరణ మార్పు అనేది కేవలం ప్రకృతి సమస్య కాదు. అది ఆర్థిక, సామాజిక, ఆహార భద్రతకు సంబంధించిన పెద్ద సవాలు. ఇటీవలి సంవత్సరాల్లో భారతదేశం తీవ్ర వాతావరణ వైపరీత్యాలను వరుసగా చూస్తోంది. ఒకవైపు రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, మరోవైపు కొద్ది గంటల్లోనే నెల రోజుల వర్షం కురిసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జూన్‌లో భారీ వర్షాలు, ఆగస్టు లేదా అక్టోబరులో తీవ్ర పొడి వాతావరణం వంటి అసాధారణ పరిస్థితులు సాధారణమైపోతున్నాయి. పశ్చిమ వాతావరణ కల్లోలాలు, వేడి గాలులు, ఆకస్మిక తుఫాన్లు సంప్రదాయ వాతావరణ చక్రాన్ని పూర్తిగా మార్చేశాయి. ఈ పరిస్థితుల్లో రైతులు గత అనుభవాల ఆధారంగా పంటలు వేయడం ప్రమాదకరంగా మారుతోంది. ఈఏడాది వేసవిలో భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పగటి వేడితో పాటు రాత్రిపూట కూడా ఉష్ణోగ్రతలు తగ్గకపోవడం ఆందోళన కలిగించే అంశం.



మరోవైపు ఉత్తర భారతదేశంలో ఆకస్మిక తుఫాన్లు, భారీ వర్షాలు నమోదయ్యాయి. ఇవి సాధారణ వర్షాలు కాదని, రుతుపవనాల క్రమాన్ని దెబ్బతీసే వాతావరణ మార్పుల సంకేతాలని నిపుణులు చెబుతున్నారు. ఈ పరిణామాలు రాబోయే నెలల్లో వ్యవసాయంపై మరింత ప్రభావం చూపే అవకాశం ఉంది. ఆహారధాన్యాల ఉత్పత్తి తగ్గితే దాని ప్రభావం కేవలం రైతులకే పరిమితం కాదు. మార్కెట్‌లో ధరలు పెరుగుతాయి. పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడుతుంది. గోధుమలు, బియ్యం, పప్పులు, వంట నూనెల ధరలు పెరిగితే ద్రవ్యోల్బణం కూడా అధికమవుతుంది. గతంలో గోధుమలు, కొన్ని రకాల బియ్యం, చక్కెర ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం తాత్కాలిక ఆంక్షలు విధించాల్సి వచ్చిన సందర్భాలున్నాయి. దీనికి ప్రధాన కారణం దేశీయ అవసరాలను ముందుగా తీర్చాల్సిన పరిస్థితి ఏర్పడటమే. ప్రపంచ పరిస్థితులు కూడా భారత్‌కు కొత్త సవాళ్లు విసురుతున్నాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు కారణంగా ఇంధనాలు, ఎరువులు, ఖనిజాల ధరలు పెరుగుతున్నాయి. ఇవి వ్యవసాయ వ్యయాన్ని మరింత పెంచుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌కు ఎరువుల నిల్వలున్నప్పటికీ, రబీ సీజన్‌కు సరిపోతాయా అనే సందేహాలు ఉన్నాయి. వాతావరణ మార్పుల కారణంగా పంటలపై తెగుళ్లు పెరిగితే పురుగుమందుల అవసరం కూడా అధికమవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో సంప్రదాయ వ్యవసాయ పద్ధతులు మాత్రమే సరిపోవు. రైతులు వాతావరణానికి అనుగుణంగా పంటల ఎంపిక, సాగు పద్ధతులు మార్చుకోవాలి. ప్రభుత్వం కూడా సమయానికి వాతావరణ హెచ్చరికలు, పంటల సూచనలు అందించాలి. ప్రతి జిల్లాకు తగిన వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని విత్తనాలు అందుబాటులో ఉంచాలి. తక్కువ నీటితో సాగయ్యే చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజల సాగును ప్రోత్సహించాలి. ఇవి నీటిని ఆదా చేయడమే కాకుండా పోషకాహార భద్రతను కూడా బలోపేతం చేస్తాయి. మట్టిలో సేంద్రియ పదార్థాన్ని పెంచడం కూడా అత్యంత అవసరం. ఆవుపేడ, కంపోస్ట్, పెరటి ఎరువులు, జీవబొగ్గు వంటి సహజ వనరులను వినియోగించడం ద్వారా నేలనీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. దీంతో వర్షాలు ఆలస్యమైనా పంటలకు కొంత రక్షణ లభిస్తుంది. రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గిస్తూ సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో పంటల బీమా వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలి. ముఖ్యంగా వర్షాధార ప్రాంతాల్లోని రైతులందరికీ బీమా రక్షణ కల్పించాలి. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు త్వరితగతిన పరిహారం అందేలా వ్యవస్థను బలోపేతం చేయాలి. అలాగే బహుళ పంటల సాగును ప్రోత్సహించడం ద్వారా ఒకే పంటపై ఆధారపడే ప్రమాదాన్ని తగ్గించవచ్చు. దేశ ఆహార భద్రతను కాపాడాలంటే ఉత్పత్తి పెరగడం మాత్రమే కాదు.. నిల్వ సామర్థ్యం కూడా పెరగాలి. ప్రస్తుతం పంట కోత తర్వాత సరైన గిడ్డంగులు లేక లక్షల టన్నుల ధాన్యం వృథా అవుతోంది. ప్రతి గ్రామం లేదా మండలస్థాయిలో ఆధునిక గిడ్డంగులు నిర్మించి, రైతుల భాగస్వామ్యంతో నిర్వహించే విధానాన్ని అమలు చేయాలి. యువ పారిశ్రామికవేత్తలను ఈ రంగంలో ప్రోత్సహిస్తే గ్రామీణ ఉపాధి పెరగడంతో పాటు ఆహార నిల్వ వ్యవస్థ కూడా బలపడుతుంది. వాతావరణ మార్పులు ఇక తాత్కాలిక సమస్య కాదు. రాబోయే దశాబ్దాల్లో ఇవే వ్యవసాయ విధానాలను నిర్ణయించే ప్రధాన అంశంగా మారనున్నాయి. అందువల్ల ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు, రైతులు, సమాజం కలిసి ముందస్తు ప్రణాళికతో పనిచేయాలి. వాతావరణ సమాచారాన్ని గ్రామ స్థాయికి తీసుకెళ్లాలి. నీటి సంరక్షణ, మట్టి ఆరోగ్యం, వాతావరణానికి అనుగుణమైన వ్యవసాయ విధానాలు, బలమైన నిల్వవ్యవస్థ, సమర్థవంతమైన పంటల బీమా, రైతులకు ఆర్థిక భరోసా వంటి అంశాలను సమగ్రంగా అమలు చేస్తేనే ఈ సవాలును ఎదుర్కోగలం. ఎల్‌నినో ప్రభావాన్ని మనం ఆపలేము. కానీ దాని వల్ల కలిగే నష్టాన్ని మాత్రం తగ్గించవచ్చు. వాతావరణ సంక్షోభం కేవలం వ్యవసాయాన్నే కాదు.. దేశ ఆహార భద్రతను, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, కోట్లాది ప్రజల జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదం ఉంది. ●

# ఎఐలోను 'మహిళా హక్కులు' అవసరం

మర్రాపు వసుంధరా దేవి

ఈ రోజుల్లో ఎక్కడ చూసినా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) గురించే చర్చ జరుగుతోంది. మనుషుల పనిభారాన్ని తగ్గిస్తూ, అద్భుతాలు సృష్టిస్తోందని కొనియాడబడుతున్న ఈ కృత్రిమ మేధస్సు, అంతర్లీనంగా ఒక ప్రమాదకరమైన జాఢ్యాన్ని కూడా తనలో దాచుకుంటోంది. అదే 'లింగ వివక్ష'. ఇటీవల ఐక్యరాజ్యసమితి (యుఎన్) మహిళా విభాగం విడుదల చేసిన ఒక నివేదిక ప్రపంచాన్ని ఉలిక్కిపడేలా చేసింది. 'లేడీస్ అంటే ఎఐకి అలుసు' అనే పచ్చి నిజాన్ని ఈ నివేదిక సమాజం ముందు పెట్టింది. అయితే ఈ వివక్షకు, సమాధానాల్లో దొర్లేతప్పులకు సాంకేతిక పరిభాషలో చెప్పుకునే ఎలాంటి 'బగ్' కారణం కాకపోవడమే ఇక్కడ అసలు ట్విస్ట్. ఎఐ అనేది ఒక ఖాళీ కాగితం లాంటిది. దానికి సొంతంగా ఆలోచించే హృదయమో, నైతికతతో కూడిన మేధస్సో ఉండవు. ఇంటర్నెట్లో దశాబ్దాలుగా అందుబాటులో ఉన్నకోట్లాది మానవ సంభాషణలు, పుస్తకాలు, వార్తలు, సమాచారాన్ని విశ్లేషించి అది సమాధానాలు నేర్చుకుంటుంది. అంటే, మన సమాజంలో శతాబ్దాలుగా వేరూనుకుపోయిన పితృస్వామ్య పోకడలను, స్త్రీలపై ఉన్న పక్షపాతాలను, మూస పద్ధతులను ఎఐ తన గురువులైన మనుషుల నుంచే నేర్చుకుంది. మనుషుల అవలక్షణాలు, పక్షపాతాలే ఎఐకి పాఠాలుగా మారాయి. ఐక్యరాజ్యసమితి పరిశోధనల ప్రకారం.. అధ్యయనంచేసిన ఎఐ వ్యవస్థల్లో 44 శాతం వ్యవస్థలు తీవ్రమైన లింగ వివక్షను, 25 శాతం కంటే ఎక్కువ వ్యవస్థలు లింగ, జాతి వివక్షను స్పష్టంగా ప్రదర్శించడమే దీనికి నిదర్శనం. వివిధ సందర్భాలలో ఎఐ ఇచ్చిన సమాధానాలను పరిశీలిస్తే స్త్రీలపై దానికి ఉన్న చులకనభావం, అలుసు స్పష్టంగా అర్థమవుతుంది.




సాధారణ వాక్యాలను పూర్తి చేయమని ఎఐని అడిగినప్పుడు, అది పురుషులను వ్యాపారాలు, నాయకత్వం, వృత్తిపరమైన విజయాలతో ముడిపెట్టింది. అదే సమయంలో స్త్రీలను ఇల్లు, వంటగది, కుటుంబం, పిల్లల సంరక్షణకే పరిమితం చేస్తూ సమాధానాలిచ్చింది. కొన్ని ప్రత్యేకసందర్భాల్లో స్త్రీలను స్వతంత్ర వ్యక్తులుగాకాకుండా, కేవలం ఆస్తిగా లేదా పురుషులకు లోబడిన లైంగిక వస్తువులుగా చిత్రీకరించేలా ఎఐ ప్రవర్తించింది. ఇందులో ప్రతి ఐదు సమాధానాలలో ఒకటి లింగ వివక్ష లేదా స్త్రీ వ్యతిరేకతతో కూడి ఉండటం గమనార్హం. ఇంతటితో ఆగకుండా, ఇంటర్నెట్ వేదికగా మహిళలపై జరిగే హింసకు, వేధింపులకు కూడా ఎఐ ఒక సాధనంగా మారుతోంది. మహిళా హక్కుల కార్యకర్తలు, జర్నలిస్టులలో నలుగురిలో ఒకరు ఎఐ సహాయంతో ఆన్లైన్ వేధింపులను ఎదుర్కొంటుండటం ఆందోళనకరం. మహిళలఅనుమతి లేకుండా వారి ముఖాలను మార్చేసి 'డీప్‌ఫేక్' అశ్లీలచిత్రాలు, వీడియోలు సృష్టించడానికి ఎఐని వాడుతూ డిజిటల్ ప్రపంచంలో మహిళల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తున్నారు. కోట్లాది మంది ప్రజలు ఇమెయిల్లు రాయడానికి, ప్రెజెంటేషన్లు సిద్ధం చేయడానికి, కంటెంట్ సృష్టించడానికి నిత్యం ఎఐని వాడుతున్న తరుణంలో, అది ఇలాంటి వివక్షతో కూడిన సమాధానాలుఇస్తూపోతే సమాజంలో లింగ వివక్ష మరింత బలపడేప్రమాదం ఉంది. అందుకే ఐక్యరాజ్య సమితి హెచ్చరించినట్లుగా.. మానవ మేధస్సును భర్తీ చేయడం కంటే, మానవులదుర్మార్గాలు, పక్షపాతాలు, వివక్షలను ఎఐ వారసత్వంగా తీసుకోకుండా చూడటమే ప్రస్తుతం మానవాళి ముందున్న అతి పెద్ద సవాలు. ఎఐ అభివృద్ధి దశ నుండి దాని వినియోగం వరకు ప్రతి చోటా లింగ సమానత్వాన్ని, మహిళల హక్కులను జోడించాల్సిన అవసరం ఉంది. ఎఐకి కేవలం కోడింగ్ మాత్రమే కాదు, 'సమానత్వం' అనే పాఠం కూడా నేర్పినప్పుడే అది నిజమైన ప్రగతికి బాటలు వేస్తుంది. ●

# ఫీజుల నియంత్రణకు చర్యలేవి?

ఎం. సోమేశ్వరరావు

నేడు పలు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల, కాలేజీలు ఫీజులు చూస్తే కళ్లు తిరగాల్సిందే. చదువుకునే రోజులు పోయి చదువుకొనే రోజులు వచ్చాయి. బడి తలుపులు తెరిచినా వేళ తల్లిదండ్రుల్లో ఫీజుల టెన్షన్ మొదలైంది. ప్రైవేటు స్కూళ్ళు, కార్పొరేట్ విద్యాసంస్థలలో పుస్తకాలు, ఫీజులు చూస్తుంటే తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. పిల్లల భవిష్యత్తే తమ భవిష్యత్తుగా భావించి అప్పులు చేసి మరీ పిల్లలను చదివిస్తున్నారు. ఎల్. కె.జి నుంచే ఫీజుల బాదుడు భారీగా ఉంటుండడంతో తల్లిదండ్రులు ఏం చేయాలో తెలియక సతమతమవుతున్నారు. జూన్ నెల వచ్చిందంటే చాలు తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. బడి తలుపులు తెరిచే సమయానికి పిల్లలు చదువు కోసం వేలల్లో, లక్షల్లో సొమ్ములు చూసుకోవాల్సి పరిస్థితి వచ్చింది. విజయవాడలో ఓ కార్పొరేట్ స్కూల్లో పదో తరగతి విద్యార్థికి స్కూల్, హాస్టల్ కలిపి మొత్తం లక్ష రూపాయలు ,కొన్ని స్కూళ్లలో ఎల్.కె.జి, యుకెజి ఫీజులే సుమారు రూ.50 వేల నుంచి రూ.1 లక్ష మధ్యలో వసూలు చేస్తున్నారు. రాష్ట్రంలో కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు 2026-27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ముసుగులో ఫీజుల మోత మోగిస్తున్నాయి. కొన్ని స్కూళ్లలో అయితే అప్పుడే అడ్మిషన్లు పూర్తయిపోయినట్లు చెబుతున్నారు. తమ పిల్లలకు ఇంగ్లిష్ మీడియంలో చదువు చెప్పించాలనే ఉద్దేశ్యంతో అడ్మిషన్ల కోసం ప్రైవేట్ స్కూళ్లకు వెళుతున్న తల్లిదండ్రులు అక్కడి ఫీజులు చూసి, వాటిని కట్టడం తమ వల్ల కాదని నిరాశతో వెనుదిరుగుతున్న పరిస్థితి ఉంది. ప్రభుత్వం ఎన్ని జీవోలు, నిబంధనలు రూపొందించినా తమ రూల్ తమదే అనేలా కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలు ప్రవర్తిస్తున్నాయి. కొన్ని స్కూళ్లు అయితే ఒకేసారి మొత్తం అడ్మిషన్ ఫీజు, పాఠశాల ఫీజు కట్టాలనే నిబంధనలను అమలు చేస్తున్నాయి. విద్యాహక్కు చట్టం సెక్షన్ 6 ప్రకారం ప్రభుత్వ నిబంధనల ప్రకారం అడ్మిషన్లు జరగాలి. సెక్షన్ 11లో సూచించిన విధంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు గవర్నింగ్ బాడీ నిర్ణయించిన ఫీజులను మాత్రమే వసూలు చేయాలి. వసూలు చేసే ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో పెట్టాలి. సెక్షన్ 12 ప్రకారం విద్యార్థుల, ఉపాధ్యాయుల నిష్పత్తి 1:20కి మించరాదు. ప్రతి పాఠశాలలో 25శాతం సీట్లను ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మైనార్టీలకు కేటాయించాలి. ఇందులో వికలాంగులు, అనాథలు, హెచ్ఐవి బాధితులు, వీధి బాలలు 5 శాతం, ఎస్సీ బాలలకు 10 శాతం, ఎస్టీబాలలకు 4శాతం, వెనుకబడిన బలహీన వర్గాలు 6శాతం, కేటాయింపు జరిగింది. మొత్తం 25శాతం వీటి ప్రకారం ఎక్కడ కూడా పూర్తి స్థాయిలో అమలు జరగడం లేదు. సెక్షన్ 18 ప్రకారం ప్రభుత్వ నిర్ణీత గడువు తర్వాత కూడా గుర్తింపులేని పాఠశాలను నడిపితే ఒక లక్ష జరిమానా విధిస్తారు. ఒకవేళ జరిమానా తర్వాత కూడా గుర్తింపు లేకుండా మళ్లీ పాఠశాలను నిర్వహిస్తే రోజుకు 10 వేలు జరిమానా విధిస్తారు.



సెక్షన్ 13 ప్రకారం ప్రాథమిక స్థాయిలో ఏ (ప్రవేశ పరీక్ష ) నిర్వహించకూడదు. ఒకవేళ అలా నిర్వహిస్తే తొలిసారి తప్పుకు రూ.25వేల, పునరావృతం అయితే రూ.50 వేల జరిమానా విధిస్తారు. ఏ పాఠశాలలోనూ బోధనా రుసుం కాకుండా ఇతర రూపాల్లో ఎలాంటి ఫీజు (క్యాపిటేషన్ ఫీజు) వసూలు చేయరాదు. అలా వసూలు చేస్తే దానికి 10 రెట్లు జరిమానా విధిస్తారు. ప్రైవేటు విద్యాసంస్థలు అక్రమంగా విద్యాసామగ్రి విక్రయిస్తున్నాయి. విద్యాహక్కు చట్టం ప్రకారం ఏ విద్యాసంస్థలలో కూడా పుస్తకాలు, యూనిఫామ్ అమ్మరాదు. అలా చేస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాల్సి ఉన్న వారిపై చర్యలు తీసుకోవడం లేదు. తమ వద్దే యూనిఫామ్, పుస్తకాలు కొనుగోలు చేయాలంటూ అధిక ధరలు విద్యాసంస్థల యాజమాన్యాలు వసూలు చేస్తున్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రభుత్వ పెద్దలకు చెందినవి కావడంతో చర్యలు తీసుకోవడానికి అధికారులు వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తోంది. విద్యార్థులు తమకు నచ్చినచోట విద్యాసామగ్రిని తెచ్చుకునే సౌలభ్యం కల్పించాల్సి ఉంది. విద్యాశాఖ నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేటు స్కూల్స్‌పై అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. విద్యకు అత్యంత ప్రాధాన్యత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. పాఠశాలల్లో ఆటస్థలం ఉండడం లేదు. ఆటస్థలం ఉన్నప్పటికీ పలు పాఠశాలల్లో పి.ఈ.టీలు ఉండడం లేదు. అనుమతుల సమయంలో బీఈడీ, పీజీ సర్టిఫికేట్లు ఉన్న వారిని చూపించి, అర్హత లేని వారితో పాఠాలు చెప్పిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పాఠశాల వివరాలు, రికగ్నైజేషన్, రెన్యూవల్ సర్టిఫికేట్లు అందజేయకపోయినప్పటికీ విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో ప్రభుత్వ నిబంధనలు అమలు చేయడానికి సరైన ప్రణాళికలు రూపొందించాలి. ఈస్కూల్ మనోళ్లది ఆస్కూల్ వాళ్లది అనే తేడాలు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారు ఎంతటి వారైనా చర్యలు తీసుకోవాలి. ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీలు, స్కూళ్లలో ఫీజుల నియంత్రణ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తోంది. నేడు రాష్ట్రాల్లో కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లు మండల స్థాయి వరకు విస్తరించి ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తుంటే ప్రభుత్వం, అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. పేద, మధ్యతరగతి తల్లిదండ్రుల కష్టార్జితాన్ని ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు జలగల్లా పట్టి వారి రక్తాన్ని పీలుస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఫీజు నియంత్రణ కమిటీ వేస్తామని చెప్పినా ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. 2009 విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల మొత్తం సీట్లలో 25 శాతం పేద పిల్లలకు కేటాయించాలి. కానీ రాష్ట్రంలోని ప్రైవేట్, కార్పొరేట్‌స్కూళ్ల విద్యాహక్కు చట్టాన్ని పట్టించుకుంటున్న దాఖలా లేదు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ కనిపించడంలేదు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు యథేచ్ఛగా ఫీజుల దందా కొనసాగిస్తున్నా అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకుని ఈ విద్యా సంవత్సరం నుంచే ఫీజు నియంత్రణ చర్యలు తీసుకోవాలి. ●

# జాతిసేవలో సాటిలేని శ్యామాప్రసాద్ ముఖర్జీ

## ప్రధాని నరేంద్ర మోడీ

**న్యూఢిల్లీ, జులై 5:** ఇవాళ తేదీ జులై 6.. జాతీయవాదం, నిస్వార్థ సేవ వంటి ఆదర్శాలకు ప్రాణమిచ్చే అసంఖ్యాక ప్రజానీకానికి ఇదొక ప్రత్యేక దినం. అంతులేని సాహసానికి, భరతమాతపై అత్యంత ఆరాధన భావనకు కాలాతీత నిదర్శనంగా నిలిచిన డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి ఈరోజే. ఆధునిక భారతంలో మేధస్సు, ప్రజాసేవ, నైతిక విశ్వాసమనే లక్షణాల అద్భుత సమ్మేళనం ఇంతగా మూర్తీభవించిన ఆయన వంటి నాయకులు దేశంలో చాలా అరుదు.

సురక్షిత, సుఖవంతమైన జీవితానికి లోటు లేని బాల్యం ఆయనది. శ్యామా ప్రసాద్ తండ్రి, సర్ అశుతోష్ ముఖర్జీ సమకాలీన అగ్రశ్రేణి విద్యావేత్తలలో మేధావులలో ఒకరు. అలాంటి సంపన్న కుటుంబంలో పుట్టినప్పటికీ సకల సౌఖ్యాలనూ వదులుకుని త్యాగం, జాతి సేవ దిశగా ఆయన అంతరాత్మ నడిపించింది. వలసవాదం, మతతత్వం, మానవతా సమస్యలు వంటివి కమ్ముకున్న నాటి కల్లోల కాలంలో ఒక మూగ ప్రేక్షకునిగా మిగిలిపోవడం తగదని ఆయన దృఢంగా విశ్వసించారు. ఈ ప్రస్థానంలో ఆయన తొలుత పసికందుగా ఉన్న బిడ్డను, ఆ తర్వాత భార్యను కోల్పోయారు. అంతటి తీవ్ర వ్యక్తిగత విషాదాలను చవిచూసినప్పటికీ దేశ సేవపై ఆయన సంకల్పం మరింత బలపడి, తిరుగులేని నిబద్ధతతో ముందుకే నడిపింది.

డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ ప్రజా జీవనాన్ని అన్నింటికన్నా ఎక్కువగా నిర్వచించిన ఆదర్శం ఏదైనా ఉందంటే అవిభాజ్య భారత్ దిశగా ఆయన దీక్ష. దేశ విభజన సంక్షోభ సమయాన పశ్చిమ బెంగాల్ భారత్‌లో అంతర్భాగంగా ఉండాలని ఆయన ప్రగాఢంగా ఆకాంక్షించారు. ఆనాడు దృఢంగా నిలబడిన ఆయన విశ్వాసమే కొన్నేళ్ల తర్వాత ఆయనను జమ్మూకాశ్మీర్ వైపు నడిపింది. ఆ క్రమంలో జైలుపాలైనా ఆ జీవితం ఆయన ఉత్సాహాన్ని నీరుగార్చలేక పోయింది. కారాగార ఏకాంతం ఆయనను ఎంతమాత్రం కుంగదీయలేదు. ఏ ప్రజల ఆశయాన్ని తనదిగా చేసుకున్నారో వారికి అత్యంత దూరంగా, నిర్బంధంలోనే ఆయన జీవితం హఠాత్తుగా ముగిసింది. చరిత్రలో కొన్ని క్షణాలుంటాయి.. అంతిమ శ్వాసలోనూ ఒక వ్యక్తి త్యాగం రాజకీయాలకు అతీతంగా జాతీయ స్మృతిలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. అటువంటి క్షణాల్లో డాక్టర్ ముఖర్జీ జీవన ప్రస్థానం ఒకటిగా మిగిలింది. ఆచార్య వినోబా భావే చెప్పినట్లు తాను విశ్వసించిన ఆదర్శం కోసం డాక్టర్ ముఖర్జీ ఆత్మార్పణకు వెనుదీయలేదు. అటుపైన ఎన్నో ఏళ్ల తర్వాత 2019లో ఆర్టికల్ 370,35(ఎ)ల రద్దు ఆయన అమరత్వానికి అత్యంత సముచిత నివాళి అనడంలో సందేహం లేదు.

డాక్టర్ ముఖర్జీ సదా దేశానికే ప్రథమ స్థానమిచ్చారు. భారతీయ విలువలకే పెద్ద పీట వేశారు. తదనుగుణంగా ఆనాటి సంప్రదాయ ఆలోచనలకు సవాలు విసురుతూ సంస్థల, వ్యవస్థలకు రూపమివ్వడం ద్వారా ఆయన ఈ లక్ష్యం సాధించారు. అత్యంత పిన్న వయసులోనే కోలకత్తా విశ్వవిద్యాలయానికి ఉప కులపతి అయ్యారు. తనదైన శైలిలో, దేశభక్తి, భవిష్యత్ దృక్పథంతో


శ్యామా ప్రసాద్ ముఖర్జీ(ఫైల్)

కూడిన అనేక సానుకూల మార్పులు తెచ్చారు. ఓసారి విద్యావేత్తల సదస్సులో ప్రసంగించిన సందర్భంగా భవిష్యత్ గుమాస్తాలను, తక్కువ జీతాలు పొందేసిబ్బందిని ఉత్పత్తిచేసే కర్మాగా రాలుగా విద్యా సంస్థలను చిన్న చూపు చూడటం తగదు. స్థానిక సంస్థలు, పురపాలక, రాష్ట్ర, కేంద్ర చట్టసభలను నడిపించగల ఉద్దండులుగా విద్యార్థులను మనం తీర్చిదిద్దాలి. అదే తరహాలో ఆర్థిక, వాణిజ్య,పారిశ్రామిక తదితర జనజీవన ప్రాధాన్య రంగాల వ్యవహారాలను నడిపించగల సమర్థులుగా తయారు చేయాలని కుండబద్దలు కొట్టారు.

డాక్టర్ శ్యామా ప్రసాద్ సారథ్యంలో కలకత్తా విశ్వవిద్యాలయం అనేకవిధాలుగా ముందంజ వేసింది. ఆయన హయాంలో గ్రంథాలయ మౌలిక సదుపాయాల మెరుగుదల, విజ్ఞానశాస్త్ర పరిశోధనలకు ప్రోత్సాహం, పురావస్తు అధ్యయనం, వ్యవసాయంలో కొత్త కోర్సులకు శ్రీకారం వంటి విశిష్ట కృషి కొనసాగింది. క్రీడలు, ఉపాధ్యాయ శిక్షణ, విద్యార్థుల సంక్షేమం తదితరాలపైనా ఆయన ఏకకాలంలో దృష్టి సారించారు. ప్రస్తుతపూర్వ విద్యార్థులలో తమ విశ్వవిద్యాలయంపై సగర్వ భావనను ప్రోదిచేస్తూ, ఏటా జనవరి 24న విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవం నిర్వ హించే సంప్రదాయాన్ని ప్రవేశపెట్టారు. విశ్వవి ద్యాలయంపై ఒకపాట రాయాల్సిందిగా గురుదేవులు రవీంద్రనాథ్ టాగోర్‌ను ఆయన అభ్యర్థించారు.

ఈ స్ఫూర్తికి మరో ఉదాహరణ ఆయన జీవిత చరమాంకంలో కనిపిస్తుంది. అప్పట్లో భారతీయ జనసంఘ్‌ను రూపుదిద్దాలని నిర్ణయించుకున్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ప్రాభవం ఉచ్ఛస్థాయిలో ఉన్న సమయాన మనవైన సాంస్కృతిక మూలాలకు కట్టుబడుతూనే దేశ ప్రగతి కోసం గళం విప్పే ప్రత్యామ్నాయ స్వరం ఒకటి అవసరమని ఆయన భావించారు. అది ఓ చిన్న దివ్వెలాంటిదైనా పరవాలేదని భావించారేమో అన్నట్లుగా దాని చిహ్నంగా మట్టి దీపం గుర్తును డాక్టర్ శ్యామా ప్రసాద్ ఎంచుకోవడం గమనార్హం. ప్రమిద ఎంత చిన్నదైనా, దాని వెలుగు స్వల్పమే అయినా తన పరిధికి మించి చీకటిని పారదోలగల శక్తి దానికి ఉంటుందని భావించారు. తదనంతర క్రియాశీల మనుగడలోనూ జనసంఘ్ ఇదేవిధంగా ముందడుగు వేసింది. డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీకి దేశ ప్రగతిపై గల అవగాహన ఎంతటిదో భారత తొలి పరిశ్రమలు పౌర సరఫరాల శాఖ మంత్రిగా ఆయన పదవీకాలం వెల్లడిస్తుంది. ఒక రాజనీతిజ్ఞుడిగా, అసాధారణ నిజాయితీ, మానవతా దృక్పథం కలగలసిన నాయకుడుగా ఆయన సామర్థ్యం స్పష్టమవుతుంది.

ఈ సందర్భంగా నేనొక వ్యక్తిగత అనుభవాన్ని పంచుకోవాలని భావిస్తున్నాను. స్వావలంబనపై విస్పష్ట దార్శనికతతో డాక్టర్ ముఖర్జీ స్థాపించిన సింద్రీ కర్మాగారాన్ని అనేక దశాబ్దాల పాటు దేశాన్నేలిన పాలకులు నిరక్ష్యం చేశారు. ఈ నేపథ్యంలో దాని పునరుద్ధరణలో తోడ్పడే అవకాశం మా ప్రభుత్వానికి లభించడం నాకు దక్కిన గౌరవంగా నేనుభావిస్తున్నాను. ఆ కార్యక్రమంలో పాల్గొనడం నా జీవితంలోని అత్యంత ప్రత్యేక క్షణాలలో ఒకటిగా నిలిచిపోయిందంటే అతిశయోక్తి కాబోదు. పండిట్ నెహ్రూ 75 ఏళ్ల కిందటే భావ ప్రకటనా స్వేచ్ఛపై ప్రత్యక్ష దాడితో సమానమైన తొలి రాజ్యాంగ సవరణను తెచ్చారు. దాన్ని డాక్టర్ ముఖర్జీ నిర్ద్వంద్వంగా వ్యతిరేకించారు. కాంగ్రెస్ మనోభావన ఏమిటో ఆయన పూర్తిగా అవగతం చేసుకున్నారు. అదే పూర్తిగా సరైనదని కూడా నిరూపితమైంది. అలనాడు.. 75 ఏళ్ల కిందట తొలి సవరణ తెచ్చిన వారే 1975లో ఎమర్జన్సీకి కూడా కారకులయ్యారు. అటుపైన 50 ఏళ్ల కిందట ఉదార ప్రజాస్వామ్య విలువల మూలాలపై మరోసారి దెబ్బకొడుతూ 42వ సవరణ చట్టం తెచ్చారు. మానవతా వాదాన్ని సమున్నతంగా నిలపడం లోనూ డాక్టర్ ముఖర్జీ ప్రత్యేక గుర్తింపు పొం దారు. బెంగాల్లో 1943నాటి అత్యంత ఘోరమైన కరువు విజృంభించినపుడు ఆయన బాధితుల సేవలో పూర్తిగా నిమగ్నమయ్యారు. ప్రజలకు ఆహారం సమకూర్చడం కోసం అనేక స్వచ్ఛంద వంటశాలలు, సహాయ శిబిరాలు ఏర్పాటు చేసేలా అవిరళ కృషి చేశారు. ప్రజల దుస్థితి చూసి నిలు వెల్లా చలించిపోయిన ఆయన, వలస పాలకుల నిర్లక్ష్య వైఖరిని తీవ్రంగా నిరసించారు. పంచషేర్ మన్వంతర్ పేరిట తాను రాసిన పుస్తకంలో తన ఆవేదనను వ్యక్తం చేశారు. అంతకుముందు 1942లో మేదినీపూర్‌ను ఒక మహా తుఫాను వణికించినపుడు పరిస్థితుల పునరుద్ధరణ దిశగా ఆయన కృషికి విస్తృత ప్రశంసలు లభించాయి. ఆరోజుల్లో కలకత్తాలోని ఓ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో యువతను ఉద్దేశించి మా ట్లాడుతూ మీరు ఏ పని చేపట్టినా శ్రద్ధగా, క్షుణ్ణం గా, అర్థవంతంగా చేయండి. ఏ పనినీ అర్థాం తరంగా వదిలేయకండి అరకొర ఫలితంతో సం తృప్తి చెందకండి.. మీ అత్యుత్తమ కృషితో సత్ఫ లితం సిద్ధించే దాకా పట్టువీడకండి" అనిడాక్టర్ ముఖర్జీ పిలుపునిచ్చారు.

దేశం ఇవాళ వికసిత భారత్ స్వప్న సాకారం దిశగా పురోగమిస్తున్న తరుణాన ఆయన ప్రగాఢంగా విశ్వసించిన శక్తి యుత, సమైక్య, ఆత్మవిశ్వాసపూరిత, కరుణార్ద్ర దేశ నిర్మాణానికి నిత్యం కృషి చేయడమే ఆయ నకు మనం అర్పించగల అత్యుత్తమ నివాళి. ఈ నేపథ్యంలో నేటి యువత దృక్పథం గురించి నాకు బాగా తెలుసు కాబట్టి, నేటి సందర్భానికి తగినట్లు వారంతా డాక్టర్ ముఖర్జీ ఆశయాలకు న్యాయం చేసేందుకు అహరహం శ్రమిస్తారని నేను ప్రగాఢంగా విశ్వసిస్తున్నాను.



## 11న ఇస్లామాబాద్ వేదికగా అమెరికా-ఇరాన్ చర్చలు

**ఇస్లామాబాద్, జులై 5:** పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదిక ఈ నెల 11న అమెరికా – ఇరాన్ మధ్య చర్చలు జరుగనున్నాయి. దౌత్య వర్గాల కథనం ప్రకారం, వేదికపై తుది నిర్ణయం ఇంకా ప్రకటించాల్సి ఉంది, స్విట్జర్లాండ్‌లోని బర్గెన్‌స్టాక్ రిసార్ట్‌ను కూడా పరిశీలిస్తున్నారు. పశ్చిమ ఆసియాలో శాంతిని పునరుద్ధరించే లక్ష్యంతో జూన్ 18న అమెరికా, ఇరాన్‌లు ఒక అవగాహన ఒప్పందంపై సంతకాలు చేసిన తర్వాత, దౌత్య ప్రక్రియను సజావుగా కొనసాగించే ప్రయత్నాలలో భాగంగా ఈ చర్చలు జరుగుతున్నాయి. పాకిస్తాన్, ఖతార్‌ల మధ్యవర్తులుగా జూన్ 21న స్విట్జర్లాండ్‌లో సాంకేతిక స్థాయి చర్చలు జరిగాయి. తదుపరి సమావేశంలో ఇరాన్ అణు కార్యక్రమం, ఆంక్షల సడలింపు, విదేశాలలో స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులు, ప్రాంతీయ భద్రతా సమస్యలపై దృష్టి సారించే అవకాశం ఉంది.



## ఇక్కడ బాస్ ఎవరో నెతన్యాహుకు బాగా తెలుసు..

### ఇజ్రాయెల్ ప్రధానిపై ట్రంప్ సెటైర్లు

**వాషింగ్టన్,జులై 5:** ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు ఇక్కడ బాస్ ఎవరో బాగా తెలుసంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్, పశ్చిమాసియా దేశాల వ్యూహాలపై ఇరు దేశాల మధ్య విభేదాలు పొడసూపిన నేపథ్యంలో బంధాన్ని పునర్నిర్మించుకునేందుకు నెతన్యాహు వచ్చే వారమే వైట్ హౌస్‌ను సందర్శించే అవకాశం ఉందని ట్రంప్ వెల్లడించారు. యాక్సియోస్ వార్తాసంస్థకు ఇచ్చిన సంక్షిప్త టెలిఫోన్ ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ తమ మధ్య సంబంధాలు బాగున్నాయని, అయితే అసలు బాస్ ఎవరో నెతన్యాహుకు స్పష్టంగా తెలుసని వ్యాఖ్యానించారు. శ్వేతసౌధంలో సమావేశం కావాలని నెతన్యాహు స్వయంగా కోరారని, నాటో సదస్సు ముగించుకుని తాను తిరిగి వచ్చిన తర్వాత ఈ భేటీ ఉండవచ్చని ట్రంప్ పేర్కొన్నారు. ఫిబ్రవరిలో ఇరాన్‌పై ఉమ్మడి యుద్ధాన్ని ప్రకటించే ప్రణాళికను నెతన్యాహు ప్రవేశపెట్టిన తర్వాత వీరి మధ్య జరగనున్న మొదటి అధికారిక సమావేశం ఇదేకానుంది. అయితే ట్రంప్ పర్యటనల షెడ్యూల్ దృష్ట్యా వచ్చే వారం చాలా తర్వాత కానీ, లేదంటే ఆ తర్వాతి వారంలో కానీ భేటీ ఉండొచ్చని ఇజ్రాయెల్ అధికారి ఒకరు తెలిపారు. అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపేందుకు నెతన్యాహు శుక్రవారం ట్రంప్‌కు ఫోన్ చేశారని, ఈ సందర్భంగా త్వరలోనే అమెరికాలో భేటీ కావాలని ఇరునేతలు అంగీకరించారని ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం ధ్రువీకరించింది.



## అయోధ్య విరాళాల చోరీపై దోషులకు కఠిన శిక్షలు వేయాలి: మోహన్ భగవత్

**నాగ్‌పూర్, జులై 5:** అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ విరాళాల గోల్మాల్ వ్యవహారంపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోట్లాది మంది భక్తుల సెంటిమెంట్లతో ముడిపడి ఉన్న ఈ అంశంలో దోషులకు కఠిన శిక్ష పడాల్సిందేనని ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ అన్నారు. నాగ్‌పూర్‌లో జరిగిన సన్మార్గ్ మైండ్ వెల్నెస్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన మోహన్ భాగవత్ ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబాలే నిన్ననే దీనిపై స్పష్టమైన ప్రకటన విడుదల చేశారని, తాము ఆ ప్రకటనకే కట్టుబడి ఉన్నామని ఆయన పేర్కొన్నారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఈ వ్యవహారాన్ని ఒక సాధారణ ఘటనగా తీసుకోకుండా, అసాధారణమైనదిగా పరిగణించాలని ఆర్ఎస్ఎస్ సూచించింది. ఈ దురదృష్టకర ఘటనను ఆసరాగా చేసుకుని హిందూ ధర్మాన్ని, సమాజాన్ని అపకీర్తి పాలు చేయడానికి ప్రయత్నించే వ్యతిరేక, విద్రోహ శక్తుల కుట్రలను భక్తులు తిప్పికొట్టాలని సంఘ్ పిలుపునిచ్చింది. ఇదే కార్యక్రమంలో మోహన్ భాగవత్ మానసిక ఆరోగ్యం ప్రాధాన్యతను కూడా ప్రస్తావించారు. శారీరక అనారోగ్యం మనిషిని బలహీనపరిచినప్పుడు, అది మానసిక స్థితిపై కూడా ప్రభావం చూపుతుందని, అందుకే సంపూర్ణ ఆరోగ్యానికి ప్రశాంతమైన మనస్సు ఎంతో అవసరమని చెప్పారు.

## అవినాష్ బ్యాంక్ ఖాతానుంచి రూ.15 లక్షల లావాదేవీలు..

**అయోధ్య,జులై 5:** అయోధ్య రామజన్మభూమి ఆలయంలో విరాళాల దుర్వినియోగం కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు అవినాశ్ శుక్లా బ్యాంక్ అకౌంట్ నుంచి రూ. 15 లక్షలకు పైగా ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ఈ డబ్బును పలువురికి ఆన్‌లైన్ ద్వారా ఇవ్వడంతో పాటు.. ఇంకొందరికి నగదు రూపంలో కూడా ఇచ్చినట్లు దర్యాప్తులో తేలింది. అవినాశ్ శుక్లా తన గర్ల్‌ఫ్రెండ్‌కి సుమారు రూ. 2 లక్షల నగదుతో పాటు ఖరీదైన ఫోన్ బహుమతిగా ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. ఈ నిధులు అన్నీ ఆలయ విరాళాల నుంచి మళ్లించినవేనా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

## బంగారు రామచరిత మానస్ అదశ్యంపై ఫిర్యాదు

**అయోధ్య,జులై 5:** అయోధ్య రామమందిరంలో విరాళాల దుర్వినియోగంపై దర్యాప్తు కొనసాగుతున్న తరుణంలోనే మరో సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. తాను, తన కుటుంబం అత్యంత భక్తిశ్రద్ధలతో బహూకరించిన కోట్లాది రూపాయల విలువైన బంగారు పూత రామచరితమానస్ గ్రంథం అదృశ్యం కావడంపై కేంద్ర మాజీ హోంశాఖ కార్యదర్శి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ వ్యవహారంపై ఆయన స్పష్టత కోరుతున్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎస్. లక్ష్మీ ్మ నారాయణన్, ఆయన భార్య సరస్వతి కలిసి 2024 ఏప్రిల్‌లో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు ఒక అమూల్యమైన బహుమతిని సమ ర్పించారు. తులసీదాస్ రచించిన రామచరితమా నస్‌లోని 10,902 శ్లోకాలతో కూడిన 522 పేజీలకు బంగారు పూత పూయించి, ఒక గ్రంథం గా రూపొందించారు.

సుమారు 147 కిలోల బరువున్న ఈ గ్రంథం విలువ దాదాపు రూ.4.5 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఈ గ్రంథాన్ని ఆలయంలో కొన్ని నెలల పాటు భక్తుల దర్శనార్థం ఉంచారని, ఆ తర్వాత ఎలాంటి సమాచారం లేకుండా దానిని అక్కడి నుంచి తొలగించారని లక్ష్మీ ్మనారాయణన్ ఆవేదన వ్యక్తం చేశారు. రామజన్మభూమి ఉద్యమంతో మా కుటుంబానికి ఆధ్యాత్మిక అనుబంధం ఉంది. నా దివంగత తల్లిఏళ్ల తరబడి రామనామాన్ని రాశారు. నా పదవీ విరమణ తర్వాత వచ్చిన సంపాదనతో శ్రీరాముడికి సేవగా ఈ కానుకను సమర్పించాను. దీని ద్వారా గుర్తింపు కోరుకోవడం లేదు, కేవలం పారదర్శకత మాత్రమే కావాలి. ప్రతిరోజూ దానికి పూజలు జరిగేవి, భక్తులు దర్శించుకునేవారు. అప్పుడు నేను చాలా సం తోషించాను. కానీ అకస్మాత్తుగా దాన్ని అక్కడి నుంచి తీసేశారని ఆయన వాపోయారు.



## హార్ముజ్ మీదుగా వచ్చే నౌకలకు సేవా రుసుం

### మిత్రదేశాలకు ప్రత్యేక రాయితీలు

### ఇరాన్‌ప్రతినిధి వెల్లడి

**బీజింగ్,జులై 5:** ప్రపంచ ఇంధన వాణిజ్యంలో అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధిలో ప్రయాణించే వాణిజ్య నౌకలపై సేవా రుసుములు వసూలు చేయనున్నట్లు ఇరాన్ ప్రకటించింది. అమెరికాతో కుదుర్చుకున్న 60 రోజుల ఉచిత ప్రయాణ ఒప్పందం ముగిసిన తర్వాత ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. కష్టకాలంలో తమకు మద్దతుగా నిలిచిన స్నేహపూర్వక దేశాలకు ప్రత్యేక రాయితీలు కల్పిస్తామని తెలిపింది. చైనాలోని ఇరాన్ రాయబారి అబ్దోల్‌రెజా రహ్మానీ ఫజ్లీ బీజింగ్‌లో జరిగిన వరల్డ్ పీస్ ఫోరంలో ఈ వివరాలు వెల్లడించారు. ఈ రుసుములను టోల్ ఫీజుగా పరిగణించరాదని, నౌకల భద్రత, ట్రాఫిక్ పర్యవేక్షణ, పర్యావరణ పరిరక్షణ వంటి సేవలు అందించినందుకు మాత్రమే వసూలు చేస్తున్నామని ఆయన వివరించారు.

## సిఎం విజయ్ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు రూ.180 కోట్లు ఖర్చు!

### మాజీ మంత్రి సెంథిల్ బాలాజీపై పోలీసులు లుకౌట్ నోటీసులు



**చెన్నై,జులై 5:** తమిళనాడులో కొత్తగా ఏర్పాటైన సీఎం జోసెఫ్ విజయ్ (టీవీకే) ప్రభుత్వాన్ని పడదోసేందుకు కుట్ర జరుగుతోందన్న ఆరోపణలపై చెన్నై పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ కేసులో డీఎంకే మాజీ మంత్రి వి.సెంథిల్ బాలాజీ, ఆయన సోదరుడు ఆర్ వి.అశోక్ కుమార్‌లపై లుకౌట్ నోటీసులు జారీ చేశారు. ప్రవేశపెట్టబోయే అవిశ్వాస తీర్మానంలో స్పీకర్‌కు వ్యతిరేకంగా ఓటు వేసేందుకు ఒక టీవీకే ఎమ్మెల్యేకు రూ. 35 కోట్లు ఆఫర్ చేసినట్లు వస్తున్న ఆరోపణలపై పోలీసులు వేట సాగిస్తున్నారు. ఈ కేసులో గతనెల 29న ఉత్తంగరై టీవీకే ఎమ్మెల్యే ఎన్. ఇళయరాజా ఫిర్యాదు చేశారు. ఒక ఒపీనియన్ పోలింగ్ సంస్థ అధినేతనని చెప్పుకుంటూ ఒక వ్యక్తి ఒక ప్రధాన రాజకీయ పార్టీ తరఫున తనకు కోట్ల రూపాయల లంచం ఆఫర్ చేశాడని, దాన్ని తిరస్కరించడంతో తన కుటుంబానికి ప్రాణహాని కలిగించేలా బెదిరింపులకు పాల్పడ్డాడని ఆయన ఆరోపించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా ట్రిప్లికేన్ పోలీసులు ప్రధాన నిందితుడు తిరునావుక్కరసుతో పాటు ఆయన అనుచరులు నరేష్, త్యాగరాజన్ సహా ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. వీరి విచారణలో ఈ కుట్ర అంతా సెంథిల్ బాలాజీ, అశోక్ కుమార్ల ప్రత్యక్ష ఆదేశాల మేరకే జరిగినట్లు తేలిందని పోలీసులు వెల్లడించారు. సెంథిల్ బాలాజీని సోమవారం విచారణకు హాజరుకావాలని కరూర్ జిల్లా రామేశ్వరపట్టిలోని సెంథిల్ బాలాజీ పూర్వీకుల నివాసంలో సమన్లు కూడా జారీ చేశారు. శాసనసభ్యులను ప్రలోభపెట్టేందుకు ఏకంగా రూ. 180 కోట్లు కేటాయించారని దర్యాప్తులో తేలడంతోపరారీలో ఉన్న నిందితుల కోసం కరూర్, తిరుచిరాపల్లి, కోయంబత్తూర్, బెంగళూరులలో ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ఎలాంటి స్వతంత్ర ఆధారాలు లేకుండా కేవలం కాల్ డేటా ఆధారంగానే తనను ఇరికిస్తున్నారంటూ అశోక్ కుమార్ ముందస్తు బెయిల్ కోసం మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు.

## ఒక్క దెబ్బతో అందర్నీ లేపేయొచ్చు..

### ఖమేనీ అంత్యక్రియలపై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు



**టెహ్రాన్, జులై 5:** ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీఖమేనీ అంత్యక్రియలతో ఆ దేశం శోక సంద్రంలో మునిగిపోయింది. అమెరికా–ఇరాన్ యుద్ధం మొదలైన సమయంలోనే ఖమేనీని అమెరికా బలగాలు హతమార్చాయి. అయితే, ఈ అంత్యక్రియలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ చేసిన తాజా వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ఖమేనీ అంత్యక్రియలకు ఇరాన్ అగ్రనేతలంతా ఒకేచోట చేరారని, తలచుకుంటే ఒక్క దాడితో వారందరినీ హతమార్చే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం దౌత్య చర్చలు కొనసాగుతున్నందున అలాంటి చర్య తీసుకోవడం లేదని చెప్పడం చర్చనీయాంశమైంది. అమెరికా మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ 'అందరూ ఒకేచోట ఉన్నారు. ఒక్క దాడి చేస్తే అందర్నీ అంతం చేయొచ్చు. కానీ అలా చేయం. ఎందుకంటే అలా చేస్తే చర్చలు జరిపేందుకు ఎవరూ మిగలరు' అని వ్యాఖ్యానించారు. ఖమేనీ అంత్యక్రియల్లో వేలాది మంది ప్రజలు పాల్గొని నివాళులర్పించడంపై కూడా ట్రంప్ వ్యాఖ్యానించారు. ఖమేనీని ఇరాన్ ప్రజల్లో చాలా మంది వ్యతిరేకిస్తారని తాను భావించానని, అయితే భారీ సంఖ్యలో ప్రజలు దుఃఖించడం తనను ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. 'అవి నిజమైన కన్నీళ్లు కాకపోవచ్చు.. నకిలీ కన్నీళ్లు కూడా కావచ్చు' అని ట్రంప్ వ్యాఖ్యానించినట్లు అక్సియోస్ పేర్కొంది. ఇరాన్ అమెరికాతో ఒప్పందం చేసుకోవాలని తీవ్రంగా ప్రయత్నిస్తోందని కూడా ట్రంప్ అన్నారు. వాళ్లు ఒప్పందం కోసం వేడుకుంటున్నారు అని పేర్కొన్న ఆయన, అంత్యక్రియలు పూర్తయ్యే వరకు ఇరు దేశాలు వారం రోజుల పాటు చర్చలు, సైనిక చర్యలను తాత్కాలికంగా నిలిపివేయాలని అంగీకరించాయని తెలిపారు.

అయితే, ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. ఆర్మేనియాలోని ఇరాన్ రాయబార కార్యాలయం ఎక్స్ వేదికగా స్పందిస్తూ 'మీకు నాగరికత లేదు.. చరిత్ర లేదు.. గౌరవం లేదు. అందుకే ఇలాంటి విషయాలు మీకు అర్థం కావు' అంటూ ట్రంప్‌పై తీవ్రవిమర్శలు చేసింది. టెహ్రాన్‌లో నిర్వహించిన ఖమేనీ అంత్యక్రియలకు వేలాది మంది ప్రజలు హాజరయ్యారు. ఇరాన్ జెండాలు ఊపుతూ, ఖమేనీ చిత్రపటాలతో ప్రజలు నివాళులర్పించారు. ఖమేనీతోపాటు ఆయన కుటుంబసభ్యుల శవపేటికలను కూడా ప్రజల సందర్శనార్థం ఉంచారు.

ఖమేనీ మరణం తర్వాత ఆయన వారసుడిగా బాధ్యతలు చేపట్టిన కుమారుడు మోజ్తాబా ఖమేనీ ఇప్పటివరకు ప్రజల ముందుకు రాలేదు. ఇటీవల జరిగిన దాడిలో ఆయన కూడా గాయపడినట్లు సమాచారం ఉన్నప్పటికీ, దీనిపై ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి వివరాలు వెల్లడించలేదు.



## మెటాకు కేంద్ర ఐటిశాఖ నోటీసులు

**న్యూఢిల్లీ,జులై 5:** సోషల్ మీడియా దిగ్గజం మెటాకు చెందిన ఇన్‌స్టాగ్రామ్‌లో బాలల లైంగిక దోపిడీ, వేధింపులకు సంబంధించిన కంటెంట్ (సీఎస్ఈఏఎం) చెల్లింపు ప్రకటనల రూపంలో ప్రత్యక్షం కావడంపై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఈ వ్యవహారంపై మెటాకు శనివారం నోటీసులు జారీ చేసిన కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ వారం రోజుల్లోగా సమగ్ర వివరణ ఇవ్వాలని ఆదేశించింది. నిర్దేశిత గడువులోగాస్పందించకుంటే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) చట్టం, పోక్సో చట్టం2012 కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ ఆరోపణలపై మెటా ప్రతినిధి స్పందిస్తూ, సీఎస్ఈఏఎం విషయంలో తమ సంస్థ జీరో టాలరెన్స్ విధానాన్ని అనుసరిస్తుందని తెలిపారు. ఇలాంటి కంటెంట్‌ను, దానిని వ్యాప్తి చేసే నేరగాళ్లను గుర్తించడానికి మేము అధునాతన ఏఐ టెక్నాలజీని ఉపయోగిస్తున్నాము. అయినప్పటికీ, 350 కోట్లకు పైగా ఉన్న మా వినియోగదారులలో దాగి ఉన్న నేరగాళ్లతో మా పోరాటం నిరంతరం కొనసాగుతూనే ఉంది. మా నిపుణుల బృందాలు రక్షణ వ్యవస్థలను ఎప్పటికప్పుడు మెరుగుపరుస్తూనే ఉన్నాయని ఈమెయిల్ సమాధానంలో పేర్కొన్నారు.

## 3వేలకు పెరిగిన వెనెజులా మృతులు

**కారకాస్, జులై 5:** వెనుజులా భూకంపం ఆ దేశానికి తీరని విషాదాన్ని మిగిల్చింది. గత నెలలో సంభవించిన రెండు వరుస భూకంపాల వల్ల దాదాపు మూడు వేల మంది మరణించినట్లు అంచనా. ఇప్పటికే 2,954 మందికిపైగా మృతదేహాల్ని సహాయక బృందాలు వెలికితీశాయి. మరోవైపు సహాయక చర్యలు కూడా ముగింపు దశకు చేరుకున్నాయి. ముఖ్యంగా విదేశీ సహాయక బృందాలు వెనుజులాను వీడుతున్నాయి. గత జూన్ 24న వెనుజులాలో వరుసగా రెండు భూకంపాలు సంభవించాయి. దక్షిణ కారకాస్ ప్రాంతంలో 7.2 తీవ్రతతో ఒక భూకంపం, 7.5 తీవ్రతతో మరో భూకంపం సంభవించాయి. దీంతో అనేక బిల్డింగులు సహా నిర్మాణాలు నేలకూలాయి. 72 గంటల్లో ఎక్కువ మందిని బతికించడానికి రెస్క్యూ బృందాలు ప్రయత్నిస్తాయి. అయితే, భూకంపం సం భవించి దాదాపు 9రోజులు కావడంతో సహాయక చర్యల్నినెమ్మదిగా కొనసాగిస్తున్నారు. ఎందుకంటే ఈ సమయంలో బాధితులు బతికి ఉండే అవకాశాలు చాలా తక్కువ.

# సంక్షిప్త వార్తలు

## బంకిపూర్ నుంచే ప్రశాంత్ కిశోర్ పోటీ..



**పాట్నా,జులై 5:** ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెడుతున్నారు. బీహార్‌లోని బంకిపూర్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉప ఎన్నికలో ఆయన పోటీ చేయనున్నట్లు జన్ సురాజ్ పార్టీ (జేఎస్‌పీ) చీఫ్ మనోజ్ భారతి ఆదివారం ప్రకటించారు. దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న ఈ స్థానం నుంచి కిశోర్ బరిలో దిగుతుండటంతో ఆయన రాజకీయ అరంగేట్రంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ నియోజకవర్గం నుంచి గెలిచిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రాజ్యసభకు వెళ్లడంతో ఈ ఉపఎన్నిక అనివార్యమైంది.

## కోల్‌కతాలో అదానీ 2వేల పడకల ఆసుపత్రి



**కోల్‌కతా, జులై 5:** పారిశ్రామిక దిగ్గజం అదానీ గ్రూప్ ఆరోగ్యరంగంలో మరో భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతా సమీపంలోని న్యూటౌన్ ప్రాంతంలో 2,000 పడకల సామర్థ్యంతో ఒక అత్యాధునిక ఆసుపత్రిని ఏర్పాటు చేయనున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సువేందు అధికారి వెల్లడించారు. ఇందులో సగంపడకలను అంటే 1,000 బెడ్లను పేదరోగులకు పూర్తిగాఉచితంగా కేటాయించనున్నట్లు ఆయన తెలిపారు. తన నియోజకవర్గం భవానీపూర్‌లో పౌరసమాజ ప్రతినిధులతో జరిగిన ఒక సమావేశంలో సీఎం మాట్లాడారు.

## పాండవానీ జానపద కళాకారిణి తీజన్‌బాయి కన్నుమూత



**రాయ్‌పూర్,జులై 5:** ప్రఖ్యాత పాండవానీ జానపద కళాకారిణి, పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత తీజన్ బాయి (70) కన్నుమూశారు. గత కొంతకాలంగా వయోభారంతో తలెత్తిన ఆరోగ్య సమ స్యలతో బాధపడుతున్న ఆమె, రాయ్‌పూర్‌లోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడి చారు. ఆమె మరణంతో భారతీయ జానపద కళారంగంలో ఒక సువర్ణ అధ్యాయం ముగిసినట్లయింది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన తీజన్ బాయి, మహాభారత గాథలను తనదైన శైలిలో గాత్రం, అభినయంతో ఆవిష్కరించి అంతర్జాతీయ గుర్తింపు పొందారు.

## టిఎంసి మాజీ ఎమ్మెల్యేపై లైంగిక దాడి ఫిర్యాదులు



**కోల్‌కతా,జులై 5:** పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే షౌకత్ మొల్లాపై కొత్తగా లైంగికదాడి ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇప్పటికే ఓ బాంబు పేలుడు కేసులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ఆయనపై ఇద్దరు మహిళలు ముందుకు వచ్చి సంచలన ఆరోపణలు చేశారు. షౌకత్, అతడి అనుచరులు తమపై అత్యాచారం, చిత్రహింసలకు పాల్పడ్డారని వారు మీడియా ముందు వాపోయారు. 2019లో షౌకత్ మొల్లా తన కొడుకును కిడ్నాప్ చేసి, ఏడాది పాటు నిర్బంధంలో ఉంచారని బాధిత మహిళ ఆరోపించారు.

## ట్రంప్‌కు ప్రధాని మోడీ స్వాతంత్ర్యదినోత్సవ శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ,జులై 5:** అమెరికా సంయుక్త రాష్ట్రాల 250వ స్వాతంత్ర్య దినోత్సవ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని, ఆ దేశ ప్రజలకు మరియు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు భారత ప్రధాని నరేంద్ర మోడీ శుభాకాంక్షలు తెలిపారు. 140 కోట్ల మంది భారతీయుల తరఫున ఈ అపూర్వ మైలురాయిని పురస్కరించుకుని అభినందనలు తెలియజేస్తున్నట్లు ఆయన సోషల్‌మీడియా వేదికగా పేర్కొన్నారు. రాబోయే 250 ఏళ్లలో అమెరికా మరింత ప్రగతిని సాధించాలని ఆకాంక్షిస్తూ, రెండు దేశాల మధ్య భాగస్వామ్యం నూతన శిఖరాలకు చేరుకోవాలని ఆశించారు.

## ఎల్ఎన్జీ సరఫరా పునరుద్ధరణతో ఆంక్షలు ఎత్తివేసిన కేంద్రం

**న్యూఢిల్లీ, జులై 5:** అమెరికా ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు తగ్గి, పశ్చిమ ఆసి యాలో కాల్పుల విరమణ అమల్లోకి రావడంతో భారత్‌కు లిక్విడ్ నేచురల్‌గ్యాస్ సరఫరా మళ్లీ సాధారణ స్థితికి చేరుకుంది. దీంతో కేంద్ర ప్రభుత్వం గతంలో అమలు చేసిన అత్యవసర సహజ వాయువు సరఫరా నియంత్రణ ఉత్తర్వులను అధికారికంగా ఉపసం హరించుకుంది. ఈ నిర్ణయంతో ఎల్ఎన్జీపై ఆధారపడిన పరిశ్రమలకు పెద్ద ఊరటలభించింది. కాల్పుల విరమణ అమల్లోకి రావడంతో నౌకలరవాణా తిరిగి సాధారణ స్థితికి చేరుకుంది. ఈ నేపథ్యంలో పెట్రోలియం అండ్ సహజ వాయువుల మంత్రిత్వశాఖ తాజా నోటిఫికేషన్ జారీ చేస్తూ అత్యవసర ఆంక్షలను ఎత్తివేసింది.

## ఆదర్శనీయుడు సంత్ సేవాలాల్ మహారాజ్

● బంజారా ఏక్త సంకల్ప్ యాత్రను ప్రారంభించిన మంత్రి



**గుత్తి, జులై 5 ప్రభాతవార్త:** బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ ఆదర్శనీయులని ఆయన ప్రబోధనలు ప్రజలకు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లా గుత్తి మండలంలోని సేవాలాల్ జన్మస్థలమైన సేవాఘడ్‌లో ఆదివారం సేవాలాల్ మహారాజ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన భారత్ బంజారా ఏక్త సంకల్ప్ యాత్రను ఆయన ప్రారంభించారు. అంతకుమునుపు రాష్ట్ర మాజీ మంత్రి రఘువీరారెడ్డి, స్థానిక మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ గుప్తాలు ఆలయంలో ప్రత్యేక పూజలు గావించారు. అనంతరం మాత జగదాంబ ఆలయం, సేవాలాల్ మహారాజ్ ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ 18వ శతాబ్దంలో సేవాలాల్ మహారాజ్ బంజారాల్లో మార్పు తెచ్చేందుకు చేసిన కృషిని కొనియాడారు. ఒక సంఘసంస్కర్తగా, ఆధ్యాత్మికవేత్తగా ప్రజలకు విద్య క్రమశిక్షణ ఆర్థిక స్వావలంబన, మద్యపాన నిషేధాల పట్ల అవగాహన కల్పించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. నైతికత సేవాతత్పరత సేవాలాల్‌కే దక్కుతుందన్నారు. సేవాఘడ్‌లో ప్రారంభమైన ఈ యాత్ర 14 రాష్ట్రాల మీదుగా ఏడు వేల కిలోమీటర్ల మేర 21 రోజులపాటు కొనసాగి ఢిల్లీ చేరనుంది. బంజారా భాషను అధికారికంగా 8వ షెడ్యూల్లో చేర్చాలని, బంజారా యూనివర్సిటీ సేవాఘడ్‌లో ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్లతో ఈ యాత్ర కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు జగన్నాథరావు, మహారాజ్ ధర్మాధికారి, బాబుసింగ్, కిషన్ రాథోడ్, ఉమేష్ జాదవ్, రవీందర్, కేశవ నాయక్, బాలా నాయక్, శ్రీరాములు నాయక్, తిప్పయ్య నాయక్, చక్రి నాయక్, ఆంజనేయులు, నరేంద్ర రాథోడ్, శివకుమార్ నాయక్, మల్లికార్జున నాయక్, అశ్వర్థ నాయక్, భారతిప్రసాద్, పురుషోత్తమాచార్యులు, బిజెపి నాయకులు, బంజారా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో పోటీ చేసి తప్పు చేసా



● జనసేన శాసన సభ్యుడు మండలి బుద్ధప్రసాద్

**విజయవాడ, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** తాజా రాజకీయాలపై జనసేన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కీలక వ్యాఖ్యలు చేసారు. తాను జీవితంలో చేసిన పెద్ద తప్పు ఏదైనా ఉందంటే.. అది ఈ దఫా ఎన్నికల్లో ఎమ్మెల్యే గా పోటీ చేయటం అంటూ వ్యాఖ్యానించారు. సుదీర్ఘ కాలం కాంగ్రెస్‌లో ఆ తరువాత టిడిపిలో పనిచేసిన బుద్ధప్రసాద్ 2024 ఎన్నికల్లో జనసేన నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2014-19 కాలంలో డిప్యూటీ స్పీకర్‌గానూ పని చేసారు. వివాద రహితుడుగా పేరు ఉన్న బుద్ధప్రసాద్ ప్రస్తుత రాజకీయాలపైన చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రసారమవుతున్నాయి. విజయవాడలో శనివారం రోశయ్య విగ్రహావిష్కరణ సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేసారు. రోశయ్య వంటి మహానుభావుల సరసన నిలబడి రాజకీయాలు చేసామని, ఈ రోజు ఎలాంటి రాజకీయాల్లోకి వెళ్తున్నామో అర్థం కావటం లేదని వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో ఎందుకు ఉన్నామా అని నిత్యం బాధ పడాల్సి వస్తుందన్నారు. రోశయ్యకు ఇతరులను ఎలా గౌరవించాలో తెలుసని, ఇప్పటి నాయకుల భాష వాడలేదని చెప్పుకొచ్చారు. సిద్ధాంత పరంగా వ్యతిరేకించారే కానీ, వ్యక్తిగత విమర్శ లు చేయలేదని చెప్పారు. రాజకీయాలు కలుషితమైన తరుణంలో రోశయ్య విగ్రహం ద్వారా స్ఫూర్తి నింపే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. సభా వేదిక పైన ఉన్న బిజెపి ఎమ్మెల్యే సుజనా చౌదరి సైతం ఇలాగే బాధ పడుతున్నారని బుద్ధప్రసాద్ తెలిపారు. దివంగత ఎన్టీ రామారావుతో అసెంబ్లీలో తీవ్రంగా విభేదించినప్పటికీ, వారి మధ్య వ్యక్తిగత అనుబంధం గొప్పగా ఉండేదని ఓ సంఘటనను వివరించారు. తన వివాహానికి హాజరైన ఎన్టీఆర్, రోశయ్యను తన పక్కనే కూర్చోబెట్టుకుని ఆప్యాయంగా ముచ్చటించారని చెబుతూ బుద్ధప్రసాద్ భావోద్వేగానికి గురయ్యారు. ప్రస్తుత రాజకీయాల తీరుపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "రోశయ్య వంటి మహానుభావులతో కలిసి మేం గౌరవప్రదమైన రాజకీయాలు చేశాం. కానీ ఇప్పుడు ఎలాంటి వికృత రాజకీయాల్లోకి వెళ్తున్నామో అర్థం కావడం లేదు. అసలు ఈ రాజకీయాల్లో ఎందుకు కొనసాగుతున్నామా అని రోజూ బాధపడాల్సి వస్తోంద్ఙి అని ఆవేదన వెళ్లగక్కారు. వేదికపై ఉన్న బిజెపి ఎమ్మెల్యే సుజనా చౌదరిని ఉద్దేశిస్తూ, ప్రస్తుత పరిస్థితులను చూసి ఆయన కూడా తనలాగే లోలోపల మదనపడుతున్నారని వ్యాఖ్యానించారు. కలుషితమైన ఈ తరుణంలో రోశయ్య విగ్రహం సమాజానికి స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షించారు. గత వైసిపి ప్రభుత్వంపై కూడా బుద్ధప్రసాద్ విమర్శలు చేశారు. అవనిగడ్డలో రోశయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వం అనుమతులు ఇవ్వకుండా అడ్డుకుందని ఆరోపించారు. "ఆనాడు నేను ఒక శపథం చేశాను. మళ్లీ ఎమ్మెల్యేగా గెలిచి, అవనిగడ్డలో రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన తర్వాతే ఇతర పనులు చేపడతానని మాటిచ్చాను. ఈ రోజు వాసవీ ఫౌండేషన్ చొరవతో విజయవాడలో ఈ విగ్రహావిష్కరణ జరగడం, నా సంకల్పం నెరవేరడం ఎంతో సంతోషాన్నిస్తోంద్ఙి అని వివరించారు. రాజకీయాల్లో హుందాతనం లేని పరిస్థితులు ఇప్పుడు ఏర్పడ్డాయని బుద్ధప్రసాద్ వ్యాఖ్యానించారు.



# సాహితీ సవ్యసాచి డాక్టర్ శాంతి నారాయణ

● 80 వసంతాల అక్షర హాలికుడి జీవిత, సాహిత్య సదస్సులో వక్తలు

ఉద్యమకారుడిగా బహుముఖ సేవలు అందిస్తున్న డాక్టర్ శాంతినారాయణ నిరంతర స్ఫూర్తిదాత అని పేర్కొన్నారు. అనంత సాహిత్యకారులు, సాహిత్య మిత్రుల ఆధ్వర్యంలో ఆదివారం "80 వసంతాల అక్షర హాలికుడు డా.శాంతి నారాయణ జీవిత, సాహిత్య సదస్సు ఆర్డిటి ఎకాలజీ సెంటర్‌లో ఘనంగా సాగింది. ప్రముఖ కవి, కథా రచయిత, సాహిత్య విశ్లేషకుడు జి.వెంకటకృష్ణ సదస్సుకు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎకాలజీ డైరెక్టర్ వై.వి. మల్లారెడ్డి, కవి, కథా, నవలా రచయిత సడ్లపల్లి చిదంబర రెడ్డి హాజరై మాట్లాడారు. శాంతి నారాయణ సాహిత్యంలోని వివిధ అంశాలపై పలువురు వక్తలు ప్రసంగించారు. ప్రముఖ సాహిత్య విమర్శకులు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, ప్రముఖ కథా, నవలా రచయిత మారుతి పౌరోహితం, ప్రముఖ సాహిత్య విమర్శకులు డాక్టర్ కె.నాగేశ్వరాచారి, ప్రముఖ కథా రచయిత ఉప్పరపాటి వెంకటేశులు, ప్రముఖ సాహిత్య విమర్శకులు డా. యమునారాణి మాట్లాడారు.

వైవి మల్లారెడ్డి ఆర్‌ఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ వై.వి మల్లారెడ్డి మాట్లాడుతూ.. అనంతపురం జిల్లా సామాజిక, వ్యవసాయ సమస్యల పట్ల రచయిత ప్రజాగొంతుకగా నిలిచారని చెప్పారు. సడ్లపల్లి చిదంబర రెడ్డి మాట్లాడుతూ, కథా రచనలో ప్రాంతీయ యాసకు పట్టం గట్టారని గుర్తుచేశారు. ఆచార్య రాచపాలెం మాట్లాడుతూ కల్తీ లేని, రాజీలేని భౌతికవాద రచయిత శాంతి నారాయణ అని చెప్పారు. ఆత్మగౌరవ దృక్పథంతో ప్రశ్నించే ధైర్యమున్న విశ్వసనీయ రచయిత శాంతి నారాయణ అన్నారు. ఉప్పరపాటి వెంకటేశులు మాట్లాడుతూ కష్టాలు కన్నీళ్ల మధ్య గడిచిన బాల్యం నుంచి, నిరంతర కృషి, పట్టుదలతో ఎదిగిన చైతన్యశీలి శాంతి నారాయణ అన్నారు. పౌరోహితం మారుతి మాట్లాడుతూ, రాయలసీమ మండలికానికి పెద్దపీట వేసిన రచయిత శాంతి నారాయణ అన్నారు. ఆయన జీవితంలోని, అన్ని సామాజిక దశలు తన రచనల్లో ప్రతిబింబిస్తాయని చెప్పారు. డాక్టర్ నాగేశ్వరాచారి మాట్లాడుతూ.. తనను తాను సంస్కరించుకున్న రచయిత శాంతి నారాయణ అన్నారు. ఆయన కథలు, నవలల్లో సామాజిక పరిణామ క్రమం కనిపిస్తుందన్నారు. యమునారాణి మాట్లాడుతూ.. స్త్రీ పాత్రలను సమున్నతంగా చిత్రీకరించిన రచయిత శాంతి నారాయణ అన్నారు. చైతన్యం, ఆత్మగౌరవం గల పాత్రలతో మహిళా పక్షపాతిగా నిలబడ్డారని చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ మాజీ విసి ప్రొఫెసర్ కుసుమ కుమారి, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కొండ్ర సుధాకర్ బాబు, ప్రొ. ఏవీ రమణ, సోషియాలజీ విభాగాధిపతి ప్రొ.జి.వి.రమణ, కదలిక ఇమామ్, సెరా కుళ్లాయిస్వామి, సీనియర్ రచయిత్రి షహనాజ్, అరసం రాష్ట్ర కార్యవర్గసభ్యులు, ఏపీ గ్రంథాలయ పరిషత్ పూర్వ సభ్యులు, కవి గుత్తా హరి సర్వోత్తమ నాయుడు, బి.ఈశ్వర రెడ్డి, జింకా సుబ్రహ్మణ్యం, ఎస్.ఎం.భాష, తరిమెల అమరనాథ్ రెడ్డి, జెట్టి జైరామ్, గోసల నారాయణ స్వామి, వన్నప్ప, అమరేంద్ర, డా.పూజారి ఈరన్న, చెట్ల ఈరన్న, ద్విభాషా కవి డా. జూటూరి షరీఫ్, రియాజుద్దీన్, వన్నప్ప, టివి రెడ్డి పాల్గొన్నారు.

## కాణిపాకంలో భక్తుల రద్దీ... దర్శనానికి 4 గంటల సమయం



**కాణిపాకం, జులై 5 ప్రభాతవార్త:** సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కాణిపాకం కిటకిటలాడింది. సాధారణంగా ఆలయంలో వారాంతపు రోజులు శని, ఆదివారాలు, వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. ఆదివారం ప్రభుత్వ సెలవు రోజు కావడంతో కాణిపాకం ఆలయ దర్శనార్థం భక్తులు వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం ఆలయ దర్శనానికి భారీగా తరలి రావడంతో ఉదయం నుండి ఆలయంలోని క్యూలైన్లన్ని భక్తులతో పోటెత్తింది. గత నాలుగు రోజులుగా ఆలయంలో రద్దీ కొనసాగుతోంది. ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లులో సుమారు నాలుగు గంటలకు పైగా వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. దీనితో భక్తులకు త్వరితగతిన స్వామిదర్శనం కల్పించేందుకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. అలాగే ఆలయ క్యూలైన్లు వద్ద భక్తులకు దేవస్థానం తరపున ఉచితంగా మజ్జిగ, త్రాగునీరు, సాంబారు అన్నం అందించారు.

## ఎస్‌సి బాలికల హాస్టల్స్‌ను సందర్శించిన మంత్రి డిబివి స్వామి



**కావలి (నెల్లూరు), జులై 5 ప్రభాతవార్త:** కావలి ఆర్డీఓ కార్యాలయం వద్ద ఉన్న సాంఘీక సంక్షేమశాఖ బాలికల వసతి గృహాన్ని ఆదివారం రాష్ట్ర సాంఘీక సంక్షేమశాఖ మంత్రి డోల బాల వీరాంజనేయస్వామి సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్ నందు బాలికలకు వసతులు, భోజన సందుపాయాలు, పరిశుభ్రతపై విద్యార్థులను విచారించి అడిగి తెలుసుకొన్నారు. ప్రభుత్వం నుంచి యూనిఫామ్స్, బుక్స్, బెడ్‌షీట్లు, రగ్గులు, పెట్టెలు, ఇతర అవసరమైన సామాగ్రిపై అవసరమైన వాటిపై గురించి తెలిపి ప్రతి విద్యార్థి శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు ఫోన్ మంత్రితో మాట్లాడుతూ సిఎస్ఆర్ పండ్‌చే హాస్టల్ పిల్లలకు బంకర్ బెడ్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు ఏ రోజు పాఠ్యాంశాలు ఆరోజే చదివించాలని పిల్లలందరూ పరిశుభ్రంగా ఉంటేటట్లు జాగ్రత్తలు తీసుకోవాలని వార్డన్లను ఆదేశించారు. విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద గౌరవంగా మెలగాలని తెలిపారు. ప్రతి విద్యార్థి క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలన్నారు. ఆదివారం వినోదం కోసం టీవిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. సోషల్ వేల్ఫేర్ డిడి శోభారాణి, హాస్టల్ వార్డెన్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.



## సెల్‌ఫోన్ చార్జర్ పేలి భారీ అగ్నిప్రమాదం

**తవణంపల్లె, జులై 5 ప్రభాతవార్త:** సెల్‌ఫోన్ చార్జర్ పేలి ఇంట్లో భారీ అగ్ని ప్రమాదం సంభవించిన సంఘటన చిత్తూరు జిల్లా తవణంపల్లె మండలంలోని ఎగువ వెంకటాపురం గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి వివరాలిలా వున్నాయి. మండలంలోని ఎగువ వెంటాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మునిరత్నంశెట్టి కుమారుడు సేతు రామన్ అనే వ్యక్తి తన ఇంట్లో సెల్‌ఫోన్ శనివారం రాత్రి చార్జర్ పెట్టాడు. ఈనేపథ్యంలో ఆదివారం తెల్లవారు జామున సుమారు 5 గంటలకు సెల్‌ఫోన్ చార్జర్ తీసుకుని చార్జర్ స్విచ్ ఆఫ్ చేయకుండా ఇంటికి తాళాలు వేసి కాణిపాకం వెళ్ళినట్లు గ్రామస్థులు తెలిపారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో చార్జర్ ఒక్కసారిగా పేలిపోవడంతో ఇంట్లో మంటలు చెలరేగి ఇల్లంతా వా ్యపించాయి. దీనితో ఇంట్లో వున్న వస్తువులు, గృహోపకరణాలు, నగదు బట్టలు, పట్టుచీరలు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ఈమేరకు ఇంట్లో దాచి వుంచిన 90 వేల రూపాయల నగదు, పట్టుచీరలు, కొత్త ఇంటి నిర్మాణం కోసం కొనుగోలు చేసి భద్రపరచిన ఎలక్ట్రికల్ సామాగ్రి, ట్రంకు పెట్టెలో దాచి వుంచిన నగదు, పట్టు చీరలు వంటివి పూర్తిగా కాలిపోయాయి. ఈవిషయాన్ని గమనించిన చుట్టుపక్కల ఇళ్ళవారు ఇంటి తాళాలు పగులగొట్టి మంటలను అదుపుచేశారు. ఈప్రమాదంలో సుమారు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

### నేడు డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి

**తిరుపతి, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేడు (సోమవారం) ఉదయం 10 గంటల నుండి 'డయల్ యువర్ సిఎండి' కార్యక్రమాన్ని ఎస్‌పిడిసిఎల్ నిర్వహించనుంది. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు 89777 16661 నంబర్‌కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చు.

# ప్రకాశం జిల్లాలో ఫ్యాన్.. డీలా..!

● సైకిల్ జోరు... రెండేళ్ల పాలనలో టిడిపికి పెరిగిన ఆదరణ

**ఒంగోలు, జులై 5 ప్రభాతవార్త:** ఉమ్మడి ప్రకాశం జిల్లాలో వైసిపి పరిస్థితి ఆశించిన స్థాయిలో లేదని ఆ పార్టీ అంతర్గత సర్వేలు స్పష్టం చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతుంది. 2024 ఎన్నికల్లో ఎదరైన పరాజయం తరువాత పార్టీ బలోపేతానికి ప్రయత్నాలు చేస్తున్నప్పటికి జిల్లాలోని ఎక్కువ నియోజకవర్గాల్లో ఫ్యాన్ వేగం మరింత మందగించినట్లు సమాచారం. అధికార కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతున్నా దానిని వైసీపీ నియోజక వర్గాల్లో తమకు అనుకూలంగా మలుచుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దర్శి, యర్రగొండపాలెం, మార్కాపురం, కందుకూరు మినహా మిగిలిన నియోజక వర్గాల్లో పార్టీ ప్రభావం ఊపందుకోలేదని సర్వే నివేదికలు పేర్కొన్నట్లు సమాచారం. మరో వైపు అధికార తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులపై ప్రజల్లో ఆదరణ తగ్గలేదని తెలుస్తోంది. ముఖ్యంగా ఒంగోలు, సంతనూతలపాడు, అద్దంకి, కొండపి, కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గాల్లో టిడిపి బలపడగా వైసిపి క్యాడర్‌లో నిరుత్సాహం పెరిగినట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉమ్మడి ప్రకాశం జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. 2029 ఎన్నికల నాటికి పార్టీని మళ్లీ కంచుకోట స్థాయికి తీసుకెళ్లేందుకు అధిష్టానం కార్యచరణ రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టంగా తయారైందని 2029లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో పదికి పది స్థానాలు గెలుచుకుని వైసిపి సత్తా చాటుకుంటామని ఆ పార్టీ పెద్దలు గడిచిన రెండేళ్లుగా పదే పదే చెప్తూ వస్తున్నారు. అయితే వాస్తవానికి జిల్లాలో భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికల సమయం కంటే ప్రస్తుతం ఫ్యాన్ మరింత డీలా పడినట్లు కనిపిస్తుంది. వైసిపి ఎన్నికల సమయంలో కంటే ప్రస్తుతం మరింత బలహీన పడినట్లు ఆ పార్టీ సొంత సర్వేల్లోనే బయటపడినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయింది. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో, నియోజకవర్గాల వారీగా పార్టీ స్థితి గతులపై స్థానిక నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల పని తీరుపై వైసిపి అధిష్టానం రహస్య సర్వేను నిర్వహించింది. ఆ సర్వే నివేదికలు వైసిపి పెద్దలను మరింత ఆందోళనకు గురి చేస్తున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రభుత్వంపై ఖచ్చితంగా వ్యతిరేకత ఉంటుంది. స్థానికంగా ప్రధాన ప్రతిపక్ష నేతల పాత్రలను బట్టి ఆ నియోజక వర్గాల ప్రతిపక్ష పార్టీ బలం పెంచుకోవడంతో పాటు అధికార పక్షంపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతుంది. అయితే జిల్లాలో మాత్రం అందుకు పూర్తిగా భిన్నంగా ఫ్యాన్ వేగం పూర్తిగా తగ్గినట్లు సర్వే నివేదికల్లో బయట పడినట్లు సమాచారం. పది నియోజకవర్గాల్లో కేవలం దర్శి నియోజకవర్గంలో మాత్రం ఆ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పుంజుకున్నట్లు సర్వేలో తేలింది. యర్రగొండపాలెం సిట్టింగ్ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పరిస్థితి కూడా భాగానే ఉందని సర్వేలో తేలింది. మార్కాపురం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు దూకుడు పెంచడంతో ప్రతి కార్యక్రమాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పిలుపు మేరకు ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఆయన సఫలీకృతులయ్యారు. ఆయన అధికార పార్టీకి ధీటుగా సమాధానం చెప్తున్నారు. కందుకూరు వైసీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌రావు కూడా ప్రతి కార్యక్రమాన్ని విజయవంతంగా నడుపుతుండడంతో పాటు అధికార పక్షాన్ని ఇరకాటంలో పెట్టడంలో తన సాయశక్తుల కృషి చేస్తున్నారు. మిగిలిన ఆరు నియోజక వర్గాల్లో వైఎస్సార్‌సిపి పరిస్థితి ఆశాజనకంగా లేదు. గిద్దలూరులో అయితే అధికార పార్టీపై వ్యతిరేకత భావం ఉన్నప్పటికి వైఎస్సార్‌సిపి ఇన్‌చార్జ్ తూతూ మంత్రంగా వచ్చిపోతున్నారే తప్ప అక్కడ కార్యకర్తలకు అందుబాటులో ఉండడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. 2024లో సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాలు ఉంటే 10 అసెంబ్లీస్థానాలను ఒంగోలు లోక్‌సభ స్థానాన్ని కూటమి సొంతం చేసుకుంది. వైసిపి నుంచి బరిలో దిగిన సిట్టింగ్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు ఓటమి చవిచూశారు. గడిచిన 24 నెలల్లో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకెళ్లి వైసీపీని మరింత బలోపేతం చేయడంతో పాటు స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలు తీసుకునే ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై ఎప్పటికప్పుడు ఆందోళనలు చేస్తూ ఫ్యాన్ వేగాన్ని పెంచాల్సిన ఆ పార్టీ ముఖ్య నాయకులు కొన్ని నియోజకవర్గాల్లో తమ కార్యకలాపాలను తగ్గించేశారు. ఫలితంగా జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో అధికార టిడిపికి మరింత ఆదరణ పెరిగింది.

ఒంగోలు నగరం నుంచి దామచర్ల జనార్ధన్‌రావు, ఎన్నికల సమయం కంటే ప్రస్తుతం మరింత బలంగా కనిపిస్తున్నారని సర్వే నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. జిల్లాలో వైసిపికి బలమైన నాయకుడు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వైసిపికి రాజీనామా చేసి జనసేనలో చేరడం కూడా వైసిపికి తీవ్ర నష్టమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆయన వైసిపిలో ఉంటే పార్టీకి ఎంతో బలమని సర్వే నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం.

వైసిపి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న దర్శి నియోజకవర్గంలో టిడిపి ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మీ మధ్య గడిచిన రెండేళ్లుగా ఆదిపత్య పోరు కొనసాగుతూనే ఉంది. ఆయన నిరంతరం పోరాటం చేస్తూనే ఉన్నారు. వీరిద్దరి విమర్శల బాణాలు విసురుకుంటూనే ఉన్నారు.

అలాగే యర్రగొండపాలెం నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, టిడిపి ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబుల మధ్య తీవ్ర స్థాయిలో విమర్శలు ప్రతివిమర్శలు చేసుకుంటున్నారు. మార్కాపురం వైసిపి ఇన్‌చార్జ్ అన్నా రాంబాబు, సిట్టింగ్ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు నెలకొన్నాయి. కందుకూరు వైసిపి ఇన్‌చార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్, సిట్టింగ్ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మధ్య నువ్వంటే నవ్వని తలపడుతున్నారు. ఫలితంగానే వైకాపా ఎన్నికల సమయం కంటే కొంత బెటర్‌గా కనిపిస్తుందని ఆ పార్టీ సొంత సర్వే నివేదికలో తేలినట్లు విశ్వసనీయ సమాచారం. వైకాపాకు ఉమ్మడి ప్రకాశం జిల్లా గతంలో కంచుకోటగా ఉండేది.

2019 ఎన్నికల్లో 12కి 9 స్థానాల్లో గెలిచినా వైసీపీ 2024 ఎన్నికల్లో రెండు స్థానాలకే పరిమితం అయింది. ఖచ్చితంగా గెలుస్తారనుకున్న బలమైన నాయకులు కూడా ఓడిపోయారు. దీంతో 2029 ఎన్నికల్లోపు పార్టీని పూర్తి స్థాయిలో బలోపేతం చేసి తెలుగుదేశంపై ప్రతీకారం తీర్చుకోవాలని ఆ పార్టీ అధిష్టానం, స్థానిక జిల్లా నేతలు గడిచిన రెండేళ్లుగా పోరాటం చేస్తున్నారు. అయితే కూటమి రెండేళ్ల పాలనపై ఎంత పోరాటం చేస్తున్నా కొంత మంది వైసిపి నేతలు కేసులు పెడతారేమోనన్న భయంతో వెనుకంజ వేస్తున్నారు. అంతే కాకుండా వైసిపి నేతల పనితీరు కూడా సరిగ్గా లేదని సొంత సర్వేలో తేలడంతో పాటు ఎన్నికల సమయంలో కంటే ప్రస్తుతం జిల్లాలో ఫ్యాన్ మరింత డీలా పడిపోయిందని నివేదికలు తేల్చిచెప్పడంతో ఆ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు సమాచారం. ఏదీ ఏమైనా వైఎస్ జగన్ పాదయాత్ర చేపట్టేలోపు కొన్ని నియోజక వర్గాల ఇన్‌చార్జిల మార్పు తథ్యమని విశ్లేషకులు అంటున్నారు.

# ఒంగోలులో దొంగలు పడ్డారు!

● వరుస చోరీలతో హడలెత్తిపోతున్న నగరవాసులు

● గస్తీ లేదు నిఘా లేదు దొంగలకు భయం లేదు!



**ఒంగోలు(క్రైమ్), జులై 5 ప్రభాతవార్త:** ఒంగోలు నగరంలో వరుసగా జరుగుతున్న చోరీలు ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లిన కుటుంబాలు తిరిగి వచ్చేలోపు దొంగలు చోరీలకు పాల్పడుతున్న ఘటనలు పెరుగుతుండటంతో నగరంలో పోలీసింగ్ తీరుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇళ్లు, దుకాణాలు, కార్యాలయాలను లక్ష్యంగా చేసుకుని దొంగలు వరుస చోరీలకు పాల్పడుతుండగా, రాత్రి వేళల్లో పోలీసు గస్తీ కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల నగరంలోని పలు ప్రాంతాల్లో చోటు చేసుకున్న చోరీలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. దొంగలు పథకం ప్రకారం తాళాలు పగులగొట్టి నగదు, బంగారం, విలువైన వస్తువులు అపహరిస్తున్నప్పటికీ నేరాలను అరికట్టడంలో పోలీసులు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నేరం జరిగిన తర్వాత మాత్రమే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపడుతున్నారని, ముందస్తు నిఘా, రాత్రి పెట్రోలింగ్, బీట్ వ్యవస్థ ఆశించిన స్థాయిలో కనిపించడం లేదని ప్రజలు అంటున్నారు. ఒంగోలు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ పోస్టు చాలా కాలంగా ఖాళీగా ఉండడం కూడా నగర పోలీసింగ్‌పై ప్రభావం చూపుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పూర్తి స్థాయి అధికారి లేకపోవడంతో పర్యవేక్షణలో లోపాలు ఏర్పడుతున్నాయని, గతంలో వీఆర్‌కు పంపిన తాలూకా సీఐని తిరిగి అదే స్టేషన్‌కు నియమించడంపై కూడా స్థానిక వర్గాల్లో చర్చ జరుగుతోంది. పోలీసు శాఖలో తీసుకుంటున్న పరిపాలనా నిర్ణయాలు నగర భద్రతపై ప్రభావం చూపుతున్నాయా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఇటీవల ఒంగోలులో చెడ్డీ గ్యాంగ్ సంచారం కలకలం రేపింది. ఇందుర్తి నగర్‌లో అర్ధరాత్రి సమయంలో ఆరుగురు సభ్యులతో కూడిన ముఠా సంచరిస్తున్న దృశ్యాలు ఓ ఇంటి సీసీటీవీ కెమెరాలో నమోదయ్యాయి. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ప్రజల్లో మరింత భయాందోళనలు నెలకొన్నాయి. అయితే ఈ ఘటనపై పోలీసులు పెద్దగా స్పందించలేదనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఇటీవల చీరాల ప్రాంతంలో కూడా దొంగల ముఠా సంచరిస్తోందని అక్కడి పోలీసులు అనుమానితుల ఫోటోలను విడుదల చేయడం గమనార్హం. ఈ పరిణామాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ఒంగోలు నగరంలో కూడా రాత్రి గస్తీని మరింత కట్టుదిట్టం చేయాలని, బీట్ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా చోరీలకు పాల్పడుతున్న ముఠాలను త్వరగా గుర్తించి అరెస్టు చేయడంతో పాటు ఖాళీగా ఉన్న పోలీసు అధికారుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని నగర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఆరోపణలపై పోలీసు శాఖ అధికారిక స్పందన అందుబాటులో లేదు.

## రాపూరులో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

● 13 మంది అరెస్ట్... రూ.19.480 నగదు స్వాధీనం



**రాపూరు (నెల్లూరు), జులై 5 ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లా రాపూరు మండల కేంద్రం పంచాయితీ పరిధిలోని రామిరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని ఒక తోటలో నిర్వహిస్తున్న పేకట స్థావరంపై రాపూరు ఎస్ఐ కె.తిరుమల రావు ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మికంగా దాడి నిర్వహించారు.

ఈ దాడిలో పేకాట ఆడుతున్న 13 మందిని అదుపులోకి తీసుకోని, వారి వద్ద నుండి రూ.19,480 నగదు, పేకాట సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె. తిరుమల రావు తెలిపారు.

# నెల్లూరులో మంత్రి నారాయణ సుడిగాలి పర్యటన

**• పలు అభివృద్ధి పనులు పరిశీలన... వైకాపాకు మంత్రి నారాయణ చురకలు • స్కూల్ గ్రౌండ్‌లో బ్యాట్ పట్టిన మంత్రి నారాయణ, బౌలింగ్ చేసిన అజీజ్**



**నెల్లూరు(వైద్యం), జూలై 5 ప్రభాతవార్త:** అభివృద్ధి పనులను పరిశీలన చేసుకొని ఆరోపణలు చేయాలని వైకాపాకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చురకలంటించారు. ఐదేళ్ల వైఎస్ ఆర్సీపీ పాలనలో జరిగిన, రెండేళ్ల కూటమి పాలనలో జరిగిన అభివృద్ధిని బేరీజు వేసుకొని విమర్శలు చేయాలని సూచించారు. నెల్లూరు సిటీ నియోజక వర్గంలో ఆదివారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. కాలువలు, పాఠశాలల ఆధునీకరణ పనుల పురోగతిని పరిశీలించారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ గత ఐదేళ్ల ప్రభుత్వ కాలంలో నగర అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. గతంలో తాము రూ.1100 కోట్లతో ప్రారంభించిన యూజీడీ, డ్రింకింగ్ వాటర్ పనులను పట్టించుకోకుండా వదిలేశారని విమర్శించారు. విపక్షాలు ఎన్ని అవాకులు చవాకులు పేలినా చెట్ల పెంపకంపై ఎంత రచ్చ చేసినా అభివృద్ధిని అడ్డుకోలేరన్నారు. ఐదేళ్లలో నెల్లూరుకు ఏం చేశారో వారు అంతరాత్మ సాక్షిగా ప్రశ్నించుకోవాలని చురకలంటించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విజన్ ప్రకారం నెల్లూరులోని 15 ప్రభుత్వ పాఠశాలలను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నామని వివరించారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు చదువే ఏకైక మార్గమని, ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నా విద్యే బిడ్డల భవిష్యత్తును మారుస్తుందని పేర్కొన్నారు. పేద బిడ్డలకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో మంత్రి నారాయణ ఆధ్వర్యంలో నెల్లూరు నగరవ్యాప్తంగా ఒకదానిని మించి ఒకటిగా వందల కోట్లతో 15 స్కూళ్లను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారని ప్రశంసించారు.

**మంత్రి బ్యాటింగ్ విద్యార్థులు ఫిదా:** నెల్లూరులో ఒక



ఆసక్తికరమైన దృశ్యం అందరినీ ఆకట్టుకుంది. నిరంతరం ప్రజాసేవ, నగర అభివృద్ధి సమీక్షలతో బిజీగా ఉండే మంత్రి పొంగూరు నారాయణ, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఒక్కసారిగా చిన్నపిల్లల్లా మారిపోయి నెల్లూరు మూలాపేట బాలికోన్నత పాఠశాల స్కూల్ గ్రౌండ్‌లో క్రికెట్ ఆడి సందడి చేశారు. రాజుగారి కోటను తలపించేలా బ్రహ్మాండంగా రూపుదిద్దుకున్న పాఠశాల మైదానంలో అబ్దుల్ అజీజ్ బౌలింగ్ వేయగా మంత్రి నారాయణ భారీ షాట్ కొట్టి విద్యార్థులు, అధికారుల చప్పట్లతో గ్రౌండ్ మొత్తాన్ని హోరెత్తించారు. బెత్తం పట్టిన చేత్తో బ్యాట్ పట్టి విద్యార్థులను ఫిదా చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, డీఈఓ బాలాజీరావు, మేయర్ దేవరకొండ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ జెడ్పీటీసీ విజేత రెడ్డి, రాష్ట్ర టీడీపీ సెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరపు సుబ్బారావు, కార్పొరేటర్ కరిముల్లా, స్థానిక టీడీపీ నాయకులు ఇంతియాజ్, మొయినుద్దీన్, ఖలీల్, కాలేషా, కేపీర్ రేవతి తదితరులు పాల్గొన్నారు.



## పిఎబిఆర్ డ్యామ్‌లోని ఇన్‌టెక్ వెల్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి పయ్యావుల

**• ఓఅండ్ఎం అధికారుల నిర్లక్ష్య ధోరణిపై మంత్రి మండిపాటు**
**• అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఆదేశం**

**అనంతపురం, జూలై 5 ప్రభాతవార్త బ్యూరో:** పీఏబీఆర్ డ్యామ్‌లోని శ్రీరామిరెడ్డి ప్రాజెక్ట్ నుండి ఉరవకొండకు తాగునీటి సరఫరా చేసే ఇన్‌టెక్ వెల్‌ను ఆదివారం సాయంత్రం మంత్రి పయ్యావుల కేశవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంత్రిపయ్యావుల పయ్యావుల కేశవ్ తనిఖీ సమయంలో మోటార్లు ఆఫ్‌లో ఉండటం, సైగా అక్కడ ఒక్క అధికారి కానీ, కనీసం ఒక్క వర్కర్ కానీ అందుబాటులో లేకపోవడంతో మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులు, తీవ్రమైన నీటి ఎద్దడి ఉండి, డ్యామ్‌లో నీరు ఉన్నప్పటికీ ఉరవకొండకు నీటి సరఫరా చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓఅండ్ఎం అధికారుల నిర్లక్ష్య ధోరణిపై మంత్రి మండిపడ్డారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌తో ఫోన్ ద్వారా మాట్లాడి సంబంధిత అధికారులపై తగు చర్యలు తీసుకోవాల్సిందిగా మంత్రి ఆదేశించారు. తాగునీటి విషయంలో ఇలాంటి అలసత్వాన్ని సహించేది లేదని, బాధ్యులపై తగు చర్యలు ఉంటాయని మంత్రి స్పష్టం చేశారు.

## గల్లంతైన మత్స్యకారులను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం

**• ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్**

**విజయవాడ, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** సముద్రంలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారులను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం అని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. సముద్రంలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుల గురించి విశాఖపట్నం జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి ఆయన ఆరా తీశారు. గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల వివరాలను ఈ సందర్భంగా ఆయన అడిగి తెలుసుకున్నారు. మత్స్యకారుల కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మెరైన్ పోలీసులు, కోస్ట్ గార్డు, నేవీ సమన్వయంతో ఈ గాలింపు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. నేవీ హెలికాప్టర్‌తో ఇప్పటికే గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని డిప్యూటీ సీఎంకు విశాఖ జిల్లా కలెక్టర్ వివరించారు. సహాయక చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని ఆయనను ఆదేశించారు. అలాగే మత్స్యశాఖ ఉన్నతాధికారులను కూడా ఈ సందర్భంగా ఆయన అప్రమత్తం చేశారు. మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు. ఈ మేరకు డిప్యూటీ సిఎం కార్యాలయం ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించింది.

## మైనర్‌తో పెళ్లి... పోక్సో కేసు నమోదు

**తిరుపతి, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏమాత్రం బయటి ప్రపంచం తెలియని ఓ 15 యేళ్ల మైనర్ బాలికతో ఆటోడ్రైవర్ మాయామటలతో శారీరక సంబందం పెట్టుకున్నాడు. అంతేగాక బాలికను నమ్మించి ఆపై పెళ్లి కూడా చేసుకున్నాడు. అతని మాయమాటలకు నమ్మిన బాలిక పెళ్ళికి సిద్ధమైంది. బాలికను వివాహం చేసుకున్న ఆటో డ్రైవర్ చివరకు మైనర్ అని కూడా లేకుండా వివాహమైన రాత్రి బాలికతో శారీరక సంబంధం పెట్టుకొన్నట్లు బాధితురాలి తల్లి ఫిర్యాదు చేసింది. అలిపిరి పోలీసలు ఆటో డ్రైవర్‌పై పోక్సో చేసి నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఏలూరు జిల్లాలో తీవ్ర విషాదం
### రైలు ఢీ కొట్టి నలుగురు వ్యక్తుల దుర్మరణం

**ఏలూరు, జూలై 5 ప్రభాతవార్త బ్యూరో:** ఏలూరు జిల్లాలో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఉంగుటూరు మండలం చేబ్రోలు రైల్వే స్టేషన్ సమీపంలో రైలు ఢీకొనడంతో నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న తాడేపల్లిగూడెం జిఆర్పి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. సంఘటనా స్థలంలో షేక్ హసీనా పేరు మీద ఉన్న ఏటీఎం కార్డు, తాడేపల్లిగూడెం ఆర్టీసీ పార్కింగ్ రసీదును పోలీసులు గుర్తించారు. ఇది ప్రమాదవశాత్తు జరిగిందా లేదా ఆత్మహత్యకు పాల్పడ్డారా అనే కోణంలో పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం రాత్రి చర్లపల్లి షాలిమార్ ఎక్స్‌ప్రెస్ రైలు ఏలూరు జిల్లాలోని ఉంగుటూరు రైల్వే స్టేషన్ సమీపంలో నలుగురు వ్యక్తులను ఢీ కొట్టింది. మీ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. రైలు వేగంగా ఢీకొనడంతో వారి మృతదేహాలు చెల్లాచెదురయ్యాయి. వీరు ఒకే కుటుంబానికి చెందినవారు లేదా బంధువులుగా పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ప్రస్తుతం మృతుల వివరాలను తెలుసుకొంటున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాడేపల్లిగూడెం జిఆర్‌పి ఎస్ఐ అప్పారావు తెలిపారు.



## ముంబయిలో భారీ వర్షం
### ముకేష్ అంబాని కాన్వాయ్‌కు తప్పిన ప్రమాదం

**ముంబయి, జులై 5:** మహారాష్ట్రతోపాటు దేశంలోని గుజరాత్, ఢిల్లీ ఇతర ఉత్తర భారత రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీనికితోడు వాతావరణ శాఖ కూడా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలతో తీరప్రాంత రాష్ట్రాలన్నీ అప్రమత్తం అయ్యాయి. ముంబై భారీ వర్షాలతో అతలాకుతలమైంది. 24 గంటల్లో కొన్ని ప్రాంతాల్లో 20 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రోడ్లపై నీరు ఉధృతంగా ప్రవ హిస్తోంది. వాహనాల రాకపోకలు స్తంభించి పోయాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమ య్యాయి. వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని ప్రజలకు బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ సూచన చేసింది. భారీ వర్షాలు ముంబైను వణికించాయి. ప్రధానంగా నగరంలో గడిచిన 24 గంటల్లో 20 సెంటీమీటర్ల వర్షపాతం నమోదవ్వగా లోతట్టు ప్రాంతాల్లో 30 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. విక్రోలిలో అత్యధికంగా 31.06 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. మరోవైపు ముంబైలోని కొన్ని ప్రాంతాల్లో మెట్రో, ప్రజా రవాణా సేవలు యథాతథంగా కొనసాగుతున్నట్లు అధికారులు వెల్లడించినా మెట్రో సేవల్లో అంత రాయం ఏర్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. కొన్నిచోట్ల కొండచరియలు విరిగిపడగా మరికొన్ని చోట్ల రోడ్లు నీట మునిగిపోయాయి. ముంబైలోని కుర్లా వెస్ట్ ప్రాంతంలో చెట్టుకూలడంతో వ్యక్తి మృతి చెందాడు. ఆదివారం మధ్యాహ్నాం 12:40 గంటల సమయంలో వర్షాలు, గాలులకు నౌపా డాలో ఒక చెట్టు కూలింది. 63 ఏళ్ల యూనస్‌పై ఆ చెట్టు పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. చెట్టు కొమ్మల కింద చిక్కుకున్న ఆయనను బయటకు తీసి వెంటనే ఆసుపత్రికి తరలించారు. అప్పటికే యూనస్ మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. మరోవైపు ముంబైలో భారీ వర్షాలకు ఇప్పటి వరకు నలుగురు మరణించారు.

## మళ్లీ రోడ్డెక్కనున్న మామిడి రైతులు

**• కేజీకి రూ.17.47 అమలుకు డిమాండ్ • 8న చిత్తూరులో శాంతియుత నిరసన**

**చిత్తూరు, జులై 5 ప్రభాతవార్త:** మామిడి రైతులకు కేజీకి రూ.4 ప్రోత్సాహక ధర ప్రకటించిన ప్పటికీ, ఫ్యాక్టరీలు జిల్లా అధికార యంత్రాంగం నిర్ణయించిన మేరకు మామిడికి ధర చెల్లించకపోవడంతో ఇప్పటికే పలు ఆందోళనలు చేపట్టిన మామిడి రైతులు బుధవారం మరోమారు రోడ్డెక్కి ఆందోళన చేయడానికి సిద్ధం అయ్యారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి రైతు సంఘం జిల్లా కమిటీ ఆదివారం ఎస్టీయు కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి ఈ మేరకు మామిడికి మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బుధవారం జిల్లా కేంద్రం చిత్తూరులో శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి రైతు సంఘం కమిటీ అధ్యక్షులు మునీశ్వర్‌రెడ్డి మామిడి రైతుల నిరసన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఈ సమావేశంలో ఆవిష్కరించారు. ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం తోతాపురి మామిడికి మద్దతు ధర ప్రకటించిన మేరకు రాష్ట్ర ప్రభుత్వం కేజీ తోతాపురికి రూ.17.47 చెల్లించాలని మామిడి రైతు సంఘ నాయకులు డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర జిల్లాలోని ఏ ఒక్క ఫ్యాక్టరీ, ర్యాంపుల్లో అమలు చేయడం లేదని,



మామిడి రైతుల నిరసన పోస్టర్లను విడుదల చేస్తున్న జిల్లా మామిడి రైతుల సంఘ నాయకులు

ఈ విషయంపై ఇటు ప్రభుత్వ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అటు వ్యవసాయ శాఖ మంత్రి సైతం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. గత రెండేళ్ళగా మామిడికి గిట్టుబాటు ధర లేకపోవడంతో మామిడి రైతు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నాడని వాపోయారు. జిల్లాలోని తోతాపురి మామిడి రైతుల గిట్టుబాటు ధర కల్పనతో పాటు ఫ్యాక్టరీల నుండి రైతులకు రావాల్సిన పాత బకాయిలను రాబట్టుకోవడానికి బుధవారం చిత్తూరులో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మామిడి రైతు సంఘ నాయకులు పేర్కొన్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు చిత్తూరు గాంధీ విగ్రహం ఆవరణలో మామిడి రైతు సంఘం ఆధ్వర్యంలో మామిడి రైతులు గుమిగూడి గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేసి శాంతియుతంగా కార్యక్రమంను కొనసాగిస్తామన్నారు. జిల్లాలోని మామిడి రైతులందరు ఈ కార్యక్రమానికి తరలివచ్చి మామిడి రైతుకు మద్దతుగా నిలిచి ప్రభుత్వం నుడి మామిడికి గిట్టుబాటు ధర రాబట్టుకోవడానికి సిద్ధం కావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మామిడి రైతుల సంఘ ఉపాధ్యక్షులు మునిరత్నంనాయుడు, ఉమాపతినాయుడు, బెల్లంకొండ శ్రీనివాసులు, మోహన్‌రెడ్డి, జైదేవయ్య, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.


## ఇంద్రకీలాద్రిపై పోటెత్తిన భక్తజనం



**ఇంద్రకీలాద్రి, జులై 5 ప్రభాతవార్త:** ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న శ్రీ కనకదుర్గమ్మని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల రద్దీని దృష్ట్యా ఆలయ ఇఓ వికె శీనా నాయక్, డిఇఒ కిషోర్ కుమార్, ఎఇఒలు చంద్రశేఖర్, రమేష్ బాబు క్యూలైన్లు పర్యవేక్షణ చేయగా భక్తులకు కావలసిన అన్ని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం 10.30 గంటల నుండి అంతరాలయ దర్శనాలను మధ్యాహ్నాం 2.15 గంటల వరకు అన్ని రకాల వీఐపీ దర్శనాలను పూర్తిగా రద్దు చేశారు. భక్తుల సేవలో పాలకమండలి, అధికారులు పాల్గొని క్యూలైన్లను క్రమబద్దీకరించారు.

**భక్తుల విరాళాలు:** దుర్గమ్మ భక్తులు ఆదివారం విరాళాలు అందించారు. నిత్యాన్నదాన పథకానికి తిరువూరుకు చెందిన వివి మనుబ్రహ్మాచారి రూ.1,00,116లు, గుంటుపల్లికి చెందిన కంచర్ల బెనర్జీ, కుటుంబీకులు రు.1,00,116ల విరాళం అందించారు. విశాఖపట్నం జిల్లా పెదగంట్యాడకు చెందిన మరో దాత వై.యోహిత్ రూ.1లక్ష విరాళం అందించారు. హైదరాబాద్‌కు చెందిన వి వీర ప్రకాష్, కుటుంబీకులు రూ.1లక్ష విరాళం అందించారు. చిత్తూరు జిల్లా మదనపల్లికి చెందిన ఇందుకూరి నరేష్ కుమార్ రెడ్డి, కుటుంబీకులు రు.1లక్ష విరాళాన్ని ఆలయ అభివృద్ధికి అందించారు. ఆయా దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

## సరిహద్దుల నుంచే నిఘా కోసం చైనా రాడార్ వ్యవస్థ ఏర్పాటు



**న్యూఢిల్లీ, జులై 5:** భారత సరిహద్దుల్లో చైనా తన మిలిటరీ సామర్థ్యాన్ని విస్తరిస్తోంది. మయన్మార్ సరిహద్దుకు సమీపంలో నైరుతి యువాన్ ప్రావిన్సులో చైనా ఒక అధునాతన రాడార్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. భారత్‌కు భద్రతా పరంగా ఇబ్బందులు కలిగించే వ్యవస్థ వల్ల భారత క్షిపణి వ్యవస్థ, జాతీయ భద్రతపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. కొత్తగా ఏర్పాటు చేయ బడిన లార్జ్ ఫేజ్డ్ అర్రే రాడార్ 5,000 కిలో మీటర్లకు పైగా నిఘా పరిధిని కలిగి ఉందని తెలుస్తోంది. దీని ద్వారా చైనా హిందూ మహా సముద్రంలోని ప్రాంతాలపై, భారత భూభాగాలను కూడా పర్యవేక్షించగలదు. ఈ అధునాతన రాడార్ వ్యవస్థ చైనా నిఘా సేకరణ సామర్థ్యాలను, ముఖ్యంగా ఇండియా బాలిస్టిక్ మిస్సైల్ ప్రోగ్రామ్‌కి సంబంధించి కన్నేసి ఉంచగలదు. ముందస్తు హెచ్చరికలు, నిఘా కోసం రూపొందించిన ఎల్‌పార్ వ్యవస్థ, బాలిస్టిక్ క్షిపణి ప్రయోగాలను రియల్ టైమ్‌లో గుర్తించి ట్రాక్ చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. దీని పరిధిలోకి భారత్‌లో కీలమైన, క్షిపణి ప్రయోగాలను నిర్వహించే తూర్పు తీరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం వస్తుంది. ఈ ద్వీపం నుంచే అగ్ని5, కే4 వంటి అధునాతన క్షిపణులను భారత్ పరీక్షిస్తోంది. క్షిపణి వేగం, మార్గం, దూరాలపై కీలమైన డేటాను చైనా సంగ్రహించే అవకాశం ఉంది. భారత దేశ క్షిపణులను కౌంటర్ చేయడానికి చైనా అనుగుణంగా క్షిపణులను, ఎయిర్ డిఫెన్స్ వ్యవ స్థల్ని అభివృద్ధి చేసే అవకాశం ఉంది. హిందూ మహాసముద్రంలో భారత్ ప్రాబల్యాన్ని తగ్గించేందుకు చైనా ఎప్పటి నుంచో ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఈ ప్రాంతంలో శ్రీలంక, మాల్దీవులతో స్నేహం నడుపుతోంది. ప్రస్తుతం భారత సరిహద్దులకు దగ్గరగా ఉన్న ఈ భారీ రాడార్‌తో బంగాళాఖాతం, హిందూ మహాసముద్రంపై నిఘా వేస్తుంది. ఈ ప్రాంతంలోని వాణిజ్య షిప్పింగ్ మార్గాలు, భారత నేవీ ఉనికిని పర్యవేక్షించే అవకాశం ఉంది. ఇప్పటికే చైనాకు బీజింగ్ కోర్లా, జిన్జియాంగ్‌లో ఎల్‌పార్ రాడార్లు ఉన్నాయి. ఇవి భారత్‌పై నిఘా కవరేజీని అందిస్తున్నాయి. యునాన్‌లో కొత్తగా ఏర్పాటు చేస్తున్న రాడార్ భారత్ దక్షిణ, తూర్పు ప్రాంతాలపై నిఘాను విస్తరిస్తుంది.

## 12న విజయవాడలో మెగా జాబ్ మేళా

**విజయవాడ, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్ సంయుక్తంగా జులై 12న విజయవాడలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. విజయవాడ మొగల్రాజపురంలోని పి.బి. సిద్దార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. బిఎన్ఐ 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 100కుపైగా కంపెనీలు, అందులో పలు బహుళజాతి సంస్థలు పాల్గొనను న్నాయి. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్, పీజీ, ఫార్మసీ పూర్తి చేసిన 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు గల అభ్యర్థులు పాల్గొనవచ్చు. ఎంపికైన వారికి నెలకు రూ.12 వేల నుంచి రూ.50 వేల వరకు వేతనంతో ఉద్యోగాలు లభిస్తాయి. అభ్యర్థులు ముందుగా నైపుణ్యం పోర్టల్‌లో నమోదు చేసుకుని, రెజ్యూమే, ఆధార్, పాన్ కార్డు, విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు హాజరుకావాలని నిర్వాహకులు సూచించారు. మరిన్ని వివరాలకు 83339 08080, 90326 33548, 99857 59304 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

## 'ఎస్ఐఆర్'పై ఎపి సచివాలయంలో నేటి నుంచి 8 వరకు ప్రత్యేక శిబిరం

**విజయవాడ, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై ఈనెల 6వ తేదీ నుండి 8వ తేది వరకు సచివాలయ ఉద్యోగుల సౌకర్యార్థం ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నారు. ఈప్రత్యేక శిబిరాన్ని 6వ తేది సోమవారం ఉ.10.30గం.లకు ఎపి సచివాలయం మూడవ భవనం అప్సా(ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం) హాల్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్, సాయి కాంత్ వర్మ తదితరులు పాల్గొనున్నారు. ఈ ప్రత్యేక క్యాంపులో ఎన్యుమరేషన్ ఫారాలు ఆన్లైన్ సబ్ మిషన్, కొత్త ఓటర్ల ఎన్రోల్మెంట్, ఓటర్ల జాబితా నుండి చనిపోయిన వారి పేర్లు తొలగింపు, చిరునామా మార్పు తదితర అంశాలపై ఉద్యోగులకు అవగాహన కల్పిస్తారు. కావున ఉద్యోగులు 2002 నాటి ఓటరు వివరాలు, తాజా ఫోటో, ప్రస్తుత ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్ కార్డు)ఆధార్ కార్డు, రెసిడెన్షియల్ అడ్రస్ ప్రూఫ్ వివరాలతో హాజరు కావాల్సి ఉంటుంది.

## పోలీసు యంత్రాంగం ప్రమాదకర దిశగా పయనం

**వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్ ఆరోపణ**



**విజయవాడ, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపిలో పోలీసు యంత్రాంగం అత్యంత ప్రమాదకర మైన దిశగా పయనిస్తోందని వైసిపి అధినేత జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన ఎక్స్ వేదికగా చంద్రబాబు పాలనపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తనను ప్రశ్నించిన వారిని, రాజకీయంగా వ్యతిరేకించే వారిని అణచి వేసేందుకు చంద్రబాబు పోలీసు వ్యవస్థను ఒక సాధనంగా మార్చుకుంటున్నా రని, ఇది రాష్ట్రాన్ని పెను ప్రమాదంలోకి నెడుతోందని ఆరోపించారు. "చంద్రబాబు గారూ... రాష్ట్రానికి కావాల్సింది 'రౌడీ పోలీసింగ్' కానీ, 'జంగిల్ రాజ్' కానీ కాదు. ప్రజలకు భద్రత కల్పించే పరిపాలన, బాధితులకు న్యాయం చేసే వ్యవస్థ, చట్టం ముందు అందరూ సమానమే అని విశ్వసించే సమాజం కావాలి. రాజకీయ ఆదేశాలతో కాకుండా రాజ్యాంగబద్ధంగా పనిచేసే పోలీసు వ్యవస్థ మనకు అవసరం" అని జగన్ తన పోస్టులో పేర్కొన్నారు. చంద్రబాబు తన దుర్మార్గపు పాలనతో రాష్ట్రవ్యాప్తంగా విష బీజాలు నాటారని, అవి క్రమంగా మొలకెత్తి విష వృక్షాలుగా మారుతున్నాయని జగన్ అభివర్ణించారు. పోలీసుల పనితీరును ప్రశ్నిస్తూ జగన్ పలు ఘటనలను ఉదహరించారు. "పిల్లలు కనపించకుండా పోతే దర్యాప్తులో వేగం ఉండదు. మహిళలపై నేరాలకు సంబంధించి ఫిర్యాదులు చేసినా చర్యలు శూన్యం. గిరిజన మహిళను వివస్త్రను చేసి కొట్టినా అరెస్టులు జరగవు. కానీ, సోషల్ మీడియాలో మిమ్మల్ని ప్రశ్నిస్తే మాత్రం కేసులు పెట్టడం, అరెస్టులు చేయడం, చిత్రహింసలకు గురిచేయడం, నాన్‌బెయిలబుల్ సెక్షన్లు ప్రయోగించడం వంటివి చేస్తారా?" అని జగన్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలో నెల రోజుల క్రితం అదృశ్యమైన చిన్నారి జ్ఞానేశ్వరి కేసు, పెద్దాపురంలో మానసిక వికలాంగురాలిపై జరిగిన లైంగిక దాడి కేసు నమోదులో జాప్యం, నెల్లూరు జిల్లాలో మాజీ టిడిపి కౌన్సిలర్ ఒక గిరిజన మహిళను వివస్త్రను చేసి దాడి చేసిన ఘటనను ఆయన ప్రస్తావించారు. సాయికృష్ణ కస్టడీ మరణం, అతని మృతదేహం అదృశ్యం కావడం రాష్ట్రాన్ని కుదుపునకు గురిచేసిందని, అతని తల్లి అడిగే ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం లేదని అన్నారు.

క్రాంతికుమార్ ఆత్మహత్య, అతను ఇచ్చిన మరణ వాంగ్మూలం, దాన్ని ప్రజలు సోషల్ మీడియాలో ప్రత్యక్షంగా చూడటం తీవ్రంగా కలచివేసిందన్నారు. గంగమ్మ, తిరుపతమ్మ కస్టడీ మరణాలు, పోలీసు వేధింపుల కారణంగా కళావతి ఆత్మహత్య చేసుకోవడం వంటి ఘటనలు రాష్ట్ర పోలీసు వ్యవస్థకు తీవ్ర అప్రతిష్టను తెచ్చిపెట్టాయని, అయినా మీ తీరు మారడం లేదని మండిపడ్డారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే చంద్రబాబు ఈ పంథాను ఎంచుకున్నారని జగన్ ఆరోపించారు. సాధారణ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయకుండా, ప్రతి పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌ను ఆదేశించి సోషల్ మీడియా కార్యకర్తలపై నాన్‌బెయిలబుల్ సెక్షన్లు పెట్టించి, వారి కేసులను వ్యవస్థీకృత నేరాలతో ముడిపెడుతున్నారని, ఇది అత్యంత ప్రమాదకరమైన ధోరణి అని హెచ్చరించారు.

"ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక వారిని భయపెట్టాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడమే అవుతుంది" అని జగన్ తెలిపారు. యూట్యూబర్, జర్నలిజంలో ఉస్మానియా యూనివర్సిటీ గోల్డ్ మెడలిస్ట్ అయిన కెవిఆర్‌ను ఎలాంటి చట్టపరమైన ప్రక్రియలు పాటించకుండా భారీ పోలీసు బలగంతో హైదరాబాద్ నుంచి తీసుకువచ్చి, అతను చేయని నేరాలకు ఎఫ్ఐఆర్‌లో ఇరికించి జైల్లో పెట్టడం అత్యంత దారుణమని జగన్ ఖండించారు. మరో యూట్యూబర్ రావణ్ విషయంలో నాలుగు వేర్వేరు కోర్టులు బెయిల్ మంజూరు చేసినా, విపరీతమైన అహంకారంతో మీ అనుచరులు నేరుగా పోలీస్ స్టేషన్లపై దాడి చేశారని, పోలీసులు మౌన ప్రేక్షకులుగా మిగిలిపోయారని ఆరోపించారు.

## బ్యాగులో పెట్టిన బంగారు మాయం

**తిరుపతి, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతిలో జరిగిన ఓ వివాహానికి హాజరైన కుటుంబానికి చెందిన బంగారు నగలు మాయమయ్యాయి. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కర్ణాటక బెంగళూరుకు చెందిన రెడ్డప్ప ఆనందన్ తన చిన్నాన్న కొడుకు వివాహ రిసెప్షన్‌కు శనివారం తిరుపతికి వచ్చారు. తిరుపతిలోని ఆర్ఎస్ గార్డెన్‌లో ఉన్న అన్న ఇంటికి చేరాడు. అక్కడ కొంత సమయం విశ్రాంతి తీసుకున్నాడు. రిసెప్షన్ ఫంక్షన్‌కు వెళ్లే ముందు బ్యాగ్‌లో ఉంచిన 64 గ్రాముల నెక్లెస్, హారం కనపడకపోవడంతో వుతికారు. చివరకు తిరుపతి వెస్ట్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. అయితే నగలు ఎక్కడ ఎలా మాయమయ్యాయనేది పోలీసులు విచారణ చేస్తున్నారు.

# క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లిన ఫ్రాన్స్, మొరాకో



తొలి ఆఫ్రికా దేశంగా మొరాకో




గోల్డెన్ బూట్ రేసులో ఎంబాపె(7 గోల్స్)

**పెన్సిల్వేనియా, జులై 5:** ఫిఫా ప్రపంచకప్ 2026లో మొరాకో, ఫ్రాన్స్ జట్లు క్వార్టర్ ఫైనల్ బెర్తులు ఖరారు చేసుకున్నాయి. తొలి రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌లో సహ ఆతిథ్య జట్టు కెనడాపై 3–0 గోల్స్‌తో మొరాకో.. పరాగ్వేపై ఏకైక గోల్‌తో ఫ్రాన్స్ గెలుపొందాయి. క్వార్టర్ ఫైనల్‌లో మొరాకోతో ఫ్రాన్స్ తలపడనుంది.

ప్రికార్వర్ట్ ఫైనల్లో పరాగ్వేపై ఫ్రాన్స్ చెమటోడ్చి నెగ్గింది. పరాగ్వే చివరకు వరకు గట్టి పోటీ ఇచ్చింది. ఈ పోరు రసవత్తరంగా సాగింది. పెన్సిల్వేనియాలో జరిగిన మ్యాచ్‌లో పరాగ్వేపై 1–0 తేడాతో ఫ్రాన్స్ విజయం సాధించింది. ఫ్రాన్స్ స్టార్ స్ట్రైకర్, కెప్టెన్ కిలియన్ ఎంబాపె సెకండాఫ్‌లో లభించిన పెనాల్టీని గోల్‌గా మలిచి జట్టును క్వార్టర్ ఫైనల్స్‌కు చేర్చాడు. టోర్నమెంట్ అంతటా దూకుడుగా ఆడిన ఫ్రాన్స్ జట్టుకు, ఈ మ్యాచ్‌లో మాత్రం పరాగ్వే డిఫెండర్లు ఊహించని సవాలును విసిరారు. ఈ మ్యాచ్ లో గెలవడానికి ఫ్రాన్స్ జట్టు చమటోడ్చాల్సి వచ్చింది.

గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లలో ప్రత్యర్థులపై సులువుగా విజయాలు సాధిస్తూ దూసుకొచ్చిన ఫ్రాన్స్ జట్టుకు... పరాగ్వే గట్టి పోటీ ఇచ్చింది. గత మ్యచ్‌లో ఫుట్‌బాల్ దిగ్గజం జర్మనీని ఓడించి సంచలనం సృష్టించిన పరాగ్వే, అదే ఉత్సాహంతో ఫ్రాన్స్‌ను సైతం కట్టడి చేయడానికి పక్కా వ్యూహంతో బరిలోకి దిగింది. మ్యాచ్ ప్రారంభమైన నిమిషం నుంచే ఫ్రాన్స్ జట్టు బంతిని తమ ఆధీనంలో ఉంచుకుని అటాకింగ్ గేమ్ ఆడింది. ప్రారంభ నిమిషాల్లో ఫ్రాన్స్ ఏకంగా 80 శాతానికి పైగా బాల్‌ను తమ వద్దే ఉంచుకుంది. ముఖ్యంగా పరాగ్వే యువ సంచలనం జూలియో ఎన్సిసో చురుగ్గా కదులుతూ ఫ్రాన్స్ ఆధిపత్యాన్ని అడ్డుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. ఫలితంగా, తొలి 45 నిమిషాల ఆటలో ఫ్రాన్స్ గోల్ కోసం కేవలం ఐదు ప్రయత్నాలు మాత్రమే చేసినా ఒక్కటీ కూడా ఫలించలేదు.

### గోల్డెన్ బూట్‌రేసులో ఎంబాపే... ఏడో గోల్

తొలి అర్ధభాగంలో ఫ్రాన్స్ స్టార్ ఎంబాపెను పరాగ్వే మిడ్‌ఫీల్డర్ ఆండ్రెస్ క్యూబాస్ అడ్డుకోవడంతో ఫౌల్ అయ్యింది. ఈ క్రమంలో ఎంబాపె కోపంతో స్పందించగా, ఇరు జట్ల ఆటగాళ్లు ఒకరినొకరు నెట్టుకుంటూ మైదానంలో పెద్ద ఎత్తున ఘర్షణకు దిగారు. రెఫరీ వెంటనే జోక్యం చేసుకుని ఆటగాళ్లను శాంతింపజేయాల్సి వచ్చింది.ఎంబాపె అద్భుతం టండో అర్ధభాగంలో ఆట స్వరూపం పూర్తిగా మారిపోయింది. ఫ్రాన్స్ జట్టు మరింత పట్టుదలతో మైదానంలోకి అడుగుపెట్టింది. మిడ్‌ఫీల్డర్ మను కోనే లాంగ్‌రేంజ్ నుంచి కొట్టిన ఒక శక్తివంతమైన షాట్‌ను పరాగ్వే గోల్‌కీపర్ ఓర్లాండో గిల్ గాల్లోకి ఎగిరి అద్భుతంగా అడ్డుకున్నాడు. ఈ క్రమటంలో ఫ్రాన్స్ కోచ్ 66వ నిమిషంలో వ్యూహాత్మకంగా డెసిరే డౌను మైదానంలోకి పంపాడు. డౌ మైదానంలోకి వచ్చిన వెంటనే మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. మెరుపు వేగంతో కదులుతూ ముగ్గురు పరాగ్వే డిఫెండర్లను దాటుకుని పెనాల్టీ బాక్స్‌లోకి దూసుకెళ్తున్న డౌను పరాగ్వే ఆటగాడు డియాగో గోమెజ్ కింద పడేశాడు. దీంతో రెఫరీ ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఫ్రాన్స్‌కు పెనాల్టీ కిక్ ఇచ్చాడు. దిగ్గజ ఆటగాడు ఎంబాపె ఏమాత్రం ఒత్తిడికి లోనవకుండా, బంతిని అత్యంత చాకచక్యంగా గోల్ పోస్ట్‌లోకి పంపి ఫ్రాన్స్‌కు 1–0 ఆధిక్యాన్ని అందించాడు.ఈ గోల్‌తో మెస్సీతో సమానంగా 7 గోల్స్‌తో గోల్డెన్ బూట్ రేసులో ఎంబాపే ముందున్నాడు. గోల్ సమం చేసి మ్యాచ్‌ను ఎక్స్‌ట్రా టైమ్‌కు తీసుకెళ్లాలని పరాగ్వే జట్టు చివరి 20 నిమిషాల్లో తీవ్రంగా పోరాడింది. కానీ, ఫ్రాన్స్ డిఫెండర్లు, మిడ్‌ఫీల్డర్లు సమన్వయంతో ఆడుతూ పరాగ్వే ప్రయత్నాలను భగ్నం చేశారు. మ్యాచ్ ముగియడానికి కొన్ని క్షణాల ముందు, ఇంజ్యూరీ టైమ్‌లో ఎంబాపె వ్యక్తిగతంగా రెండో గోల్ సాధించే సువర్ణావకాశాన్ని అందుకున్నాడు. అయితే పరాగ్వే గోల్‌కీపర్ ఓర్లాండో గిల్ వరుసగా రెండు అద్భుతమైన సేవ్‌లు చేసి ఫ్రాన్స్ ఆధిక్యం పెరగకుండా అడ్డుకున్నాడు. చివరకు ఫ్రాన్స్ 1–0తో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది.

### చరిత్ర సృష్టించిన మొరాకో.. తొలి ఆఫ్రికా దేశం

మరో ప్రికార్వర్ట్ ఫైనల్లో అతిథ్య కెనడాపై 3–0 గోల్స్‌తో గెలుపుతో మొరాకో చరిత్ర సృష్టించింది. వరుసగా రెండు ప్రపంచకప్‌లలో క్వార్టర్స్‌కు చేరిన తొలి ఆఫ్రికన్ జట్టుగా రికార్డు నెలకొల్పింది. ఈ మ్యాచ్‌లో అజెద్దీన్ రెండు గోల్స్‌తో మొరాకోకు చారిత్రక విజయాన్ని అందించాడు. అదనపు సమయంలో సూఫియాన్ రహీమీ మరో గోల్ చేసి మొరాకోను క్వార్టర్స్‌కు చేర్చాడు.జూలై 9న బోస్టన్‌లో జరిగే తొలి క్వార్టర్‌లో ఫ్రాన్స్, మొరాకో తలపడనున్నాయి.

## ఫెదరర్ రికార్డును బ్రేక్ : క్వార్టర్ ఫైనల్లో జొకోవిచ్



వింబుల్డన్‌లో 106 మ్యాచ్‌లు నెగ్గిన జొకోవిచ్

**లండన్,జులై 5:** ఏడుసార్లు వింబుల్డన్ ఛాంపియన్ నోవాక్ జొకోవిచ్ మరో అరుదైన రికార్డు నెలకొల్పాడు. నాలుగో రౌండ్‌లో రష్యన్ క్వాలిఫయర్ రోమన్ సఫియుల్లిన్‌పై 7–6, 6–3, 3–6, 6–3తో నెగ్గి రోజర్ ఫెదరర్ రికార్డును బద్దలు కొట్టాడు. వింబుల్డన్‌లో విజయాల సంఖ్యను 106కు చేర్చాడు. ఈ క్రమంలో ఫెదరర్(105) మ్యాచ్‌ల విజయాన్ని వెనక్కి నెట్టా డు. ఆల్ ఇంగ్లాండ్ క్లబ్‌లో పురుషుల, మహిళల విభాగాలలో కలిపి మార్టినా నవ్రతిలోవా(120) మాత్రమే ఎక్కువ సింగిల్స్ మ్యాచ్‌లు గెలిచింది. అలాగే జొకోవిచ్ 17వ సారి వింబుల్డన్ క్వార్టర్ ఫైనల్, వరుసగా తొమ్మిదో సారి క్వార్టర్‌ఫైనల్ చేరాడు. ఇది కూడా రికార్డే. క్వార్టర్ ఫైనల్లో కెనడియన్ మూడో సీడ్ ఫెలిక్స్ ఆగర్‌అలియాసిమ్, స్పానిష్ అలెజాండ్రో దేవిడోవిచ్ ఫోకినా మ్యాచ్ విజేతతో తలపడతాడు.

ఈ వారం ఆల్ ఇంగ్లాండ్ క్లబ్‌లో ఆడిన తన మొదటి మూడు మ్యాచ్‌లలో రెండింటిలో ఒక సెట్ కోల్పోయిన తర్వాత తిరిగి పుంజుకున్నాడు. 25వ గ్రాండ్ స్లామ్ సింగిల్స్ టైటిల్‌పై కన్నేసిన జొకోవిచ్... రష్యన్ క్వాలిఫయర్‌తో జరిగిన నాలుగో రౌండ్‌లో చెమటోడ్చాల్సి వచ్చింది. తొలిసెట్‌లోనే ఇరువురు పోటాపోటీగా తలపడ్డారు. టైబ్రేకర్ వరకు జరిగిన ఈ సెట్‌ను 7–6తో కైవసం చేసుకున్న జొకోవిచ్... రెండో సెట్‌ను అలవోకగా 6–3తో నెగ్గాడు. అయితే మూడో సెట్‌లో పుంజుకున్న రోమన్.. జొకోవిచ్ సర్వీసును కొల్లగొట్టి సెట్‌ను6–3తో నెగ్గిఆధిక్యాన్ని 2–1కు తగ్గించాడు. అయితే నాలుగోసెట్‌లో జొకోవిచ్..ప్రత్య ర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండాసెట్‌ను మ్యాచ్‌ను ముగించి క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించాడు.

### సబలెంకాకు ఒసాకా షాక్

మహిళల సింగిల్స్‌లో సంచలనం నమోదైంది. టాప్‌సీడ్ సబలెంకాను 14వసీడ్ నయోమి ఒసాకా(జపాన్) వరుస సెట్లలో 6–2,7–6తో ఓడించింది.వింబుల్డన్‌లో ఫ్యాషన్లతో హోరెత్తిసున్న ఒసాకా... గేమ్‌లో అదే జోరు కొనసాగిస్తోంది.తొలి సెట్‌ను అలవోకగా నెగ్గి ఒసాకా శుభారంభం చేసింది. రెండోసెట్‌లో పుంజుకున్న సబలెంకా... సర్వీసులను నిలుపుకోవడంతో టైబ్రేక్‌కు సాగింది. అయితే ఒసాకా ఈ దశలో సబలెంకా సర్వీసును కొల్లగొట్టి రెండో సెట్‌తో పాటు మ్యాచ్‌ను ముగించి క్వార్టర్ ఫైనల్లో ప్రవేశించింది.

## మహిళల టి20 ఛాంపియన్‌గా ఆస్ట్రేలియా



**లార్డ్స్, జులై 5:** మహిళల టీ20 ప్రపంచకప్ విజేతగా ఆస్ట్రేలియా నిలిచింది. లార్డ్స్ వేదికగా జరిగిన ఫైనల్లో ఇంగ్లాండ్‌పై 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. 151 పరుగుల లక్ష్యాన్ని 17.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. బెత్ మూనీ(64) హాఫ్ సెంచరీతో రాణించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (48), ఎలీస్ పెర్రీ (13..), జార్జియా వోల్ (9) పరుగులు చేశారు. ఇంగ్లాండ్ బౌలర్లలో షార్లెట్ డీన్, లారెన్ బెల్, సోఫీ ఎకిల్‌స్టోన్ తలో వికెట్ తీశారు.

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ ఆరంభంలో తడబడింది. 32 పరుగులకే ఓపెనర్లు ఇద్దరు అమీ జోన్స్(6), డానీ వ్యాట్-హాడ్జ్(8) వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో నాట్‌సీవర్ బ్రంట్ కెప్టెన్ ఇన్నింగ్స్‌ఆడింది. 53 బంతుల్లోనే 5 ఫోర్లతో 58 పరుగులు సాధించింది. అలీస్ క్యాప్సీ (23)తో కలిసి మూడో వికెట్‌కు 35 రన్స్ జోడించింది. చివర్లో ఫ్రేయా కెంప్ మెరుపులతో ఇంగ్లాండ్ 150 మార్కుకు చేరుకుంది.కెంప్ 28 బంతుల్లోనే 4 ఫోర్లు, ఓ సిక్స్‌తో 44 పరుగులు చేసింది. దీంతో ఇంగ్లాండ్ 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 150 రన్స్ చేసింది. ఆస్ట్రేలియా బౌలర్లలో కిమ్ గార్త్, లూసీ హామిల్టన్, సోఫీ, అన్నాబెల్ సదర్లాండ్ తలో వికెట్ తీశారు.

151 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా ఆరంభంలోనే ఓపెనర్ జార్జియా వోల్(9) వికెట్ కోల్పోయింది. అయితే బెత్ మూనీ(49 బంతుల్లో 64; 10 ఫోర్లు), లిచ్‌ఫీల్డ్(35 బంతుల్లో 48; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) రెండో వికెట్‌కు ఏకంగా సెంచరీ భాగస్వామ్యంతో ఆస్ట్రేలియా గెలుపుకు బాటలు వేశారు.ఇద్దరూ అవుటైనా మిగతా పనిని పెర్రీ(13), గార్డ్‌నర్(3) పూర్తి చేయడంతో ఆస్ట్రేలియా 17.1 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఏడు వికెట్లతో ఘనవిజయం సాధించింది.

# డివిడెండ్లు బోనస్‌లతో ఈ వారం బిజీబిజీ




**ముంబయి, జులై 5:** కంపెనీల డివిడెండ్లు, బోనస్‌లు, స్టాక్ విభజన వంటి వాటితో రానున్న వారం స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లకు కీలకంగా మారనుంది. పలు ప్రముఖ కంపెనీలు డివిడెండ్‌లు, బోనస్ షేర్లు, స్టాక్ స్ప్లిట్లకు సంబంధించిన రికార్డ్ తేదీలను ప్రకటించాయి. ఈ ప్రయోజనాలు పొందాలంటే ఇన్వెస్టర్లు ఆయా రికార్డ్ తేదీలకు ముందు షేర్లను కలిగి ఉండాలి. రికార్డ్ డేట్ ఆధారంగానే డివిడెండ్, బోనస్ షేర్లు లేదా స్టాక్ స్ప్లిట్ ప్రయోజనాలకు అర్హులైన వాటాదారులను కంపెనీలు నిర్ణయిస్తాయి. సాధారణంగా ఎక్స్‌డేట్ కూడా ఇదే రోజున ఉంటుంది. ఆ రోజు నుంచి షేర్ ధర కార్పొరేట్ యాక్షన్‌కు అనుగుణంగా సర్దుబాటు అవుతుంది.

ఈ వారం జేఎస్‌డబ్ల్యూ సిమెంట్, నెస్లే ఇండియా, యునైటెడ్ స్పిరిట్స్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్, యాక్సిస్ బ్యాంక్, టైటాన్ కంపెనీ వంటి ప్రముఖ కంపెనీల కార్పొరేట్ యాక్షన్స్‌పై మార్కెట్ దృష్టి నెలకొంది.డివిడెండ్‌లు డీసీఎం శ్రీరామ్ ఇంటర్నేషనల్, డీజే మీడియాప్రింట్ అండ్ లాజిస్టిక్స్, పిలానీ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్, సుందరం ఫైనాన్స్,సెరా శానిటరీవేర్ కంపెనీలు ఎక్స్‌డివిడెండ్‌గా ట్రేడ్ కానున్నాయి. దొడ్ల డెయిరీ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎల్‌కేపీ సెక్యూరిటీస్, సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్ షేర్లు ఎక్స్‌డివిడెండ్‌లోకి ప్రవేశించనున్నాయి. బ్లిస్ జీవీఎస్ ఫార్మా, హన్నా జోసెఫ్ హాస్పిటల్, కేశర్ టెర్మినల్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎంఫాసిస్, యునైటెడ్ స్పిరిట్స్ కంపెనీలకు ఎక్స్‌డివిడెండ్ వర్తించనుంది. హర్షా ఇంజినీర్స్ ఇంటర్నేషనల్, ఆర్‌పీజీ లైఫ్ సైన్సెస్, షీలా ఫోమ్, టైటాన్ కంపెనీ ఎక్స్‌డివిడెండ్‌గా ట్రేడ్ అవుతాయి. అపోలో టైర్స్,ఆర్టెమిస్ మెడికేర్ సర్వీసెస్,యాక్సిస్ బ్యాంక్, బిర్లా సాఫ్ట్, కంప్యూటర్ ఏజ్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్, కంట్రోల్ ప్రింట్, డిలింక్ ఇండియా, డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్, డైనమిక్ కేబుల్స్, జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్, గ్రైండ్‌వెల్ నార్టన్, హిందాల్కో ఇండస్ట్రీస్, జేకే సిమెంట్, జేఎస్‌డబ్ల్యూ సిమెంట్, మహీంద్రా లాజిస్టిక్స్, నెస్లే ఇండియా, న్యూ ఇండియా అష్యూరెన్స్, నిలకమల్, ఒరియెంట్ ఎలక్ట్రిక్, పీటీఎల్ ఎంటర్‌ప్రైజెస్, రోస్సారి బయోటెక్, స్మార్ట్‌లింక్ హోల్డింగ్స్, శోభా, వెల్‌స్పన్ లివింగ్, జెడ్‌ఎఫ్ కమర్షియల్ వెహికల్ కంట్రోల్ సిస్టమ్స్ ఇండియా కంపెనీలు ఎక్స్‌డివిడెండ్‌గా ట్రేడ్ కానున్నాయి.

స్టాక్ విభజనపరంగా గుజరాత్ ఇంజెక్ట్ కేరళ కంపెనీ షేర్ ఫేస్ వ్యాల్యూను రూ.10 నుంచి రూ.1కు విభజిస్తూ జూలై 8ను రికార్డ్ డేట్‌గా నిర్ణయిం చింది. మంగళం వరల్డ్‌వైడ్ కంపెనీ కూడా షేర్ ఫేస్ వ్యాల్యూను రూ.10 నుంచి రూ.1కు విభజించి జూలై 10 రికార్డ్ డేట్‌గా వెల్లడించింది.

బోనస్ షేర్లుగోల్డియామ్ ఇంటర్నేషనల్ కంపెనీ 1:3 నిష్పత్తిలో బోనస్ షేర్లను ప్రకటించింది. హిందుస్థాన్ ఇన్సులేటర్స్ అండ్ ఇండస్ట్రీస్ 2:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను ఇవ్వనుంది.




## ఫ్యాషన్‌బ్రాండ్ నైకా రాబడుల్లో 30శాతం వృద్ధి

**ముంబయి,జులై 5:**ఈకామర్స్ సంస్థ నైకా మాతృసంస్థ ఎఫ్ఎస్ఎన్ ఈకామర్స్ వెంచర్స్ లిమిటెడ్ జూన్ త్రైమాసికంలో బలమైన వ్యాపార వృద్ధిని నమోదు చేసినట్లు తెలిపింది.సమీకృత గ్రాస్ మెర్చండైజ్ వ్యాల్యూ, నెట్ సేల్స్ వ్యాల్యూవృద్ధి30శాతం ప్రారంభ స్థాయిలో ఉండే అవకాశముందని, మొత్తం ఆదాయ వృద్ధి దాదాపు 30 శాతానికి చేరుకుంటుందని కంపెనీ అంచనా వేసింది. కంపెనీ విడుదల చేసిన త్రైమాసిక వ్యాపార అప్‌డేట్ ప్రకారం, బ్యూటీ విభాగం నెట్ సేల్స్ వ్యాల్యూ, నికర ఆదాయంలో 20 శాతం వృద్ధిని నమోదు చేయనుంది. కొత్త వినియోగదారుల చేరిక, ఓమ్నీఛానల్ వ్యాపార విస్తరణ, మార్కెటింగ్ ఆదాయంలో పెరుగుదల ఈ వృద్ధికి ప్రధాన కారణాలని కంపెనీ తెలిపింది.రిటైల్ స్టోర్లలో ఇప్పటికే ఉన్న అవుట్‌లెట్ల విక్రయాల పెరుగుదలతో పాటు కొత్త స్టోర్ల విస్తరణ కూడా బ్యూటీ వ్యాపారానికి బలాన్నిచ్చిందని పేర్కొంది. అలాగే కంపెనీ సొంత బ్రాండ్ల పోర్ట్‌ఫోలియో కూడా మంచి వృద్ధిని నమోదు చేస్తోందని తెలిపింది. హౌస్ ఆఫ్ నైకా పరిధిలోని కే బ్యూటీ, నైకా కాస్మెటిక్స్, డాట్ అండ్ కీ బ్రాండ్లు స్థిరమైన వృద్ధిని కొనసాగిస్తున్నాయని కంపెనీ వెల్లడించింది. ఈ విభాగంలో నెట్ సేల్స్ విలువలు 50 శాతం పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. బ్యూటీ, ఫ్యాషన్ విభాగాల్లో కొత్త వినియోగదారుల చేరిక కోసం మార్కెటింగ్‌పై పెట్టుబడులు కొనసాగుతున్నాయని, దీంతో మరో త్రైమాసికంలో కూడా ఆరోగ్యకరమైన వృద్ధిని నమోదు చేస్తామని నైకా ఆశాభావం వ్యక్తం చేసింది.

## మార్కెట్‌కు ఈ వారం ఐపిఒల సందడి


## నాలుగు కొత్త ఐపిఒలతో రూ.1460 కోట్లు సేకరణ




**ముంబయి,జులై 5:**భారత ప్రైమరీ మార్కెట్‌లో ఈవారం ఐపీఓల సందడి కొనసాగనుంది. మొత్తం నాలుగు కొత్త ఐపీఓలు ఇన్వెస్టర్ల కోసం వస్తున్నాయి. వీటితో కంపెనీలు సుమారు రూ.1,460 కోట్ల నిధులు సమీకరించనున్నాయి.రెండు మెయిన్‌బోర్డ్, రెండు ఎస్ఎంఈ ఐపీఓలు ఉన్నాయి. ఇదే సమయంలో తొమ్మిది కంపెనీల షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ కానున్నాయి. జూలై 8న కుసుమ్‌గర్ లిమిటెడ్ మెయిన్‌బోర్డ్ ఐపీఓ ప్రారంభం కానుంది. రూ.650 కోట్ల ఈ ఐపీఓకు ఒక్కో షేరు ధరను రూ.398 నుంచి రూ.419 మధ్య నిర్ణయించారు. జూలై 10తో సబ్‌స్క్రిప్షన్ ముగుస్తుంది.

ఈ ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో ఉండనుంది. జూలై 9న లేజర్ పవర్ అండ్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ రూ.742 కోట్ల ఐపీఓను ప్రారంభించనుంది. ఇందులో రూ.542 కోట్ల తాజా ఈక్విటీ ఇష్యూ, రూ.200 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ ఉన్నాయి. సబ్‌స్క్రిప్షన్ జూలై 13 వరకు కొనసాగుతుంది. ఎస్ఎంఈ విభాగంలో హ్యాపీ స్టీల్స్ లిమిటెడ్ జూలై 9న రూ.25 కోట్ల ఐపీఓను ప్రారంభిస్తోంది. షేరు ధరను రూ.62 నుంచి రూ.66 మధ్య నిర్ణయించగా, మొత్తం 38 లక్షల తాజా ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. దేవ్‌సన్ క్యాటలిస్ట్ లిమిటెడ్ కూడా తన ఎస్ఎంఈ ఐపీఓను ప్రారంభించనుంది. రూ.42.34 కోట్ల ఈ ఇష్యూలో రూ.39.39 కోట్ల తాజా షేర్లు, రూ.2.95 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ ఉన్నాయి. ఒక్కో షేరు ధరను రూ.112 నుంచి రూ.118 మధ్య నిర్ణయించారు.మరోవైపు, లిస్టింగ్ క్యాలెండర్ కూడా బిజీగా ఉండనుంది. ఆస్థా స్పిన్‌టెక్స్ జూలై 6న బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో లిస్ట్ కానుండగా, నాక్ ప్యాకేజింగ్ జూలై 8న మెయిన్‌బోర్డ్‌లో లిస్టింగ్ అయ్యే అవకాశం ఉంది. ఎస్ఎంఈ విభాగంలో అడాన్ అగ్రో కమోడిటీస్ తేజా ఇంజినీరింగ్ ఇండస్ట్రీస్, అథర్వ పాలీప్లాస్ట్, సీమ్యాక్స్ రిసోర్సెస్, సంపర్క్ ఇండియా లాజిస్టిక్స్, వినీత్ మొబైల్, క్రిటికల్ టెక్ సంస్థలుఈనెల ఐదారుతేదీల్లో లిస్టింగ్ కానున్నాయి.

## టాప్6 కంపెనీల్లో లక్షకోట్లు పెరిగిన మార్కెట్‌క్యాప్



**ముంబయి,జులై 5:** దేశీయ స్టాక్ మార్కెట్లలో సానుకూల ధోరణి కొనసాగడంతో గత వారం దేశంలోని టాప్10 అత్యంత విలువైన కంపెనీల్లో ఆరు సంస్థల మొత్తం మార్కెట్ విలువ రూ.1 లక్ష కోట్లకు పైగా పెరిగింది. వీటిలో భారతి ఎయిర్‌టెల్ మరియు బజాజ్ ఫైనాన్స్ అత్యధిక లాభాలు నమోదు చేసిన సంస్థలుగా నిలిచాయి.

గత వారం బీఎస్ఈ సెన్సెక్స్ 663 పాయింట్లు, ఎన్ఎస్ఈ నిఫ్టీ 214 పాయింట్లు పెరిగాయి. దేశీయ ఆర్థిక సూచీలు బలంగా ఉండటం, జీఎస్టీ వసూళ్లు ఆశాజనకంగా నమోదు కావడం, పారిశ్రామిక కార్యకలాపాలు మెరుగుపడటం మార్కెట్లకు ఊతమిచ్చాయి.అమెరికా ఉద్యోగ గణాంకాలు అంచనాలకు తగ్గట్టుగా రావడంతో ప్రపంచవ్యాప్తంగా వడ్డీ రేట్లపై సానుకూల అంచనాలు పెరిగి పెట్టుబడిదారుల విశ్వాసం బలపడింది.గత వారం భారతి ఎయిర్‌టెల్ మార్కెట్ విలువ రూ.36,529 కోట్ల మేర పెరిగి రూ.11.64 లక్షల కోట్లకు చేరుకుంది. బజాజ్ ఫైనాన్స్ మార్కెట్ క్యాప్ రూ.33,060 కోట్ల పెరుగుదలతో రూ.6.43 లక్షల కోట్లకు చేరింది.

ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ విలువ రూ.16,084 కోట్ల పెరుగుదలతో రూ.10.12 లక్షల కోట్లకు చేరగా, ఎల్ఐసీ విలువ రూ.8,602 కోట్ల పెరిగి రూ.5.44 లక్షల కోట్లకు చేరుకుంది.హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ క్యాప్ రూ.7,665 కోట్ల పెరిగి రూ.12.34 లక్షల కోట్లకు చేరగా, హిందుస్థాన్ యూనిలీవర్ విలువ రూ.6,461 కోట్ల పెరిగి రూ.5.17 లక్షల కోట్లకు చేరింది.అయితే లార్సెన్ అండ్ టుబ్రో మార్కెట్ విలువ రూ.26,572 కోట్ల మేర తగ్గి రూ.5.54 లక్షల కోట్లకు పడిపోయింది.

రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ క్యాప్ రూ.18,946 కోట్ల మేర తగ్గి రూ.17.65 లక్షల కోట్లకు చేరగా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విలువ రూ.4,846 కోట్ల మేర తగ్గింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) మార్కెట్ విలువ కూడా స్వల్పంగా రూ.1,031 కోట్ల మేర తగ్గింది.మార్కెట్ విలువ పరంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ దేశంలోనే అగ్రస్థానాన్ని కొనసాగిస్తుండగా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్, లార్సెన్ అండ్ టుబ్రో, ఎల్ఐసీ, హిందుస్థాన్ యూనిలీవర్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

## మూడు బ్యూటీక్రీమ్‌లపై మహారాష్ట్ర ఎఫ్‌డిఎ నిషేధం




**ముంబయి, జులై 5:** మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ పరీక్షల్లో గోరీ బ్యూటీ క్రీమ్, ఫేస్ ఫ్రెష్ గోల్డ్ బ్యూటీ క్రీమ్ అండ్ సీరమ్, గోల్డెన్ స్టార్ బ్యూటీ క్రీమ్ నాణ్యత ప్రమాణాలకు విరుద్ధంగా ఉన్నట్లు గుర్తించింది. వీటిలో పాదరసం, సీసం మోతాదులు అనుమతించిన పరిమితికి మించి ఉన్నాయని ఈ క్రీములను ఎక్కువ కాలం ఉపయోగిస్తే మూత్రపిండాలు,నాడీ వ్యవస్థ, చర్మంపై తీవ్రమైన దుష్ప్రభావాలు కలిగే ప్రమాదం ఉందని ఎంఎఫ్‌డీఏ హెచ్చరించింది. అందువల్ల ఈ ఉత్పత్తులను కొనుగోలు చేయడం, వినియోగించడం, విక్రయించడం, పంపిణీ చేయడం తక్షణమే నిలిపివే యాలని సూచించింది. ఈ ఉత్పత్తుల ప్యాకెట్లపై తయారీదారు పేరు, చిరునామా, బ్యాచ్ నంబర్, తయారీ తేదీ, గడువు తేదీ వంటి తప్పనిసరి వివరాలు కూడా లేవని అధికారులు గుర్తించారు.

దీంతో రిటైలర్లు, హోల్‌సేలర్లు, డిస్ట్రిబ్యూటర్లు, ఈకామర్స్ సంస్థలు ఈ ఉత్పత్తుల విక్రయాలను వెంటనే నిలిపివేయాలని ఎంఎఫ్‌డీఏ ఆదేశించింది. మార్కెట్ నుంచి వెనక్కి తీసుకున్న స్టాక్ వివరాలతో పాటు మిగిలిన నిల్వలపై నివేదిక సమర్పించాలనిఆదేశించింది.

## మూడునెలల్లో ఫాక్స్‌కాన్ రాబడులు 40% వృద్ధి




**న్యూఢిల్లీ, జులై 5:**ప్రపంచంలోనే అతిపెద్ద కాంట్రాక్ట్ ఎలక్ట్రానిక్స్ తయారీసంస్థ ఫాక్స్‌కాన్ ఆర్థిక ఫలితాల్లో భారీ వృద్ధి నమోదు చేసింది. కృత్రిమ మేధస్సు (ఏఐ)సర్వర్లకు పెరిగిన డిమాండ్‌తో పాటు వినియోగదారుల ఎలక్ట్రానిక్స్ వ్యాపారం పుంజుకోవడంతో కంపెనీ ఆదాయం దాదాపు 40 శాతం పెరిగింది.ఏప్రిల్ నుంచి జూన్ వరకు రెండో త్రైమాసికంలో ఫాక్స్‌కాన్ ఆదాయం 2.513 ట్రిలియన్ తైవాన్ డాలర్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 39.8 శాతం వృద్ధి.ప్రపంచ ప్రముఖ ఏఐ చిప్ తయారీ సంస్థ ఎన్‌విడియాకు ఏఐ సర్వర్ల ప్రధాన సరఫరా దారుగా,ఆపిల్ ఐఫోన్‌ల అతిపెద్ద తయారీ సంస్థగా ఉన్న ఫాక్స్‌కాన్‌కు ఏఐ ఉత్పత్తులపై పెరిగిన డిమాండ్ భారీగా కలిసి వచ్చింది.క్లౌడ్, నెట్‌వర్కింగ్ విభాగంలో ఏఐ సర్వర్ల విక్రయాలు బలంగా పెరగడంతో ఆదాయం గణనీయంగా పెరిగిందని కంపెనీ తెలిపింది.ఐఫోన్ స్మార్ట్ కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ విభాగం కూడా ఏడాది ప్రాతిపదికన మంచి వృద్ధిని నమోదు చేసింది. జూన్ నెలలో మాత్రమే కంపెనీ ఆదాయం 821.8 బిలియన్ తైవాన్ డాలర్లకు చేరుకుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.




తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

రాజమహేంద్రవరం | సోమవారం 06 జులై 2026 | I


# డయల్ యువర్ ఎమ్మెల్యే...

- సమస్యలపై తక్షణమే స్పందన..
- గంట వ్యవధిలో 40 కాల్స్..... ప్రజా సమస్యలను ఫోన్ లో అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే ఆనందరావు.....
- అభివృద్ధి,సంక్షేమ పథకాలపై వెల్లువెత్తిన ప్రజాభినందనలు...

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూలై 5,ప్రభాతవార్త.** ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా ముందుకు సాగుతున్న అమలాపురం నియోజకవర్గ శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు ఆదివారం అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో నిర్వహించిన డయల్ యువర్ ఎమ్మెల్యే లైవ్ ఫోన్-ఇన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు జరిగిన ఈ గంట వ్యవధిలోనే నియోజకవర్గ నలుమూలల నుండి రికార్డు స్థాయిలో 40 ఫోన్ కాల్స్ వచ్చాయి. ఈ కార్యక్రమంలో కేవలం సమస్యలే కాకుండా, ఎమ్మెల్యే నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై ప్రజల నుండి అద్భుతమైన సానుకూల స్పందన లభించింది. నియోజకవర్గ పరిధిలో నిర్మిస్తున్న పలు కీలకమైన వంతెనలు (బ్రిడ్జిలు),స్థానిక డిగ్రీ కాలేజీ మంజూరు,అభివృద్ధి, కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుస్తున్నాయని, ఎమ్మెల్యే పనితీరు అమోఘమని పలువురు కాలర్స్ ఆయనను ఫోన్ ద్వారా అభినందించారు.అనంతరం ప్రజలు తమ ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న తాగునీటి సరఫరా, విద్యుత్ లో-వోల్టేజ్ సమస్యలు, అంతర్గత రోడ్ల దుస్థితి,ఇంటి పట్టాల మంజూరు మరియు ప్రైవేట్ స్కూల్ ఫ్రీ అడ్మిషన్ కొరకు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు.ప్రజలు వ్యక్తపరిచిన ప్రతి సమస్యను ఎమ్మెల్యే ఎంతో ఓపికగా అడిగి



తెలుసుకున్నారు. కొన్ని తక్షణ సమస్యలపై లైవ్‌లోనే సంబంధిత శాఖల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి అక్కడికక్కడే పరిష్కారం చూపించారు. రోడ్ల మరమ్మతులు, ప్రైవేట్ స్కూల్ ఫ్రీ అడ్మిషన్ల ప్రక్రియలో విద్యార్థులకు ఎదురవుతున్న ఇబ్బందులను త్వరితగతిన పరిశీలించి, యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వాని కి మధ్య నిరంతరం సమన్వయం ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.అభివృద్ధిని, సంక్షేమాన్ని సమాంతరంగా ప్రజలకు అందిస్తున్నామని,తమ పనులపై ప్రజలు చూపించిన సానుకూల స్పందన తమ బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు.

## 13 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్న కాకినాడ జిల్లా పోలీసులు:



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి జూలై 5 (ప్రభాతవార్త)** కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఆదేశాల మేరకు, పెద్దాపురం డీఎస్పీ ఏ.బి.జి. తిలక్ పర్యవేక్షణలో, తుని టౌన్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. గీతా రామకృష్ణ ఆధ్వర్యంలో, ఆదివారం తెల్లవారుజాము నుండి తుని టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో ప్రత్యేక కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించబడింది. తనిఖీల సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 13 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, వాటిపై చట్టపరమైన చర్యలు ప్రారంభించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ మరియు అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై నిఘా ఉంచే లక్ష్యంతో జిల్లాలో ఇటువంటి ప్రత్యేక కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిరంతరం కొనసాగుతాయని తుని టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. గీతా రామకృష్ణ తెలిపారు. కాకినాడ జిల్లా పోలీసులు ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఇలాంటి ప్రత్యేక తనిఖీలను నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తుని టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ జె. విజయబాబు, తుని టౌన్, తుని రూరల్ పోలీస్ స్టేషన్ల పోలీసు సిబ్బంది పాల్గొని విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.

## అల్లూరి ఆశయాలను యువత
# ఆదర్శంగా తీసుకోవాలి
### బిజెపి పార్లమెంట్ కన్వీనర్ రంబాల

**కాకినాడ రూరల్, జూలై 5 (ప్రభాతవార్త):** మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయాలు యువత ఆదర్శంగా తీసుకోవాలని అల్లూరి త్యాగస్ఫూర్తి భావితరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండాలని బిజెపి కాకినాడ జిల్లా మాజీ పార్లమెంట్ కన్వీనర్ రంబాల ఆకాంక్షించారు. కాకినాడ నార్త్ మండల బిజెపి అధ్యక్షులు ముమ్మిడి నాగబాబు ఆధ్వర్యంలో నాగమల్లితోట జంక్షన్ వద్ద అల్లూరి 129 వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి మాజీ పార్లమెంట్ కన్వీనర్ రంబాల



వెంకటేశ్వరరావు, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి సతీష్ రావు, పూర్వ అసెంబ్లీ కన్వీనర్ పితాని లీలావతి అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా రంభాల మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు,మన్యం వీరుడు,ఆదివాసీ ప్రజల హక్కుల కోసం తన ప్రాణాలను అర్పించిన మహనీయుడు అల్లూరి మన ప్రాతం వారు కావడం గర్వనీయమని అన్నారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అపార ధైర్యసాహసాలతో పోరాడిన అల్లూరి సీతారామరాజు దేశభక్తికి,త్యాగానికి, నాయకత్వానికి చిరస్మరణీయమైన ప్రతీకని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పాల్గొన్నారు అనపర్తి వెంకటేష్,,పక్కి మణి బాల, వినాయక మాధవరావు, లోవరాజు,వై.రాయుడు అధిక సంఖ్యలో బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## కత్తిపూడిలో ఆర్ఎస్ఎస్ గురుపూజోత్సవం



**శంకవరం జులై 5 ప్రభాతవార్త** త్యాగానికి గుర్తు కాషాయ ధ్వజం అని, సమాజం కోసం అందరూ సమర్పణ చేయాల్సి ఉంటుందని గోదావరి విభాగ్ శారీరక్ ప్రముఖ రాచకొండ ప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం గురుపూజోత్సవ కార్యక్రమాన్ని మండలంలోని కత్తిపూడి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గుడి వద్ద గల కళ్యాణ మండపంలో నిర్వహించారు. అన్నవరం దేవస్థానం పాలకమండలి ప్రత్యేక ఆహ్వానితులు వేములపల్లి కాంతారావు అధ్యక్షతన ప్రత్తిపాడు ఖండ కార్యవాహ మొండి వీర వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాట్లాడుతూ దేశ వైభవం కోసం, అందరిలోనూ తనువు మనస్సు ధనము అన్ని తల్లి భారతికి సమర్పించే భావనను నిర్మాణం చేసే శుభ తరుణమే గురుపూజోత్సవం అని అన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక సంఘం లో వ్యక్తులు గురువుగా ఉండాలని కాషాయ ధ్వజం మాత్రమే గురువుగా ఉంటారని, కాషాయ ధ్వజానికే పూజ చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు .ఎందరో మహనీయులు నడయాడిన నేలపై మనం జీవిస్తున్నామని సమాజం కోసం దేశభక్తి కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆయన కోరారు. ప్రార్థనతో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ముగించారు.సమావేశానికి పలువురు గణ వేష ధరించి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ వి వి ఎస్ లింగేశ్వరరావు, బొండాడ సత్యనారాయణమూర్తి, చిన్నాల అప్పలరాజు ,జిలకర చక్ర కామేశ్వరరావు, మొగిలి అక్క రావు కంద దివాణం తదితరులు పాల్గొన్నారు

## ఏడువారాల వెంకన్నకు
# అష్టోత్ర పూజ, నిత్యకళ్యాణం..
### అశేష సంఖ్యలో భక్తులు..





**ఆత్రేయపురం, జూలై,05,(ప్రభాత వార్త)** ప్రముఖ పుణ్యక్షేత్రం కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం ఆదివారం వేలాది మంది భక్తుల గోవిందనామ స్మరణతో మార్మోగింది . ఏడు వారాల నోము పూర్తయిన భక్తులు అష్టోత్తర శతనామావళి, నిత్య కళ్యాణం, గోపూజ, పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావులు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగు ఏర్పాట్లు చేశారు.

# కార్పొరేట్ ముసుగులో కల్తీ దందా
## స్మార్ట్ బజార్‌లో నాసిరకం సరుకుల కలకలం

**రామచంద్రపురం,జూలై 05(ప్రభాతవార్త):** బ్రాండెడ్ స్టోర్‌పై ప్రజలు పెట్టుకున్న నమ్మకానికి రామచంద్రపురంలోని రాజాగోపాల్ సెంటర్‌లో ఉన్న రిలయన్స్ స్మార్ట్ బజార్‌లో ఎదురుదెబ్బ తగిలింది.స్టోర్‌లో విక్రయిస్తున్న బాస్మతి బియ్యంలో రాళ్లు,జొన్నల్లో మట్టిగడ్డలు,బిర్యానీ మసాలా ప్యాకెట్లలో అట్టముక్కలు బయటపడటంతో వినియోగదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.నాణ్యత పేరుతో భారీ ధరలు వసూలు చేస్తూ నాసిరకం సరుకులు విక్రయించడం దారుణమని మండిపడుతున్నారు.కార్పొరేట్ బ్రాండ్ పేరును అడ్డుపెట్టుకుని ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని ఆరోపిస్తున్నారు.ఈ విషయంపై సంబంధిత అధికారులు వెంటనే దాడులు నిర్వహించి,నాసిరకం ఆహార ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని,బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.నిర్లక్ష్యం కొనసాగితే ప్రజా ఆందోళన తప్పదని హెచ్చరిస్తున్నారు.




## ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ - డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం

**100 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి**

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కీర్తి చేకూరి**

**రాజమహేంద్రవరం సిటీ జులై 5 ప్రభాతవార్త** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమంలో భాగంగా తూర్పు గోదావరి జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల (జుఅబఎవతీఖఅశీఅ ఖీశీతీఎం) డిజిటలైజేషన్ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026 జూలై 5వ తేదీ సాయంత్రం 6 గంటల నాటికి జిల్లాలోని మొత్తం 18,46,723 మంది ఓటర్లకు సంబంధించిన ఎన్యూమరేషన్ ఫారాలలో 10,66,100 ఫారాలు డిజిటలైజేషన్ 57.73 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు.



**అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా డిజిటలైజేషన్ పురోగతి**

ఓటర్లు/ డిజిటలైజేషన్ / శాతం

అనపర్తి -- 2,27,053 ఓటర్లలో 1,42,415 ఫారాలు (62.72%)

మండపేట -- 2,21,015 ఓటర్లలో 1,69,353 ఫారాలు (76.63%)

రాజానగరం -- 2,17,026 ఓటర్లలో 1,30,510 ఫారాలు (60.14%)

రాజమహేంద్రవరం సిటీ -- 2,65,721 ఓటర్లలో 1,07,226 ఫారాలు (40.35%)

రాజమహేంద్రవరం రూరల్ -- 2,73,582 ఓటర్లలో 1,32,591 ఫారాలు (48.46%)

కొవ్వూరు (ఎస్సీ) -- 1,84,859 ఓటర్లలో 1,17,220 ఫారాలు (63.41%)

నిడదవోలు -- 2,13,996 ఓటర్లలో 1,28,288 ఫారాలు (59.95%)

గోపాలపురం (ఎస్సీ) -- 2,43,471 ఓటర్లలో 1,38,497 ఫారాలు (56.88%)

100 శాతం ఎన్యూమరేషన్ పూర్తి చేసిన బీఎల్‌వోలకు కలెక్టర్ కీర్తి చేకూరి అభినందనలు

ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ూ×=) కార్యక్రమంలో భాగంగా మండపేట అసెంబ్లీ నియోజకవర్గంలోని మండపేట రూరల్ మండల పరిధిలోని పోలింగ్ స్టేషన్ నెం.22 (జెడ్. మేడపాడు)లో బీఎల్‌వో ఎం. సూర్యకుమారి (వీఆర్వో), పోలింగ్ స్టేషన్ నెం.21 (చిన్న ద్వారపూడి)లో బీఎల్‌వో ఎ. దుర్గాప్రసాద్ (వీఆర్ఏ) తమ పరిధిలోని ఓటర్లందరికీ ఎన్యూమరేషన్ ప్రక్రియను పూర్తి చేసి 100 శాతం లక్ష్యాన్ని సాధించడం పట్ల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కీర్తి చేకూరి అభినందించారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన బీఎల్‌వోలు కూడా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలని ఆమె సూచించారు. జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో 100 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. మిగిలిన ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

## సమాచార పౌర సంబంధాల శాఖ
# డిప్యూటీ డైరెక్టర్ గా పద్మజ బాధ్యతలు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూలై 5(ప్రభాతవార్త):** కాకినాడ జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ నూతన డిప్యూటీ డైరెక్టర్ గా నియమితులైన బి పద్మజ ఆదివారం కాకినాడ డిఐపిఆర్ఓ కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్గా పని చేస్తున్న ఆమె పదోన్నతిపై కాకినాడ జిల్లా డిప్యూటీ డైరక్టర్గా నియమితులయ్యారు. ఇప్పటి వరకూ కాకినాడ జిల్లా ఇన్చార్జి డీడీ వ్యవహరించిన సమాచార పౌర సంబంధాల శాఖ జోన్ -2 జాయింట్ డైరెక్టర్ పి తిమ్మప్ప ఆమెకు డిడి చార్జ్ అప్పగించి అభినందనలు తెలియజేశారు. సమాచారశాఖ కార్యాలయ అధికారులు, సిబ్బంది డీడీ పద్మజకు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డిడి పద్మజ మాట్లాడుతూ కాకినాడ జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్గా బాధ్యతలు స్వీకరించడం తనకు లభించిన గొప్ప అవకాశంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, పాత్రికేయులను సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని డీడీ పద్మజ తెలిపారు.

## ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు
# అవగాహన కల్పించాలి
### జిల్లా వ్యవసాయ అధికారి బి. వెంకటేశ్వరరావు



**రాజమహేంద్రవరం అర్బన్ జులై 5 ప్రభాతవార్త** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో జిల్లాలో ఖరీఫ్ సాగు పరిస్థితులు, మండలాల వారీగా పంటల స్థితిగతులు, వర్షాధార చెరువుల కింద సాగు విస్తీర్ణం, విత్తనాల లభ్యత, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలపై జిల్లా వ్యవసాయ అధికారి బి. వెంకటేశ్వరరావు అధ్యక్షతన వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో ఆదివారం కలెక్టరేట్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాలు ఆలస్యమయ్యే లేదా తక్కువగా కురిసే అవకాశాలున్న నేపథ్యంలో రైతులను ముందస్తుగా అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వర్షాధార చెరువుల కింద సాగు చేసే రైతులకు పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించి, అవసరమైన విత్తనాలను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. మండలాల వారీగా పంటల పరిస్థితిని సమీక్షించిన ఆయన, వ్యవసాయ, ఉద్యానవన, నీటిపారుదల, భూగర్భ జలాలు, మత్స్య, పశుసంవర్ధక శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి రైతులకు సాంకేతిక సూచనలు అందించాలని తెలిపారు. ఎల్‌నినో పరిస్థితులపై విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించి, రైతులు సరైన సాగు నిర్ణయాలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ (APCNF) ఆధ్వర్యంలో రూపొందించిన అవగాహన పోస్టర్లు, కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో జిల్లా సహజ వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ బి. తాతారావు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ విశ్వవిద్యాలయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# మెనూ పక్కాగా అమలు చేయాలి





**రంపచోడవరం, జూలై 5 ప్రభాతవార్త** పోలవరం జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధన ప్రకారం పక్కగా మెనూ అమలు చేయాలని పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం స్థానిక డిగ్రీ కళాశాల సమీపంలో ఉన్నటువంటి గురుకుల బాలికల పాఠశాలను పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్,రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ పోలవరం జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో,గురుకుల పాఠశాలల్లో చదువుచున్న విద్యార్థులకు విద్యతోపాటు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన అన్నారు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఒకటికి రెండుసార్లు విద్యను బోధించాలని ఆయన అన్నారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు అర్థమవుతున్నది లేనిది ఆయన ఆరా తీశారు. విద్యార్థులకు ఈ సంవత్సరం బట్టలు, పుస్తకాలు విద్యా సామాగ్రి అందినది లేనిది జిల్లా కలెక్టర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల పరిధిలో ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన అన్నారు. ఈ పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు ఉన్నది అదేవిధంగా ఎంతమంది ఉపాధ్యాయులు ఉన్నది ఆయన ఆరా తీశారు. పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ప్రతిరోజు విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ అమలు చేసి ఎప్పటికప్పుడు వేడివేడి ఆహార పదార్థాలు తయారుచేసి విద్యార్థులకు పెట్టాలని ఆయన అన్నారు. ప్రతి నెల నిత్యవసర సరుకులు పాలు,గుడ్లు, కోడి మాంసం, కాయగూరలు వెండర్లు ఏ విధముగా సరఫరా చేయుచున్నది ఆయన ఆరా తీశారు.విద్యార్థులు ఎవరికైనా అనారోగ్యంగా ఉన్న ఎడల వెంటనే ఆసుపత్రికి తీసుకుని వెళ్లి వైద్యం చేయించాలనీ ఆయన అన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన అన్నారు. అనంతరం విద్యార్థుల క్లాస్ రూములు, విద్యార్థులు పడుకొనే రూములు అదేవిధంగా స్టోర్ రూమును పరిశీలించారు. ప్రతిరోజు భోజనము కూరలు రుచికరంగా ఉంటున్నది లేనిది విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.అదేవిధంగా జిల్లా కలెక్టర్ వారి చేతుల మీదుగా విద్యార్థులకు భోజనం వడ్డించడం జరిగింది. అనంతరం విద్యార్థులకు ప్రతిరోజు ఆహార పదార్థాలు ఏ విధంగా పెట్టుచున్నది అదేవిదంగా విద్యార్థులతో కలిసి భోజనం చేయడం జరిగింది. జిల్లా కలెక్టర్ వారి వెంట గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శబరి వంతెన వద్ద పుష్కాలంగా నదిలో చేపలు

**రోడ్డు పై బారులు తిరుతున్న కొనుగోలు దారులు.**

**ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం. పొంచి ఉన్న ప్రమాదం.**

**చింతూరు జూలై 5 ప్రభాత వార్త.**చింతూరు శబరి వంతెన వద్ద ఫ్రెష్ గా బతికున్న పెద్ద పెద్ద నదిలో చేపలు లభిస్తున్నాయి. వర్షాలు పడితే గోదావరి, శబరి నదుల్లో నీరు రంగు మారటంతో ఎప్పుడు దొరకని స్థాయిలో ఇక్కడ చేపలు పుష్కాలంగా దొరుకుతాయి. చేపలు గుడ్లు పెట్టె సమయం కావటంతో నీరు రంగు మారాగానే ఆడ, మగ చేపలు వాటి సంతానాన్ని వృద్ధి చేసుకోవటం కోసం హడావిడి చేస్తూ ఇటునుంచి అటు, అటు నుంచి ఇటు తిరిగుతూ ఆడ చేపలు గుడ్లను విడుచుకుంటూ కిలోమీటర్లు కొద్ది ప్రయణం



చేస్తాయి. మగ చేపలు కూడా ఆడ చేపలు వదిలిన గుడ్లు ఫాలదీకరణం చేయటానికి వాటి ప్రయత్నం అవి చేస్తాయి. ఇది ప్రకృతి ధర్మం. ఐతే మనిషి చాలా మేధావి కాబట్టి చేపల హడావిడిని పసిగట్టి వలలు వేయటంతో వందలాది చేపలు వలలకు చిక్కుతాయి. కొన్ని చేపల్లో జన(చన )(గుడ్లు ) చేప సైజును బట్టి కిలో నుండి 5,10 కేజిలవరకు జన ఉటుంది. అవే చేప గుడ్లు. ఒక్క చేప పట్టు బడితే కొన్ని కోట్ల గుడ్లు(పిల్లలు )నాశనం అయినట్టే. అందుకే సముద్రాల్లో ఈ సమయంలో చేపల వేట నిషేదిస్తారు.చేపలు దొరికే టైం కూడా ఇదే కావటంతో చేపల ప్రియులు వాటిని కొనుగోలు చేయటానికి గుమిగుడుతున్నారు. అసలె శబరి వంతెన చివర, అప్రూచ్ రోడ్డు డౌన్, సైడ్ మార్జిన్ చాలా తక్కువ, చేపలకోసం వచ్చే జనం, వారు వచ్చే బండ్లు, అక్కడ ఆగే కార్లు, ఆటోలు ఇలా అనేక వాహనాలను రోడ్డుపై అపుతున్నారు. ఇది ప్రమాదకరం. ఏదేని వాహనం అదుపు తప్పితే పెను ప్రమాదమే. ఈ విషయం అందరికి తెలిసిందే.అయినా తప్పని, చేపల అమ్మకాలు, కొనుగోలు. ప్రమాదం జిరిగితే మాత్రం అధికారులు, మీడియా పట్టించుకోలేదు అంటారు. అధికారులు, మీడియా పట్టించుకుంటే అక్కడ నుండి ప్లేస్ మార్చాలి. అది వ్యాపారులకు నచ్చదు, కొంత నష్టం కూడా. చిన్న వ్యాపారులు అని చూడకుండా మా పొట్టకోట్టారు అంటారు. పదిమంది తిట్టిన



పర్వాలేదు కానీ ప్రమాదం జరిగి ఎవరి ప్రాణాలు పోకముందె మేలుకొని చేపల అమ్మకాలు పక్కనే ఉన్న సంతలో జరిగేలా చూడాల్సిన అవసరం ఉంది. లేదా ఏదైనా ప్రమాదం జరిగితే చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకోవటమే. ఇది వస్తవ పరిస్థితి. దాంతో పాటు నదిలో చేపలు కుప్పలు కుప్పలుగా దొరుకుతున్నాయి. కాబట్టి ఒక కీజీ రూ 250 లకు అమ్ముతున్నారు. ఇది కాస్త ఎక్కువ రేటు. ఈ సీజన్ వరకు అయినా కాస్త రేట్లు తగ్గించి అమ్మేలా చూడాలని చేపల కొనుగోలుదారులు కోరుతున్నారు. మరి ఎంజరుగుతుందో వేచి చూద్ధం.

## పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్లూరి వేషధారణతో అల్లూరికి నివాళి




**పెద్దాపురం జూలై 05 (ప్రభాత వార్త )** విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యంలో అల్లూరి వేషధారణతో అల్లూరి సీతారామరాజుకి నివాళి అర్పించారు. వరాహలయ్యపేట యాసలపు సూర్యారావు భవనం వద్ద ఉన్న అల్లూరి విగ్రహానికి సాహితీ స్రవంతి గౌరవ అధ్యక్షులు చల్లా విశ్వనాధం, పీసీసీ గౌరవ అధ్యక్షులు బుద్ధా శ్రీనివాస్ పాతబస్టాండ్ వద్ద ఉన్న అల్లూరి విగ్రహానికి పెద్దాపురం చరిత్రకారుడు వంగలపూడి శివకృష్ణ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీసీసీ ఆధ్వర్యంలో అల్లూరి వేషధారణలు వేయడం చాలా ఆనందం అన్నారు. మన్యం లో పోరాటం నడిపి గిరిజనులకు అండగా నిలిచారాణి అన్నారు. చదువు నేర్పించడం, మద్యానికి ప్రజలను దూరం చేయడానికి ప్రయాతించారాని అన్నారు. అల్లూరి ఆశయాలను మనందరం ఆదర్శనంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం లో పీసీసీ అధ్యక్ష కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్, నెక్కల అనూష, ఉట్టా అంజలి, వానపల్లి సాయి, తేజ, పవన్, మణికంఠ పాల్గొన్నారు. కొల్లి రాజు, నిఖిల, సాహితీ, రీత్విక్ సూర్యావర్ధన్, మహన్స్, లిఖిత, యస్వంత్, పరిణితి, బంగారుబాబు తదితరులు అల్లూరి వేషధారణ వేశారు. కేదారి నాగు, గోందేశీ సత్యనందం మేకప్ చేసారు.

## మాడి పల్లి కాలనీలో వాహనాల తనిఖీ చేసిన దేవీపట్నం ఎస్ఐ షరీఫ్



**దేవీపట్నం, జూలై 5 ప్రభాతవార్త :** దేవీపట్నం మండలంలోని మడిపల్లి కాలనీలో ఎస్ఐ షరీఫ్ ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. మోటారు వాహనాల చట్టం (ఎంవీ యాక్ట్) నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై ఈ-చలాన్లు విధించినట్లు ఎస్ఐ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గన్నారు.

## అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజల ఇక్కట్లు



**కాట్రేనికోన జూలై 05 (ప్రభాతవార్త)** కాట్రేనికోన మండలంలో అప్రకటిత విద్యుత్ కోతలతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేళ పాల లేకుండా ఎప్పటికపుడు సరఫరా నిలిపివేయడంతో చీకట్లో,ఉక్కపోతతో ప్రజలంతా ఇబ్బంది పడుతున్నామంటున్నారు. కాట్రేనికోన పరిధిలో గత రెండు నెలల కాలంగా విద్యుత్ కోతలతో ప్రజలు విసుగెత్తిపోతున్నారు. గచ్చకాయలపొరలో ఆయిల్ వెలికితీసే ఓ ప్రైవేట్ సంస్థ డ్రిల్ సైట్ కి వెళ్తున్న వాహనాల పేరుచెప్పి ఎప్పుడుబడితే అప్పుడు కరెంట్ సరఫరా తీసేస్తున్నారు. దీనిపై కనీసం వినియోగదారులకు సమాచారం ఇవ్వట్లేదు. ఇదేమిటని ఎవరైన వినియోగదారులు విద్యుత్ కార్యాలయానికి, సంబంధిత అధికారులకు పోన్ చేస్తున్నా సరైన సమాచారం, స్పందన ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, సిబ్బంది తీరుతో విద్యుత్ సరఫరా లేక ఇళ్లలో చిన్నారులు, వృద్ధులు, వ్యాధులతో బాధపడేవారు తీవ్ర ఇబ్బంది పడుతున్నామంటున్నారు. వర్షాకాలం ప్రారంభం అయినా ఎల్ నినో ప్రభావంతో ఉక్కపోత ఎక్కువగా ఉంది. వేడిమిని ప్రజలు భరించలేకున్నారు.దానితోపాటు కొద్దిపాటి గాలులు వీచినా సరఫరా నిలిపివేస్తున్నారు. తమ ఆవేదనను ఎవరికి చెప్పాలో తెలియక సతమతం అవుతున్నామంటున్నారు. నెలల తరబడి విద్యుత్ కోతలతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నా ప్రజా ప్రతినిధులు స్పందించకపోవడం దారుణమని ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీని వెనుక ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనికితోడు కాట్రేనికోనలో పని చేసే విద్యుత్ శాఖ సిబ్బంది మండల పరిధి లో నివాసం ఉండటం లేదని అంటున్నారు. గ్రామాల్లో ఎక్కడైనా సరఫరా లో అంతరాయం ఏర్పడితే దానికి మరమ్మతులు చేసేందుకు చాలా సమయం పడుతుందని అంటున్నారు. అంతవరకు తామంతా చీకట్లోనే ఇబ్బంది పడుతున్నామని ప్రజలంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ సరఫరా లో అంతరాయం లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రజలంతా కోరుతున్నారు.

## రామాలయంకి మైక్ సెట్ కంబాల శ్రీనివాసరావు రూ.27,500 విరాళం



**అడ్డతీగల,జూలై 05, ప్రభాతవార్త** అడ్డతీగల మండలం నూకరాయి గ్రామంలోని రామాలయానికి మైక్ సెట్ కొనుగోలు చేయడానికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు రూ.27,500 నగదు విరాళాన్ని గ్రామ గిరిజనులకు అందజేశారు. కంబాల శ్రీనివాసరావు అందించిన విరాళంతో గ్రామ గిరిజనులు నూతన మైక్ సెట్‌ను కొనుగోలు చేశారు. అనంతరం ఆ మైక్ సెట్‌ను కంబాల శ్రీనివాసరావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు, కంబాల శ్రీనివాసరావు నుపూలమాలతో ఘనంగా సత్కరించి, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మెల్యే బండారు ను కలిసిన రావులపాలెం నూతన సీఐ



**కొత్తపేట, జూలై 5 (ప్రభాతవార్త)** రావులపాలెం టౌన్ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన రమేష్ బాబు ఆదివారం వాడపాలెంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ను మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సీఐ రమేష్ బాబుకు శుభాకాంక్షలు తెలియజేశారు ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఎటువంటి విఘాతం కలగకుండా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు

## అంగన్వాడీలకు ఎలక్ట్రికల్ స్టవ్ లుపంపిణీ చేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ:



**జిల్లాజగ్గంపేట జులై 5 (ప్రభాతవార్త)** జగ్గంపేట రావులమ్మ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లు, కుక్కర్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లు, కుక్కర్లు పంపిణీ చేశారు. అలాగే ఆడపిల్లలు పుట్టిన తల్లిదండ్రులకు మొక్కలు అందజేశారు. భారత ప్రధాని మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంధన పొదుపే లక్ష్యంగా ముందుగా అంగన్వాడీ కేంద్రాలకు ఎలక్ట్రికల్ స్టవ్‌లు అందించడం జరిగిందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ స్పష్టం చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో సిబ్బంది ముందుంటున్నారని కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు. ఆడపిల్లలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో మొక్కలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు ( కొండబాబు) కూటమి నాయకులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ మట్టి రవాణాపై గ్రామస్తుల తిరుగుబాటు జేసీబీ, రెండు ట్రాక్టర్ల సీజ్



**అడ్డతీగల, జులై 05, ప్రభాతవార్త** అడ్డతీగల మండల పరిధిలోని కొనలోవ గ్రామంలో అక్రమ మట్టి రవాణా కలకలం రేపింది. గ్రామంలోని 'దొర చెరువు' నుండి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తుండటాన్ని గమనించిన గ్రామస్తులు ఏకమై ఘటనా స్థలానికి చేరుకున్నారు. మట్టి తోలుతున్న ఒక జేసీబీ, రెండు ట్రాక్టర్లను అక్కడికక్కడే అడ్డుకుని నిలిపివేశారు. ?గ్రామస్తులు వెంటనే ఈ అక్రమ రవాణాపై స్థానిక తహసిల్దార్ తేజస్వినికి చరవాణిలో సమాచారం అందించారు. సమాచారం అందుకున్న తహసిల్దార్ వెంటనే స్పందించి, సిబ్బందిని ఘటనా స్థలానికి పంపించారు. ప్రాథమిక విచారణలో ఎలాంటి అనుమతులు లేవని తేలడంతో అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను,జేసీబీని అధికారులు సీజ్ చేశారు.? మండలంలో ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి, చెరువుల ఉనికిని దెబ్బతీస్తూ అక్రమ తవ్వకాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తాసిల్దార్ తేజస్విని హెచ్చరించారు. అక్రమ రవాణాను సకాలంలో అడ్డుకుని, అధికారులకు సమాచారం అందించిన కొనలోవ గ్రామస్తులను పలువురు అభినందించారు.

## వాడపల్లి వెంకన్న నిత్యాన్న పథకానికి రూ,1,16,001/-విరాళం...



**ఆత్రేయపురం, జూలై,05,(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం నిత్యాన్న పథకానికి రావులపాలెం చెందిన కుడిపూడి శ్రీనివాసరావు, విజయలక్ష్మి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ. 1,16,001/- విరాళంగా అందించారు. స్వామివారి దర్శనం అనంతరం వారికి ఆలయ అర్చకులు వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా. ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు శ్రీ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

## ఆషూర్ ఖానాలకు నిధులు విడుదల




**మామిడికుదురు.జూలై 05(ప్రభాతవార్త)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఉన్న 75 ఆషఉర్ ఖానా(పంజా)లకు నిధులు విడుదల అయ్యాయని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు.నగరం పంజేషా వద్ద ఆషఉర్ ఖానా నిర్వాహకులకు ఆదివారం ఈ నిధులను ఎమ్మెల్యే అందజేశారు. మొహర్రంలో ఆషఉర్ ఖానాల నిర్వాహణ నిమిత్తం ఒక్కొక్క పంజాకు రూ.5వేలు వంతున ప్రభుత్వం విడుదల చేసిందన్నారు.గత ప్రభుత్వ హయాంలో ఎన్నడూ ఈ నిధులు విడుదల కాలేదన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ నిధులు విడుదల చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ఆబేద్ అలి,ఆగా హెబతుల్ హుస్సేన్,కిష్వర్ అబ్బాస్,ఆగా బాఖర్ హుస్సేన్,అబ్బాస్ అలి,సయ్యద్ రజి తోపాటు పంజాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## హెచ్. వి.లకు పి. హెచ్. ఎన్ లుగా పదోన్నతులు



**రాజవొమ్మంగి, జూలై 05, ప్రభాతవార్త**
రాజవొమ్మంగి మండలంలో గల మూడు పి. హెచ్. సి ల్లో విధులను నిర్వహిస్తున్న నలుగురు హెచ్. వి లకు పి. హెచ్. ఎన్ గా పదోన్నతులను పొందారు. రాజమండ్రి ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు కార్యాలయంలో శనివారం ఉదయం నుండి ఆర్. జె. డి. బి సుజాత కౌన్సిలింగ్ ను నిర్వహించారు. రాజవొమ్మంగి పి. హెచ్. సి లో పనిచేస్తున్న హెచ్. వి. అప్పలనర్స కు కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం కాండ్రకోట, లాగరాయి పి. హెచ్. సి లో పని చేస్తున్న లొసుల లక్ష్మమ్మ కృష్ణాజిల్లా మచిలీపట్నం సమీపంలో తాళ్ళపాలెం ఆసుపత్రికి బదిలీ అయ్యారు. జడ్డంగి పి. హెచ్. సి లో పనిచేస్తున్న హెచ్. వి. నీలాద్రి లక్ష్మి ( కాకినాడ సమీపంలో తూరంగి ), మరో హెచ్. వి భూముల వెంకటరమణ ఎన్టీఆర్ జిల్లా చౌటిపల్లికి బదిలీలు జరిగాయి. పోలవరం జిల్లాలో 15 మంది హెచ్. వి లకు పి. హెచ్. ఎన్ లుగా పదోన్నతులు వచ్చాయి.

## అంతర్వేది స్వామివారి సేవలో ఇన్కమ్టాక్స్ కమిషనర్....



**సఖినేటిపల్లి జూలై 5, ప్రభాత వార్త:** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంను ఏపీ ఇన్కమ్టెక్స్ కమిషనర్ అభిజిత్ మిశ్రా దంపతులు స్వామివారిని దర్శించుకొన్నారు. ఆలయ సాంప్రదాయ ప్రకారం అర్చక స్వాములు స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించినారు. శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారికి కుంకమ పూజలు చేసినారు. వేద పండితులు వేదాశిర్వాదం అందించగా, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ నాగవర ప్రసాద్ స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో టి డి ఎస్ నోరి సూర్యనారాయణ, సిబ్బంది, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మౌలానా కు ఘన వీడ్కోలు



**మామిడికుదురు.జూలై 05(ప్రభాతవార్త)** మొహర్రం సందర్భంగా నగరం,మామిడికుదురు గ్రామాలలో జరిగే మజ్లిస్ లను ఆలపించడానికి లక్నో నుంచి వచ్చిన మత ప్రభోదకులు మౌలానా సయ్యద్ మహమ్మద్ కాజ్మి నజఫీ కి స్థానిక ముస్లింలు ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా స్థానిక పంజేషాలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.20 రోజులు జరిగిన మొహర్రం సంతాప కార్యక్రమాల్లో కాజ్మి పాల్గొని కర్బలా పుణ్య భూమిలో హజ్రత్ ఇమామ్ హుస్సేన్ తోపాటు కుటుంబ సభ్యులు వీర మరణం పొందిన సంఘటనలను భక్తులకు వివరించారు. అంజుమనే రఫాహేఆమె హుస్సేనీసంఘంఅధ్యక్ష,కార్యదర్శులతోపాటు గ్రామస్తులు మౌలానాకు వీడ్కోలు పలికారు.

## మోటార్ బైక్ ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు..

### ఏలేశ్వరం తరలింపు



**రాజవొమ్మంగి, జూలై 05, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలం బోర్నగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాల వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగిన బైక్ ప్రమాదంలో మహిళ తల వెనుక భాగం తీవ్రగాయాలు అయ్యాయి. పశ్చిమ గోదావరి జిల్లా మార్టేరు గ్రామం నుండి రాజవొమ్మంగి మండలం కొత్తకింద్ర అమ్మగారింటికి ఎల్. వెంకటలక్ష్మి, భర్త ఏసుబాబు, చిన్నబాబుతో మోటార్ బైక్ పై వస్తున్నారు. బోర్నగూడెం గ్రామంలో గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాల వద్ద వచ్చే సరికి ఎదురుగా ఏలేశ్వరం వైపు వెళుతున్న మోటార్ బైక్ వారు ఈబైక్ ను రాసుకొంటూ వెళ్లగా బైక్ వెనుక ఉన్న వెంకటలక్ష్మి రోడ్డుపై పడిపోవడంతో తల వెనుక భాగం తీవ్ర గాయం కావడంతో జడ్డంగి పి. హెచ్. సి కి తీసుకొని వచ్చారు. స్టాఫ్ నర్స్ నాగలక్ష్మి తల భాగంలో కుట్లు వేసి ప్రాథమిక చికిత్స చేసి ఏలేశ్వరం రిఫర్ చేయగా 108 వాహనంలో తరలించారు. మోటార్ బైక్ డీ కొన్న వారు వెళ్లిపోయారని ఏసుబాబు అన్నారు.

## ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, జూలై 5,(ప్రభాతవార్త)** కొత్తపేట నియోజకవర్గం కొత్తపేట మండలం వాడపాలెం గ్రామంలో నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ కార్యక్రమంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొన్నారు ఈ సందర్భంగా బూత్ లెవెల్ అధికారి నుండి ఎన్యూమరేషన్ పత్రాలను స్వీకరించిన ఎమ్మెల్యే వాటిని పరిశీలించి అవసరమైన వివరాలను నమోదు చేసి సంతకం చేసి అందజేశారు ఓటర్ల జాబితాలో ఖచ్చితత్వం పారదర్శకత కోసం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ సమర్థవంతంగాఉపయోగపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా ప్రజలందరూ ఈ కార్యక్రమానికి సహకరించాలని కోరారు ఈ కార్యక్రమంలో కొత్తపేట ఏ ఈ ఆర్ ఓ తహసిల్దార్ వై రాంబాబు సూపర్‌వైజర్ పి ఆర్ ఆర్ డి ఐ శుభాకర్ బాబు డిప్యూటీ ఎంపీడీవో జి నారాయణరావు వాడపాలెం పంచాయతీ కార్యదర్శి శాంతి బూత్ లెవెల్ అధికారి వి సినాలిక బూత్ లెవెల్ ఏజెంట్ కడియం భాస్కర్ రావు పాల్గొన్నారు

## రోడ్డు వేసారు.. గుంత మరిచారు



**కాట్రేనికోన జూలై 05 (ప్రభాతవార్త)** మహీపాల చెరువు పల్లంకుర్రు ప్రధాన ఆర్అండ్ బి రోడ్డు కాట్రేనికోన పరిధి తిమ్మాపురంలో రోడ్డు పక్కన ఏర్పడిన గుంత ప్రమాదకరంగా ఉందని వాహనదారులు వాపోతున్నారు. ఈ రోడ్డును నిర్మించి ఏదేనిమిదేళ్ళ కాలం గడవడంతో చాలాచోట్ల గుంతలు పడ్డాయి. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు చొరవతో రోడ్డు మరమ్మతులకు 30 లక్షలు మంజూరు చేయించారు. దీనికి సంబంధించి ఇటీవల సంబంధిత అధికారులు గుంతలకు తారు వేయించారు. తిమ్మాపురంలో చేపట్టిన పనులపై పలువురు ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ రోడ్డు పక్కనే ఏర్పడిన గుంతను వదిలేసి మిగిలినచోట రోడ్డు వేయడంపై ఆందోళన చెందుతున్నారు. రోడ్డుపై వెళ్లినపుడు గుంతలో పడి ప్రమాదం బారిన పడితే ఎవరు బాధ్యత వహిస్తారని అంటున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో ప్రజల ప్రాణాలకు ముప్పు ఉందని భయాందోళన చెందుతున్నారు. ప్రమాదాలు జరగకుండా త్వరితగతిన గుంతను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

## యూఏఈ ఎన్నారై కోఆర్డినేటర్‌గా పోతురాజు...



**సఖినేటిపల్లి జూలై 5, ప్రభాత వార్త:** యూఏఈ ఎన్నారై జనసేన పార్టీ కోఆర్డినేటర్‌గా పోతురాజు తాతాజీ కి అభినందనలు పలువురు జనసేన నాయకులు తెలియజేశారు. సఖినేటిపల్లి మండలం అంతర్వేది దేవస్థానం గ్రామం చెందిన చిన్నా కేసరి త్రిమూర్తులు సమర్థ నాయకత్వం-మార్గ దర్శకత్వంలో గల్ఫ్ జనసేన సభ్యులకు వరుసగా కీలక బాధ్యతలు దక్కడం గర్వకారణం. వారి నాయకత్వంలో మరింత మంది ప్రవాస తెలుగు సేవకులకు అవకాశాలు లభించి, తెలుగు ప్రవాసుల సంక్షేమానికి విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షిస్తున్నారు. పోతురాజు తాతాజీ (చిన్నా)కు నూతన బాధ్యతలను విజయవంతంగా నిర్వహిస్తూ, తెలుగు ప్రవాసులకు సేవలందించి, సంస్థకు మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని గల్ఫ్ జనసేన టీమ్, యూఏఈ, సౌదీ అరేబియా, కువైట్, బహ్రెయిన్, ఒమన్, ఖతర్, సంఘాలు శుభాకాంక్షలు తెలియజేశారు. రాజోలు జనసేన పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## తోటి కార్మికుని కుటుంబానికి అండగా నిలిచిన పెయింటర్ల సంఘం.



**తాళ్లరేవు, జూలై 5 (ప్రభాతవార్త)-** అనారోగ్యంతో మరణించిన తోటి కార్మికుని కుటుంబానికి తాళ్లరేవు ఇంద్రధనస్సు పెయింటర్ల సంఘం అండగా నిలిచింది. ఇటీవల తాళ్ళరేవు పంచాయతీ పరదేశమ్మ వారి వీధి కి చెందిన పెయింటింగ్ కార్మికుడు మల్లాడి శ్రీనివాస్(వాసు) అనారోగ్యంతో చనిపోగా, అతని కుటుంబానికి రూ.21 వేలు, కిరాణా, నిత్యావసర సరుకులు ఆదివారం వాసు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

## దంగేరు శివారులో అగ్ని ప్రమాదం



**కె.గంగవరం, జులై 05, (ప్రభాతవార్త):** కె గంగవరం మండలం దంగేరు శివారు చిన్న హరిజన పేట వద్ద జరిగిన అగ్ని ప్రమాదంలో పశువుల పాక, గడ్డివాము అగ్నికి ఆహుతి అయినట్లు స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న ఫైర్ ఆఫీసర్ వెంకట్ రెడ్డి తన సిబ్బందితో మంటలను అదుపు చేసినట్లు తెలిపారు. వివరాల్లోకి వెళితే గొల్లపల్లి సత్యనారాయణ కు చెందిన పశువుల పాక, మేడిశెట్టి బాలకృష్ణ వెంకటరమణ లకు చెందిన గడ్డివాములు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.60,000 ల నష్టం సంభవించినట్లు అంచనా వేశారు.



## శ్రీ నృసింహాలయంలో పారాయణం....

**సఖినేటిపల్లి జూలై 5, ప్రభాత వార్త:** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో కాకినాడ వాస్తవ్యులు శ్రీ కృష్ణ పరివార్ సంఘం అధ్యక్షులు మాధురి ఆధ్వర్యంలో 18 రకాల పారాయణలు స్వామికి సమర్పించారు. సుమారు 150 మంది సంఘ సభ్యులు పాల్గొని పారాయణం నిర్వహించారు. వారికి కావలసిన ఏర్పాట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మోకా నాగవర ప్రసాదు ఆలయం తరుపున ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు 6లో

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## ర్యాలి లో ఘంటసాల 104వ జయంతి వేడుకలు...



**ఆత్రేయపురం, జూలై 05,(ప్రభాత వార్త)** ఘంటసాల 104వ జయంతి సందర్భంగా పూణే, ఉభయ రాష్ట్రాలకు చెందినటువంటి 18 మంది ట్రాక్ సింగర్స్ వాళ్ళ మధురమైన పాటలతో ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో ఆబ్రక దబ్ర కళా వేదికలో ఘంటసాల కు ఘంటసాల గానమృతం ఆలపించి ఘన నివాళులర్పించారు. ముందుగా ఘంటసాల ఫోటోతో వేదమంత్రాలతో గ్రామ లో ఊరేగిస్తూ సింగర్స్ ఆబ్రకదబ్రవేదిక చేరుకుని జ్యోతి ప్రజ్వలన తో అనంతరం గాయకులను ఘంటసాల మెమోరియల్ అవార్డుతో శ్యామ్ జాదూగర్ మెగా మ్యాజిక్ ఫ్యామిలీ ఘనంగా సత్కరించి నిర్విరామ 104 పాటలు పాడినందుకు గాయకులకు ఆంధ్ర బుక్ ఆఫ్ రికార్డ్స్ భారత్ టాలెంట్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు డాక్టర్ మోహిత్ సీత అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి ఉన్నత విద్యకు సానా సతీష్ బాబు ఫౌండేషన్ చేయూత




**కాకినాడ రూరల్,జూలై 5 (ప్రభాతవార్త):** సమాజంలో ప్రతిభ కలిగిన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకూడదనే లక్ష్యంతో రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు నిరంతరం విద్యకు ప్రాధాన్యత ఇస్తూ, విద్యార్థులకు అండగా నిలుస్తున్నారు. ఆయన సూచన మేరకు సానా సతీష్ బాబు ఫౌండేషన్ ద్వారా విద్య, వైద్యం, ఉపాధి, సామాజిక సేవా కార్యక్రమాలు నిరంతరం నిర్వహించబడుతున్నాయి. ఈ నేపథ్యంలో బి సి ఎ మొదటి సంవత్సరం చదువుతున్న ప్రతిభావంతుడైన బోడపాటి అజయ్ నిరుపేద విద్యార్థికి ఉన్నత విద్య కొనసాగించేందుకు సానా సతీష్ బాబు ఫౌండేషన్ తరపున ఆర్థిక సహాయ చెక్కును ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా తలాటం హరీష్ మాట్లాడుతూ ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు సానా సతీష్ ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు.

## రావులపాలెం అర్బన్ సిఐగా రమేష్ బాబు



**రావులపాలెం, జూలై 05 (ప్రభాతవార్త) :** రావులపాలెం అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా జి. రమేష్ బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో బాధ్యతలు చేపట్టిన ఆయనకు స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. రాజమండ్రి సిఐడి విభాగం నుండి నుంచి బదిలీపై ఆయన రావులపాలెం అర్బన్ సిఐగా నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇక్కడ సిఐగా పనిచేసిన ఎం.శేఖర్ బాబు రాజమండ్రి విజిలెన్స్ విభాగానికి బదిలీ అయ్యారు. నూతన సిఐగా బాధ్యతలు చేపట్టిన రమేష్ బాబు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెడతానని చెప్పారు.

## అక్రమ రేషన్ బియ్యం పట్టివేత



**ఆలమూరు, జూలై 5, (ప్రభాతవార్త)** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలో మోదుకూరు – నర్సిపూడి రోడ్డులో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్, రెవెన్యూ అధికారులు వారికి అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహిస్తుండగా మినీ వ్యాన్లో అక్రమంగా తరలిస్తున్న 2,570 కేజీల(50 బస్తాలు) రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యం విలువ సుమారు రూ.1.18 లక్షల రూపాయలు ఉంటుందని అధికారులు తెలియజేశారు. ఈ కేసులో నాయుడు సత్య వెంకట శ్రీనివాస్, మచ్చా రాముడులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేయడం జరిగింది. పేద ప్రజల కోసం ప్రభుత్వం ఇస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలియజేశారు.

## జనసైనికుల ఆత్మగౌరవాన్ని కించపరచవద్దు

### సామాజిక మాధ్యమాల వేదికగా జన సైనికులు ఆవేదన

**యు.కొత్తపల్లి, జూలై 5 (ప్రభాతవార్త) :** పార్టీ ఆవిర్భావం నుంచి అహర్నిశలు కష్టపడి పనిచేసిన జనసైనికులకు నేడు కనీస గౌరవం లేదంటూ సామాజిక మాధ్యమాల వేదికగా ఆదివారం ఆవేదన వ్యక్తం చేయడం మండలంలో సంచలనంగా మారింది. పార్టీ కోసం, పవన్ కళ్యాణ్ గెలుపు కోసం అనేక విధాలుగా కష్టపడితే నేడు కనీసం ఆ పార్టీ నాయకులే గుర్తించడం లేదంటూ అసహనం వ్యక్తం చేయడం జరిగింది. ఇక అధికారుల వద్ద కనీస గుర్తింపు లేదని, జనసైనికులను లక్ష్యంగా చేసుకుని నిరాధార ఆరోపణలు, ఇబ్బందులకు గురి చేయడం మానుకోవాలంటున్నామని, ఇతర పార్టీల నాయకులతో అవమానాలు, వ్యతిరేక పరిస్థితులను ఎదుర్కొని జెండాను మోసిన వాళ్ళమని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు నచ్చి పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీయే సర్వస్వమనుకుంటూ ముందుకు సాగుతున్నామని, జనసైనికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు పార్టీకి మేలు చేయవంటూ సామాజిక మాధ్యమంగా ఆవేదన వ్యక్తం చేశారు.

### భక్తుల మనోభావాలకు, ఆధ్యాత్మిక వాతావరణానికి

# భంగం కలిగిస్తే చర్యలు....

### డిప్యూటీ కమిషనర్ ఈఓ , నల్లం .. మాడవీధులలో వ్యాపారులు మైకులు తొలగించిన అధికారులు





**ఆత్రేయపురం జూలై 05,(ప్రభాత వార్త).** కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం మాడ వీధుల్లో కొంతమంది వ్యాపారులు భక్తుల మనోభావాలు దెబ్బతినేలా వారి వ్యాపార ప్రకటనలకు అధిక శబ్దంతో మైకులు వినియోగించడం వల్ల స్వామివారి మాడవీధులలో ప్రదక్షిణలు చేసే భక్తులకు అసౌకర్యం కలుగుతున్నట్లు దేవస్థాన అధికారుల దృష్టికి వచ్చింది. దీంతో దేవస్థాన సిబ్బంది మాడ వీధుల్లో పర్యటించి సంబంధిత వ్యాపారులను హెచ్చరించి, మైకులను వెంటనే తొలగింపజేశారు. భక్తుల దర్శనానికి, మనోభావాలకు, ఆధ్యాత్మిక వాతావరణానికి భంగం కలిగించే చర్యలను సహించబోమని మరల ఎవరైనా మైకులు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

### అడ్డతీగల మండలంలో ముమ్మరంగా

# ఓటర్ల ప్రత్యేక సవరణ సర్వే



**అడ్డతీగల, జూలై 05, ప్రభాతవార్త** అడ్డతీగల మండలంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రత్యేక ఓటర్ సమగ్ర సవరణ సర్వే ఇప్పటివరకు 45.76 శాతం పూర్తయిందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏవీవీ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన వేటమామిడి గ్రామంలో పీఎస్ నం. 101, 102, పాపంపేట గ్రామంలో పీఎస్ నం. 141, వీరభద్రవరం గ్రామంలో పీఎస్ నం. 99, పెద్దమునకనగెడ్డ గ్రామంలో పీఎస్ నం. 4 పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్ల సర్వేలో జిల్లాలోనే మన మండలం వెనకబడి ఉందన్న విషయాన్ని గుర్తు చేశారు. బీఎల్ఓలు, వారి సహాయకులు ప్రతి ఇంటికీ వెళ్లి సర్వేను మరింత వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. మొత్తం ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తూ, వివరాలను ఎప్పటికప్పుడు డిజిటలైజేషన్ చేయాలని సిబ్బందికి స్పష్టం చేశారు.

### యూట్యూబర్ ప్రశ్న రావణ్ అరెస్టు

# కక్ష సాధింపు చర్య.

### విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షులు కుటుంబరావు.

**తాళ్ళరేవు, జూన్ 5( ప్రభాతవార్త):** యూట్యూబర్ ప్రశ్న రావణ్ అరెస్టులు ప్రభుత్వ కక్ష సాధింపు చర్యేనని ప్రముఖ న్యాయవాది, విశ్వజన కళామండలి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు యడ్ల కుటుంబరావు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఒక వ్యక్తి ఒక చోట తప్పు చేసినట్లుగా భావిస్తే ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో చట్టపరంగా కేసు నమోదు చేయాలి. ఒక వ్యక్తిపై ఒకచోట జరిగిన విషయంపై రాష్ట్రంలో ఉన్న అన్ని పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చెయ్యడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. దీనివలన ప్రభుత్వానికి ఎంతో ఖర్చు అవుతుందని, దాని భారం ప్రజలమీద, రాష్ట్ర అభివృద్ధి మీద పడి అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. ఇలాంటి కేసులవలన ప్రజల్లో లేనిపోని అపోహలు కలిగి అల్లర్లు జరిగి, లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తే ప్రమాదం ఉందన్నారు. తప్పు చేసిన వ్యక్తులను శిక్షించాలంటే ఇప్పటి వరకూ జరిగిన అన్నిటిమీద, ఇలాంటి వ్యక్తులు అందరిమీదా ఇలాగే రెండంకెల కేసులు పెడతారా అంటూ ప్రశ్నించారు. చట్టం అందరికి ఒకేలా ఉండాలన్నారు. వ్యవస్థలమీద ప్రజలు నమ్మకం పోయే పరిస్థితులు రాకుండా చూడాల్సిన అవసరం ప్రభుత్వం మీద, యంత్రాంగం మీద ఉందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు ప్రజలు చూస్తూనే ఉన్నారని, న్యాయ వ్యవస్థ కూడా దీనిపై ఖచ్చితంగా స్పందిస్తుందని, ప్రస్తుత పరిస్థితులపై ప్రజాస్వామ్యాన్ని కాపాడే న్యాయవ్యవస్థ జోక్యం అవసరమని పార్టీలు, నాయకుల కక్ష సాధింపు కోసం సామాన్యులు బలైపోకూడదని అన్నారు. ప్రశ్నించడం కోసం పార్టీ పెట్టానని చెప్పిన పవన్ కల్యాణ్ మాకు ఆదర్శం అని ఆయన మాటలను బట్టి చూస్తే ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు పెట్టడం తగదన్నారు. దీనిపై నాయకులు, ప్రజలు మంచి ఆలోచన చేసి రాష్ట్రంలో ఎలాంటి అల్లర్లు జరగకుండా ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఈ సందర్భంగా ఆయన కోరారు

### నేడు ప్రజా సమస్యల

## పరిష్కార వేదిక యధావిధి

### జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్

**అమలాపురం కలెక్టరేట్, జూలై 5 ప్రభాతవార్త**



నేడు జూలై 6వ తేదీన స్థానిక కలెక్టరేట్ కార్యాలయం గోదావరి భవనం నందు ప్రతీ సోమవారం నిర్వహించే మీకోసం.పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెనల్ సిస్టం (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పీజీఅర్ఎస్ ద్వారా ప్రజల నుంచి అర్జీల స్వీకరణ చేపడుతున్నట్టు తెలిపారు. మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. అదేవిధంగా డివిజనల్, మండలస్థాయిలో రెవెన్యూ క్లినిక్ లు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రజలు తమ రెవెన్యూ అర్జీలను ఈ క్లినిక్ ల్లో అందజేయాలని సూచించారు. అర్జీదారులు తమ అర్జీలను ఈ (మీకోసం.ఏపీ.జీవోవి.ఇన్) వెబ్సైట్ నందు కూడా నమోదు చేసుకోవచ్చని, నమోదైన అర్జీల స్థితి,సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100 కి నేరుగా కాల్ చేయవచ్చని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ సదరు ప్రకటన ద్వారా సూచించారు.

## సాహిత్య సభను జయప్రదం చేయండి

### కరపత్రం ఆవిష్కరణ



**పెద్దాపురం, జూలై 05 (ప్రభాత వార్త )** ఈ నెల 11,12 తేదీలలో విజయవాడలో సాహితీ స్రవంతి, జాషువా సంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో జరిగే సాహిత్య సమ్మేళనం జయప్రదం కావాలని ఆశిస్తూ మాజీ మున్సిపల్ చైర్మన్ రాజసూరిబాబు రాజు బ్రౌచర్ ని ఆవిష్కరించారు. జులై 11,12 తేదీలలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన సాహిత్యకారులు, కవులు, సాహితీ వేత్తలు హాజరయి అనేక అంశాలు చర్చించడం జరుగుతుందని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు జోస్యుల కృష్ణబాబు అన్నారు. పెద్దాపురం నుండి సాహిత్యకారులు అందరూ హాజరు కావాలని కోరారు.
ఈ కార్యక్రమం లో సాహితీ స్రవంతి కోశాధికారి వంగలపూడి శివకృష్ణ, సహాయ కార్యదర్శి పూడి శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రెండ్లీ పోలీసింగ్ లో భాగమే పల్లెనిద్ర

### బిసి ఐ వై ఆర్ కే శ్రీనివాస్

**పెద్దాపురం, జూలై 05 (ప్రభాత వార్త )** ప్రజలు పోలీసులు మధ్య సత్సబందాలు పెంపొందించుకునెందుకు గాను ఫ్రెండ్లీ పోలీసింగ్ లో భాగంగా పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పెద్దాపురం సి ఐ వై ఆర్ కే శ్రీనివాస్ అన్నారు.కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు పెద్దాపురం మండలం దివిలి గ్రామంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ లో భాగంగా నేర రహిత సమాజం కోసం పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సిఐవైఆర్కే శ్రీనివాస్ తెలిపారు

**. గుడ్ సమారిటన్ ప్రైజ్ మనీ అవార్డు**

ఈ పథకం కింద ప్రమాద బాధితులకు గోల్డెన్ అవర్ లోపు వైద్య సహాయం అందించడంలో సహాయపడిన వారికి 25 వేల రూపాయల బహుమతి మరియు ప్రశంసా పత్రానికి అర్హులున్నారు.

**రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత అనగా ఉచితంగా చికిత్స పి ఎమ్ రహత్**

1.5 లక్షల వరకు ఉచిత వైద్యం ప్రమాదం జరిగిన తేదీ నుండి ఏడు రోజుల వరకు ఉచిత చికిత్స దేశంలోని అన్ని రకాల రోడ్డు ప్రమాదాలకు వర్తిస్తుంది. 112 హెల్ప్ లైన్ నెంబర్ కు కాల్ చేయండి హిట్ మరియు రన్ ప్రమాద కేసులలో పరిహారం 2 లక్షలు (మరణించిన కేసు లలో), 50,000/- తీవ్రం గా గాయ పడిన కసుల్లో హెల్మెట్ ధరించండి రోడ్డు ప్రమాదాల మరణాలనునివారించాలని కోరారు.

**తాగి వాహనాలను నడపవద్దు**




డ్రంక్ అండ్ డ్రైవ్ ఫైన్ 10,000/-
ఇంట్లో ఎవరూ లేనప్పుడు పగలైనా, రాత్రి అయినా ఎటువంటి విలువైన ఆభరణాలు వస్తువులు, నగదు ఉంచరాదు.

ఒంటరి మహిళలే టార్గెట్గా చైన్ స్నాచర్లు ఉంటారు జాగ్రత్త
బస్సుల లోను, ఆటోల లోను ప్రయాణించేటప్పుడు తోటి ప్రయాణికులు లాగా ప్రయాణిస్తూ బ్యాగ్ లలో పెట్టిన విలువైన ఆభరణాలు, నగదును

**దొంగలించే మహిళా దొంగలు ఉంటారు జాగ్రత్త**

డ్రగ్స్ వద్దు బ్రో గ్రామంలో ఎక్కడ పెడలర్స్ , భూజర్స్ యొక్క మూమెంట్ ఉంటే వెంటనే తెలియజేయాలి లిఏపీ పోలీస్ శక్తి యాప్ ను డౌన్లోడ్ చేసుకుని మహిళల మరియు చైల్డ్ ల భద్రత రక్షణ పొందండి

**బాల్య వివాహాలు చేయవద్దు**

సైబర్ మోసాలు, నేరాలకు గురి కావద్దు లిడిజిటల్ అరెస్ట్ చట్టంలో ఎక్కడా అనేది చట్టం లో ఎక్కడా లేనేలేదు లిఅపరిచిత వ్యక్తుల నుండి వచ్చే వీడియో కాల్స్ లిఫ్ట్ చేయకండి. లిసోషల్ మీడియాలో అసత్య,అసభ్య, అభ్యంతరకర పోస్టింగు లను పెట్టొద్దు మరియు ఫార్వర్డ్ చెయ్యవద్దు.

**లిక్రికెట్ బెట్టింగులు, ఆన్లైన్ గేమ్స్ జోలికి వెళ్ళవద్దు**

లిఎవరైనా ఎటువంటి ఫైర్ క్రాకర్స్ , ప్రేలుడు పదార్థాలు నిలవ మరియు తయారీ సమాచారం ఉంటే వెంటనే పోలీసు వారికి తెలియజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దివిలి గ్రామా నికి చెందిన కూటమి నాయకులు కొత్తెం కోటి, జట్ల విజయబాబు, ఊడీ శ్రీను, సాలిపల్లి నాగభూషణం, జట్ల రాంబాబు, రేలంగి బుజ్జి మరియు యువత గ్రామస్తులు పాల్గొన్నారు.

# కాకినాడ ఆర్.డి.ఓ. ఆదేశాలు బేఖాతర్.

### తూర్పుపేట వివాదాస్పద స్థలంలో గ్రావెల్.



**తాళ్ళరేవు, జూలై 5 (ప్రభాతవార్త):** కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పోలేకుర్రు పంచాయతీ తూర్పుపేట ప్రాంతంలో యానాం ఎస్టిపి ప్లాంట్ ఏర్పాటు చేయబోయే స్థలం వివాదాస్పదమైనదని, హైకోర్టు పరిధిలో ఉందని కాకినాడ ఆర్డిఓ మల్లిబాబు స్పష్టం చేసి, ప్రభుత్వ ఉత్తర్వులను మీడియా ముఖంగా చూపించినా, ఆ వ్యాఖ్యలను యానాం అధికారులు బేఖాతరు చేశారు. ఈ మేరకు శుక్రవారం పోలేకుర్రు పంచాయతీ ప్రజలు, అఖిలపక్ష నాయకులు యానం ఎస్టిపి ప్లాంటు కు వ్యతిరేకంగా జాతీయ రహదారి 216 పై రాస్తారోకో చేసిన విషయం విధితమే. ఈ సందర్భంగా కాకినాడ ఆర్డిఓ మల్లిబాబు వివరణ ఇస్తూ, ఈ ప్రాంతం వివాదాస్పదమైనదని హైకోర్టు ఉత్తర్వులు వెలువడేంత వరకు ఎటువంటి కార్యకలాపాలు ప్రభుత్వ ఉత్తర్వులను చూపించారు. అయినప్పటికీ శనివారం ఆ వివాదాస్పద ప్రాంతంలో కాంట్రాక్టర్ ఒక లారీ గ్రావెల్ ను వేశారు. దీనిపై ఆగ్రహించిన స్థానికులు, అఖిలపక్ష నాయకులు గ్రావెల్ వేసిన ప్రాంతంలో ధర్నా చేశారు. కాకినాడ ఆర్డీవో మల్లిబాబు ప్రభుత్వ ఉత్తర్వులను మీడియా ముఖంగా తెలియజేసినప్పటికీ, యానం అధికారులు ఆ వ్యాఖ్యలను బేఖాతరు చేయడంతో పాటు, ఆ ప్రాంతంలో మరొక విధంగా కార్యకలాపాలు చేయడానికి ప్రయత్నాలు చేయడం, ఆంధ్ర అధికారులకు అవమానకరమని అఖిలపక్ష నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ విషయంపై నియోజకవర్గ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, అమలాపురం ఎంపీ హరీష్ మాధుర్, ఇతర ప్రజాప్రతినిధులు దృష్టి సాధించాలని అన్నారు.దీనిపై త్వరలో జిల్లా కలెక్టర్ ను కలిసి ఫిర్యాదు చేయడానికి మండల అఖిలపక్షం, స్థానిక ప్రజలు సమాయత్తం కానున్నట్లు తెలిసింది

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps